RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 27.03.2025 | సంపుటి : 11 సంచిక : 253 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సర్కారీ విద్యపై నమ్మకం కలిగిస్తున్నాం

విద్యారంగం బలోపేతానికి సూచనల కోసం విద్యా కమిషన్ ఏర్పాటుచేశాం: సీఎం రేవంత్

ఈ విషయంలో కేవలం ప్రభుత్వమే కాదు.. సమాజం కూడా బాధ్యత తీసుకోవాలని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి): ప్రభుత్వవిద్యపై ప్రజల్లో నమ్మకం కలిగిస్తున్నామని వాస్తవానికి ప్రతిస్థాయిలో విద్యారంగం రోజు రోజుకూ క్షీణించిపోతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. శాసన మండలిలో విద్యాశాఖపై సీఎం మాట్లాడారు. "2021లో 3, 5 తరగతుల విద్యార్థులపై నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే జరిగింది. ఈ సర్వే ప్రకారం 75 శాతం మంది విద్యార్థులు కనీస సామర్థ్యాలు చూపట్లేదు. తెలంగాణ ర్యాంకు చివరి నుంచి ఐదో స్థానంలో ఉంది. 3వ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్

రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం

30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

త్వరలోనే కార్డుదారులకు మరిన్ని నిత్యావసర సరుకులు

- కాళేశ్వరం డిజైన్, నిర్మాణం.. ఓ లోపాల పుట్ట
- ప్రాజెక్టుపై విజిలెన్స్ నివేదిక ఆధారంగా చర్యలు
- తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మించి తీరుతాం
- అసెంబ్లీలో స్పష్టం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం ఇస్తామన్న హామీని అమలు చేయబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుదారులతో కలసి అందరికీ దీనిని వర్తింప చేస్తామని అన్నారు. త్వరలోనే ఇతర నిత్యావసర వస్తువులను కూడా కార్డుదారులకు అందిస్తామని ప్రకటించారు. దేశంలోనే తొలి సారిగా ఈ నెల 30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరాకు శ్రీకారం చుడుతున్నట్లు- ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ మేడిగడ్డ అంశంలో విజిలెన్స్ నివేదిక వచ్చిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్డీఎస్ఏ తుది నివేదిక

మిగతా 2లో..

దక్షిణ కొరియాలో కార్చిచ్చు

24 మంది మృతి

సియోల్(జనంసాక్షి): దక్షిణ కొరియాలో దట్టమైన కార్చిచ్చు వ్యాపిస్తోంది. ఈ మంటలను ఆర్పేందుకు స్థానిక అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మంటల కారణంగా ఇప్పటివరకు దాదాపు 24 మంది మృతి చెందారు.

మిగతా 2లో..

తప్పుదోవ పట్టించే ప్రకటనలతో సమాజానికి తీవ్రనష్టం

రాష్ట్రాలకు 'సుప్రీం' కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): తప్పుదారి పట్టించే ప్రకటనలు సమాజానికి తీవ్ర హాని చేస్తాయని భారత సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ విషయానికి సంబంధించి 'ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని' ఏర్పాటు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర

మిగతా 2లో..

ఉప ఎన్నికలు రావు.. అనవసర కంగారు వద్దు

- మేము బీఆర్ఎస్ బాటలో నడవడంలేదు
- అసెంబ్లీలో స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. పార్టీ ఫిరాయింపులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారం సుప్రీంకోర్టులో ఉందని.. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ఎలా మాట్లాడుతారని ప్రతిపక్ష బీఆర్ఎస్, ఎంఐఎం సభలో ఆందోళనకు దిగాయి. స్పీకర్ పోడియం ఎదుట బీఆర్ఎస్, ఎంఐఎం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ.. కోర్టు పరిధిలో

మిగతా 2లో..

ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై సిట్

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టసవరణకు బిల్లు
- ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం
- అసెంబ్లీలో సీఎం కీలక ప్రకటన

హైదరాబాద్(జనంసాక్షి): బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల నిషేధానికి సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల యాప్స్ వల్ల జరుగుతున్న అనర్థాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు తాము అధికా ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. అందుకే తమ ఏడాదికి పైగా పాలనలో ఎలాంటి ఘటనలు

మిగతా 2లో..

తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్

- శాంతిభద్రతల విషయంలో రాజీలేదు
- గత బిఆర్ఎస్ ప్రభుత్వం లాగా వ్యవహరించడం లేదు
- అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి): శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శాంతి భద్రతలు కాపాడేందుకు చాలా మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మతపరమైన ఉద్రిక్త

మిగతా 2లో..

భద్రాచలంలో కుప్పకూలిన భవనం

ఇద్దరు మృతి..పలువురికి గాయాలు

శిథిలాలు కింద మరికొంతమంది?

భద్రాద్రి కొత్తగూడెం(జనంసాక్షి): భద్రాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. భద్రాచలం పంచాయతీ ఆఫీసు దగ్గర నిర్మాణంలో ఉన్న ఓ ఆరంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. భవనంలో పని చేస్తున్న కార్మికుల్లో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది.. ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. జేసీబీలతో శిథిలాలను తొలగిస్తున్నారు. మృతదేహాలను వెలికితీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఇంటి యజమాని శ్రీపతి శ్రీనివాస్ రావు పారిపోయాడు. ఎలాంటి అనుమతులు

మిగతా 2లో..

మా గొంతు నొక్కేస్తున్నారు

సభలో నన్ను మాట్లాడనివ్వట్లేదు • రాహుల్ గాంధీ ఆగ్రహం

న్యూఢిల్లీ (జనంసాక్షి): లోక్‌సభలో తనను మాట్లాడేందుకు అనుమతించడంలేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానిం చారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు మాత్రం ఇది సరైన మార్గం కాదన్నారు. ఏం జరుగుతోందో తనకు తెలియడం లేదని.. మాట్లాడేందుకు అనుమతి కోరినా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడికి సభలో ప్రసంగించే అవకాశం ఇవ్వడం సంప్రదాయమని గుర్తు చేశారు. బుధవారం లోక్‌సభ వాయిదా అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "నేను ఎప్పుడు లేచి నిలబడినా మాట్లాడేందుకు అనుమతించడం లేదు. మేం చెప్పాలనుకొనే అంశాలను లేవనెత్తేందుకు మాకు అనుమతి ఇవ్వడంలేదు. నేనేమీ చేయలేదు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా కూర్చున్నా. ఏడెనిమిది రోజుల నుంచి నన్ను

మిగతా 2లో..

గేమింగ్,ఆన్‌లైన్ బెట్టింగ్‌పై రాష్ట్రాలు చట్టాలు చేయొచ్చు

- కేంద్రం కూడా వీటి కట్టడికి చర్యలు తీసుకుంటోంది
- లోక్‌సభలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి): గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై రాష్ట్రాలు చట్టాలు చేయొచ్చని బుధవారం కేంద్రం వెల్లడించింది. అవి రాష్ట్ర పరిధిలోని అంశాలని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో వెల్లడించారు. వీటికట్టడి కేంద్రం కూడా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. డీఎంకే ఎంపీ దయానిధి మారన్

మిగతా 2లో..

భూభారతి x ధరణి

పోర్టల్‌పై అసెంబ్లీలో వాడీవేడి చర్చ

- పోర్టల్‌పై అసెంబ్లీలో వాడీవేడి చర్చ
- భూభారతి కాదు..భూహారతి అన్న పల్లా
- ధరణి పేరుతో బీఆర్ఎస్ దగా చేసింది
- అందుకే దానిని బంగాళాఖాతంలోకి విసిరాం
- పల్లా వ్యాఖ్యలకు భట్టి ఘాటు సమాధానం
- వచ్చే ఎన్నికల్లో 'భూభారతి'తోనే మా ప్రచారం
- మీకు 'ధరణి'తో వెళ్తే సత్తా ఉందా..?
- బీఆర్ఎస్‌కు మంత్రి పొంగులేటి సవాల్

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ అసెంబ్లీలో 'భూ భారతి'పై వాడీవేడి చర్చ జరిగింది. భూభారతిపై అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది.. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ పథకాలు అమలు చేస్తున్నారని.. ఇది భూభారతి కాదు భూహారతి అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విపక్ష బిఆర్ఎస్ ఆరోపణలను అధికార పక్షం ఘాటుగా తిప్పికొట్టింది. ధరణి పేరుతో ప్రజల భూములను లాక్కున్న దుర్మార్గాలను అడ్డుకున్నామని తెలిపింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి అని భట్టి విక్రమార్క అన్నారు. ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని.. అలానే చేశామని చెప్పారు. ధరణిపై ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతకుముందు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది భూ భారతి కాదని.. భూ హారతి అని ఆరోపించారు. జమాబందీ పేరుతో

మిగతా 2లో..

కమీషన్ లేనిదే పనులు కావు : కేటీఆర్

నిరూపించకపోతే.. క్షమాపణలు చెప్పాలి : భట్టి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు పదోరోజు వాడీవేడిగా కొనసాగింది. పలు అంశాలపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం నడిచింది.

రాపై అమెరికా ఆంక్షలు!

తీవ్రంగా ఖండించిన భారత్

న్యూఢిల్లీ/న్యూయార్క్(జనంసాక్షి): 'రా' పై అమెరికా ఆంక్షల కత్తి వేలాడుతోంది. ఇటీవల 'ది యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలిజియస్ ఫ్రీడమ్' సంస్థ 'రా'పై ఆంక్షలు విధించాలని అక్కడి ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. సిక్కు వేర్పాటువాదుల హత్యకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు రావడమే దీనికి కారణమని ఆంగ్ల వార్తా సంస్థ కథనంలో పేర్కొంది. ఈ కమిషన్ వార్షిక నివేదికను మంగళవారం విడుదల చేసింది. దీనిలో భారత్‌పై మరిన్ని ఆరోపణలు చేసింది. మైనారిటీలు దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. మత స్వేచ్ఛ విషయంలో ఆందోళనకర దేశంగా భారత్‌ను ప్రకటించాలని సూచించింది. 2024లో కూడా భారత్‌లో మతపరమైన మైనార్టీలపై వేధింపులు, దాడులు పెరుగుతున్నాయని అభిప్రాయపడింది. ఈ నివేదికపై భారత్ తక్షణమే స్పందించలేదు. అయితే.. ఈ సంస్థ ఇచ్చిన నివేదికను, సూచనలను ట్రంప్ కార్యవర్గం తప్పనిసరిగా పాటించాలన్న నిబంధన లేదు. వియత్నాంలోని కమ్యూనిస్ట్ పాలకులను కూడా ఈ కమిషన్ నివేదిక లక్ష్యంగా చేసుకొంది. మత వ్యవహారాలను ఆ దేశం నియంత్రిస్తోందని పేర్కొంది. ఆ దేశాన్ని ఆందోళనకర జాబితాలో చేర్చాలని పేర్కొంది. చైనా ను కట్టడి చేసే క్రమంలో అమెరికా పాలకులు భారత్, వియత్నాంతో కలిసి పనిచేస్తున్న సంగతి తెలిసిందే. బీజింగ్‌ను కట్టడి చేయడానికి న్యూదిల్లీ బలమైన శక్తి అని అమెరికా కొన్నేళ్లుగా భావిస్తోంది. ఈనేపథ్యంలో ట్రంప్ కార్యవర్గం భారత నిఘా సంస్థ 'రా'పై ఎటు వంటి చర్యలు చేపట్టకపోవచ్చని నిపుణులు భావిస్తు న్నారు. 2023లో అమెరికా, కెనడాలో సిక్కు వేర్పాటు వాదులను భారత్ లక్ష్యంగా చేసుకొంటోందనే ఆరో పణలు వెల్లువెత్తాయి.

మిగతా 2లో..

కేటీఆర్‌పై రెండు కేసులు

నల్గొండ జిల్లాలో నమోదు

నల్గొండ(జనంసాక్షి): భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌పై నల్గొండ జిల్లాలో రెండు కేసులు నమోదయ్యాయి. పదో తరగతి పరీక్ష మాస్ కాపీయింగ్ ఘటనపై ఎక్స్ పోస్టులు ఫార్వర్డ్ చేశారని కేటీఆర్‌పై మున్సిపల్ ఛైర్‌పర్సన్ రజిత ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారంలో ఏ1గా మన్నే క్రిశాంక్, ఏ2గా కేటీఆర్, ఏ3గా

మిగతా 2లో..

కాల్పుల విరమణపై పుతిన్ కావాలనే

సాగదీస్తున్నారు

రష్యా అధ్యక్షుడిపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

న్యూయార్క్(జనంసాక్షి): ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో రష్యా వైఖరిపై సానుకూలంగా వ్యవహరిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. కీవ్‌తో కాల్పుల విరమణ అంశాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్

మిగతా 2లో..

మళ్లీ నెత్తురోడుతున్న గాజా

దాడులు ఆపకుంటే.. బందీలందరినీ చంపేస్తాం

ఇజ్రాయెల్‌కు హమాస్ తీవ్ర హెచ్చరికలు

గాజా స్ట్రిప్(జనంసాక్షి): ఇజ్రాయెల్ తన దాడులను పునఃప్రారంభించడంతో.. గాజా మళ్లీ నెత్తు రోడుతోంది. భీకర దాడుల్లో ఇప్పటికే వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్‌కు హమాస్ తీవ్ర హెచ్చరికలు చేసింది. దాడులను ఇలాగే కొనసాగిస్తే, సైన్యం సాయంతో బందీలను తరలించేందుకు యత్నిస్తే.. వారు శవపేటికల్లో తిరిగొస్తారని తెలిపింది. మరోవైపు.. గాజా సిటీలోని కొన్ని ప్రాంతాలను

మిగతా 2లో..

అప్సర హత్యకేసులో పూజారి సాయికృష్ణకు జీవితఖైదు

హైదరాబాద్(జనంసాక్షి): సరూర్ నగర్ అప్సర హత్య కేసులో పూజారి సాయికృష్ణకు జీవత ఖైదు విధించింది రంగారెడ్డి కోర్టు. అప్సరను ప్రేమించి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. మోసం చేశాడు పూజారి. అప్సరతో నాలుగేళ్లపాటు ప్రేమయాణం సాగించాడు. పెళ్లి చేసుకోమని వెంటపడటంతో.. శంషాబాద్ ప్రాంతంలో హత్య చేసి..

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
27.03.2025

భూభారతి వర్సెస్ ధరణి

ప్రభుత్వం మరో దుకాణం తెరిచిందని విమర్శించారు. ఇప్పుడు జమాబందీ ఎందుకో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. దున్నేవాడిదే భూమి అనేది సాయుధ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం భూములపై హక్కులు కల్పించిదన్నారు. కానీ బిఆర్ఎస్ ధరణిపేరుతో సామాన్యుల భూములను కాజేసిందని అన్నారు. వారికి భూమిపై హక్కులు లేకుండా చేసేందుకు ధరణిని తీసుకుని వచ్చారని, ఎందరో భూములు మాయమయ్యాయని అన్నారు. అందుకే ధరణిని బంగాళాఖాతం లో వేస్తామని చెప్పాం.. వేసి చూపామని అన్నారు. అందుకు ప్రత్యమ్నాయంగా 'భూ భారతి' పేరిట కొత్త చట్టం తీసుకొచ్చి ప్రజలకు రక్షణ కల్పించామని అన్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేయాలనే ప్రజలకు మాకు అధికారం కట్టబెట్టారని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో పల్లా వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ధరణి వద్దని ఓటుతో ప్రజలు తీర్పునిచ్చారని అన్నారు. అన్ని వర్గాలతో చర్చించాకే భూభారతి తెచ్చామని అన్నారు. భూభారతి కాన్సెప్ట్ తో ఈసారి ఎన్నికలకు వెళ్తామని.. ధరణి కాన్సెప్ట్ తో బీఆర్ఎస్ నేతలు ఎన్నికలకు రాగలరా అంటూ మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. ప్రజలు ఎవరికి మద్దతు ఇస్తారో చూద్దామని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. వీఆర్ఏ వ్యవస్థను మళ్ళీ తీసుకొస్తామని.. వీఆర్ఏలు కావాలని ప్రజలు అడుగుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కట్టుకథలు చెబుతున్నారని మండిపడ్డారు పొంగులేటి. అసత్యాన్ని సత్యం చేసేందుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భారాస ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే ఆ పార్టీని ఓడించారు. వీఆర్ఏ, వీఆర్వోలపై గత ప్రభుత్వం ఏవిధంగా ప్రేమ చూపించిందో అందరికీ తెలుసు. వాళ్లకు ప్రత్యేకమైన గౌరవం ఇస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం అని పొంగులేటి చెప్పారు. ధరణి పోర్టల్ పై ప్రజలు తీర్పు ఇచ్చారు.. మా సభ్యులే కాదు.. మీ వైపు ఉన్న సభ్యులు కూడా ఇబ్బంది పడ్డారు.. ధరణిలో ఏర్పడిన సమస్యలతో తమ భూముల సమస్యలు పరిష్కారం కోసం నా దగ్గరికి పలువురు ఎమ్మెల్యేలు వస్తున్నారు వెల్లడించారు. మేము వచ్చే ఎన్నికల్లో భూ భారతి గురించి చెప్పి ఎన్నికలకు పోతాం.. బీఆర్ఎస్ ధరణి పేరుతో ఎన్నికలకు వెళ్తారా? అని ప్రశ్నించారు. మీకు మాట్లాడే నైతిక హక్కు లేదు.. ధరణి తెచ్చి రూల్స్ అసలు ఫ్రేమ్ చేయలేదు.. మేము చట్టం తెచ్చి రూల్స్ సిద్ధం చేస్తున్నాం.. మీరు మాకు చెప్పడం ఎందుకు అని ప్రశ్నించారు. పేదలకు మేము ఇందిరమ్మ ఇండ్ల ఇస్తున్నాం.. వాళ్ళ మాదిరిగా మేము పార్టీల కార్యకర్తలు ఇవ్వం అని తెలిపారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ఇక, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ సర్పంచ్.. మీలాగా బీఆర్ఎస్ నాయకులను పెట్టలేదు.. సభను పదే పదే తప్పుదోవ పట్టిస్తున్నారు అని మంత్రి పొంగులేటి తీవ్రంగా మండిపడ్డారు.

కమీషన్ లేనిదే పనులు కావు : కేటీఆర్

ప్రభుత్వ పెద్దలు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ.. స్వయంగా కాంగ్రెస్ నేతలే మాట్లాడుకుంటున్నారంటూ అసెంబ్లీ వేదికగా కేటీఆర్ కామెంట్ చేశారు. అయితే.. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యల పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 30శాతం కమీషన్లు తీసుకుంటున్నట్టు నిరూపించాలంటూ కేటీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ చేశారు. నిరూపించలేకపోతే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ భట్టి హెచ్చరించారు. దోచుకుంది మీరు.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది మీరే అంటూ బీఆర్ఎస్ నేతలపై భట్టి మండిపడ్డారు. కాగా.. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యుల ఆందోళన నేపథ్యంలో.. కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు. ధరణి, భూ భారతిపై కూడా తెలంగాణ అసెంబ్లీలో రచ్చ జరిగింది. ధరణిపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇంకా అదే చట్టాన్ని అమలుచేస్తున్నారు. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ ప్రభుత్వ పథకాల అమలు జరుగుతుందని.. పైగా ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతిలో అనేక లోపాలు ఉన్నాయన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి. ఈ వ్యాఖ్యల పట్ల అధికార పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారుధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఎన్నికల్లో చెప్పాం .. చెప్పినట్టుగానే భూ భారతిని తీసుకొచ్చామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

భద్రాచలంలో కుప్పకూలిన భవనం

లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది. ఇంటి యజమాని ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్థుల భవనం ఒక్కసారిగా నేలమట్టం అయ్యింది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారని అనుమానిస్తున్నారు. వెంటనే పోలీసులు బృందాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. భవనం కింద చిక్కుకుని పలువురు మృతి చెందినట్లు సమాచారం. భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో ఆరంతస్తుల మేర స్లాబ్ నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఈ భవనం బుధవారం మధ్యాహ్నం హఠాత్తుగా కుప్పకూలింది. భవనం కూలిపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పాత భవనంపైనే మరో నాలుగు అంతస్తులు నిర్మిస్తుండగా ప్రమాదం జరిగింది. నిర్మాణంలో లోపాల వల్లే ఘటన జరిగినట్టు అధికారులు భావిస్తున్నారు. నిర్వాహకులు ట్రస్ట్ పేరుతో విరాళాలు సేకరించి భవన నిర్మాణం చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఐటీసీ నుంచి క్రేన్లు, పొక్లెయిన్లు రప్పిస్తున్నారు. కూలిన భవనం పక్కనే ఓ ఆలయం కూడా నిర్మిస్తున్నారు.నాశిరకం నిర్మాణం చేయడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుందని అంటున్నారు. ఓ పాతభవనంపై మరో నాలుగు అంతస్థులు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. గత ఏడాది పంచాయతీ సిబ్బంది నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించడంతో అప్పటి నుంచి నిర్మాణం నిలిచిపోయింది. ఒకవేళ భవనం ప్రారంభోత్సవమై భక్తులు ఉండి ఉంటే పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగి ఉండేదని ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం పనులు జరుగుతున్న సమయంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే భవన యజమాని భార్య చెబుతున్న ప్రకారం.. ఇద్దరు కూలీలు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే శిథిలాల కింద ఎంతమంది ఉన్నారనేది తొలగింపు తరవాత బయటపడనుంది. నిర్మాణంలో నాణ్యత లోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు.

తప్పుదోవ పట్టించే ప్రకటనలతో సమాజానికి తీవ్రనష్టం

పాలిత ప్రాంతాలను ఆదేశించింది. రెండు నెలల్లోగా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్టు-1954 కింద నిషేధించిన ప్రకటనలకు సంబంధించి అభ్యంతరాలపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని రాష్ట్రాలు రూపొందించాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది. వీటిని రెండు నెలల్లో ఏర్పాటు చేయాలని, దీని గురించి ప్రచారం కూడా కల్పించాలని స్పష్టం చేసింది.1954 చట్టంలోని నిబంధనల అమలుపై పోలీసులకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల కట్టడికి సంబంధించి గతంలో పలు సూచనలు చేసిన న్యాయస్థానం.. ప్రకటనలు జారీ చేసే ముందు కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ రూల్ 1994 ప్రకారం స్వీయ ధ్రువీకరణ తీసుకోవాలని ఆదేశించింది.ఆధునిక వైద్యవిధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. అసత్య, తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని పేర్కొంటూ ఆ సంస్థను మందలించింది. అనంతరం పతంజలి ఆయుర్వేద సంస్థ కూడా సుప్రీం కోర్టుకు క్షమాపణలు తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఇటువంటి ప్రకటనల కట్టడి చర్యల్లో భాగంగా సుప్రీం తాజా ఆదేశాలు జారీ చేసింది.

సర్కారీ విద్యపై నమ్మకం కలిగిస్తున్నాం

పరిజ్ఞానంలో తెలంగాణ 36వ స్థానంలో ఉంది. దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అథమ స్థానంలో ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పుస్తకాలు చదవలేని పరిస్థితి. ప్రతి స్థాయిలో విద్యారంగం రోజు రోజుకూ క్షీణించి పోతోంది.

ప్రభుత్వమే కాదు.. సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 11వేలకు పైగా టీచర్ల నియామకం చేపట్టాం. 21వేల మందికి పైగా టీచర్లకు పదోన్నతులు కల్పించాం. ఏడెనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 36వేల మంది టీచర్ల బదిలీ చేపట్టాం. కలెక్టర్లనైనా బదిలీ చేయవచ్చు గానీ, టీచర్ల బదిలీ ఆషామాషీ కాదు. 36వేల మంది టీచర్లను చిన్న ఆరోపణలు లేకుండా బదిలీ చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులపై రూ.1.08లక్షలు చొప్పున ఖర్చు చేస్తున్నాం. ప్రైవేటులో రూ.50వేల వరకు ఖర్చయితే.. ప్రభుత్వ పాఠశాలల్లో రూ.లక్ష ఖర్చవుతోంది. బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యమిస్తూ రూ.23,108 కోట్లు కేటాయించాం. విద్యా రంగానికి భారీగా నిధులు కేటాయించినా ప్రమాణాలు పడిపోతున్నాయి. ఇందుకు ప్రభుత్వమే కాదు.. సమాజం బాధ్యత తీసుకోవాలి. లోతుగా విశ్లేషించి సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. రాజకీయ కోణంలో ఆలోచన చేసినంత కాలం విద్యారంగం ప్రక్షాళన కాదు. విద్య పట్ల ప్రత్యేక విధానం తీసుకురావాలనేది ప్రభుత్వ ఉద్దేశం. విద్యారంగం బలోపేతానికి సూచనల కోసం విద్యా కమిషన్ ఏర్పాటుచేశాం.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారిని ప్రోత్సహించాలి..

ఏటా లక్షకు పైగా ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు. రూ.15వేలకు కూడా ఇంజినీరింగ్ విద్యార్థులు పనిచేసే పరిస్థితి. నైపుణ్యం ఉన్న యువత దొరకట్లేదని కంపెనీలు చెబుతున్నాయి. తెలంగాణ అభివృద్ధి సాధించిందని ఒడిశా, బిహార్ నుంచి రావట్లేదు. మన వద్ద ఉన్న విద్యార్థులకు నైపుణ్యం లేక రోడ్లపై తిరుగుతున్నారు. మన నిర్లక్ష్యంతో సమాజ నైపుణ్యాల మేరకు విద్యార్థులను అప్‌గ్రేడ్ చేయలేదు. నైపుణ్యాల పెంపునకు యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. యంగ్ ఇండియా పత్రిక ద్వారా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమం నడిపారు. గాంధీ స్ఫూర్తితో తెలంగాణలో విద్యా ప్రమాణాల మెరుకు చర్యలు తీసుకుంటాం. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తేనే స్థానిక సంస్థల్లో పోటీకి, ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు అవకాశంపై చర్చించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారిని ప్రోత్సహించేలా చర్యలు ఉండాలి" సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఉప ఎన్నికలు రావు.. అనవసర కంగారు వద్దు

ఉన్న ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంపై సీఎం సభలో ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. వెంటనే కలగజేసుకున్న మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపక్షాల నిరసనలను తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి కోర్టు తీర్పు గురించి మాట్లాడలేదని.. కేవలం ఫిరాయింపుల విషయంలో గతంలో మాదిరిగానే వ్యవహరిస్తామని అన్నారని వివరణ ఇచ్చారు. సీఎం మాట్లాడిన దాంట్లో తప్పేమి లేదని.. ఉప ఎన్నికలు వస్తాయని బయట బీఆర్ఎస్ నాయకులు చేస్తోన్న బెదిరింపుల గురించి మాత్రమే మాట్లారని శ్రీధర్ బాబు స్పష్టత ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్లో కూడా ఇలాంటి అంశంపై చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. జ్యుడిషియరిని విమర్శించే హక్కు పార్లమెంట్‌లో కూడా ఉంటుందని అన్నారు. మంత్రుల వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్, ఎంఐఎం ఎమ్మెల్యేలు నిరసన కొనసాగించారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. అంతకుముందు సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిరోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. 2014 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ఎలాంటి సంప్రదాయం ఉందో అదే సంప్రదాయాన్ని మేం ఫాలో అవుతున్నాం అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ మంత్రి పదవులు ఇచ్చింది. మేం ఎలాంటి పదవులు ఇవ్వడం లేదు. వాళ్ల అడుగుజాడల్లో మేం నడవడం లేదు. ప్రతి రోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. ఫిరాయింపుల అంశం కోర్టు పరిధిలో ఉంది. తెలంగాణలో ఎలాంటి ఉప ఎన్నికలు రావు. ఎమ్మెల్యేలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా దృష్టి ఉప ఎన్నికలపై లేదు.. అభివృద్ధిపైనే ఉందని అన్నారు. ఉపఎన్నికలు రావని ఖరాఖండిగా ప్రకటించిన సీఎం, అసెంబ్లీ సభ్యులు ఎవరూ ఈ విషయంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఉపఎన్నికలపై ఊహాగానాలు చేస్తున్నవారికి సమాధానం ఇస్తూ, ఇలాంటి అంశాలపై కాకుండా ప్రజా సమస్యలపై దృష్టిపెట్టడం మేలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇతర పార్టీ నేతలు తమ పార్టీలోకి వచ్చినా, మళ్లీ వెనక్కి వెళ్లినా, వాటితో సంబంధం లేకుండా ఉపఎన్నికలు జరిగే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. తెలంగాణ అభివృద్ధి తన ప్రాధాన్యత అని స్పష్టం చేసిన సీఎం, ఉపఎన్నికల గురించి చర్చించేందుకు తన సమయం వృథా చేసుకోవడం లేదు అని చెప్పారు. ఈ అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున, తీర్పు వచ్చిన తర్వాత తాము దానిని స్వీకరిస్తామని చెప్పారు. ఇక, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీలోకి చేరడం, ఆ వ్యవహారం హైకోర్ట్, సుప్రీంకోర్టుకు వెళ్లడం, త్వరలో కోర్టు తీర్పు రాబోతుందన్న వార్తలతో తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై 'సిట్'

లేవని చెప్పారు. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వీటిని నిరోధించడానికి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం సిట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. మన పరిధిలో విచారణ జరిపిస్తే సమస్యకు సరైన పరిష్కారం దొరకదన్నారు. ఈ కేసులో శిక్షపడేలా ప్రత్యేక చట్టం చేస్తామని కూడా అన్నారు. బెట్టింగ్ యాప్ ల వల్ల ఎంతోమంది బలైపోతున్నారని సీఎం రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నేరం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతోందన్నారు. గుట్కా నిషేదం పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ చేసిన వాళ్లను విచారిస్తే సరిపోదు.. బెట్టింగ్ యాప్ నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు ఉండాలన్నారు. మమ్మల్ని చంపుతారని కోర్టులో పిటిషన్ వేసినా వామనర్ రావు దంపతుల ప్రాణాలు దక్కలేదన్నారు. వామన్ రావు హత్య ఆరోపణలు ఎదుర్కొన్న వాళ్లను తప్పించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గంజాయి మత్తులో సింగరేణి కాలనీలో ఆరేళ్ళ చిన్నారిని దారుణంగా హత్య చేశారని చెప్పారు. శాంతి భద్రతలపై కొందరు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని సిఎం మండిపడ్డారు. పెట్టుబడుదారులకు రక్షణ కల్పించినప్పుడే పెట్టుబడులొస్తాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిపై యాసిడ్ దాడులు జరుగుతున్నాయన్నారు.

తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్

పరిస్థితులకు తెలంగాణలో అవకాశం లేదని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం శాంతి భద్రతలపై చర్చ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ పోలీసులు రూ.185 కోట్లు బాధితులకు వాపస్ ఇచ్చారు.. ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ రికవరీ చేయలేదని తెలిపారు. ఆనాడు కేసులను నమోదు చేయకుండా బాధితులను భయపెట్టించారు.. కానీ ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఏంటో మేం చేతల్లో చూపించామని అన్నారు. పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మిస్తున్నామని.. రంగారెడ్డి జిల్లా మంచిరేవులో ఈ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలీసుల పిల్లలకు విద్యను అందిస్తామని చెప్పారు. ఇప్పుడు తెలంగాణ పోలీసులు స్వేచ్ఛగా కేసులు నమోదు చేస్తున్నారని.. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నేతల చెప్తేనే కేసులు నమోదయ్యాయని ఆరోపించారు. మంథనిలో అడ్వకేట్ దంపతుల మర్డర్ జరిగితే.. ఈ ఘటనలో పోలీసులు ఎలా వ్యవహరించిన తీరు అందరి చూశారని విమర్శించారు. ప్రతి పోలీస్ స్టేషన్లో ఇప్పుడు క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశామని చెప్పారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన టీజీ న్యాబ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కొత్త పోస్టులు మంజూరు చేశామని తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించుకుని పోలీసులు కేసులు వేగంగా పరిష్కరిస్తున్నారని కొనియాడారు. సైబర్ నేరాలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నామని.. సైబర్ సెక్యూరిటీ యావత్ దేశం సమస్య అని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని.. ఏఐ బేస్డ్ ట్రాఫిక్ మానిటరింగ్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. ట్రాఫిక్‌కు సంబంధించి అదనపు సిబ్బందిని నియమించామని గూగుల్ మ్యాప్ ఉపయోగించుకుని ట్రాఫిక్ నియంత్రణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇతర మెట్రో సిటీలతో పోల్చితే.. మన ట్రాఫిక్ నియంత్రణ బాగుందని అన్నారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలను మరింత పటిష్టం చేస్తున్నామని అన్నారు.

అప్సర హత్యకేసులో పూజారి సాయికృష్ణకు జీవితఖైదు

మ్యాన్‌హోల్‌లో మృతదేహాన్ని పడేశాడు. ఈ కేసులో రంగారెడ్డి కోర్టు నేడు తీర్పు వెల్లడించింది. అతడికి జీవిత ఖైదుతో పాటు.. సాక్ష్యాలను తారుమారు చేసినందుకు అదనంగా మరో ఏడేళ్ల జైలు శిక్షను కూడా విధించింది. వీటితో పాటు.. అప్సర కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. తమిళనాడుకు చెందిన అప్సర డిగ్రీ పూర్తి చేసింది. నటన, మోడలింగ్‌పై ఆసక్తితో ఆమె పలు తమిళ చిత్రాల్లో నటించింది. సినిమా అవకాశాల కోసం ఆమె 2022 ఏప్రిల్‌లో హైదరాబాద్‌కు వచ్చింది. కాశీలోని తన తండ్రి ఒక ఆశ్రమంలో పనిచేస్తున్నారు. తల్లితో కలిసి ఆమె సూరూర్‌నగర్‌లోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆమె తల్లి ఒక ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. అప్సర దేవాలయాలకు తరచూ వెళ్తూ ఉండేది. ఆ సమయంలోనే అక్కడ పూజారి సాయికృష్ణతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది.

మా గొంతు నొక్కేస్తున్నారు

మాట్లాడేందుకు అనుమతించట్లేదు. ఇదో కొత్త ఎత్తుగడ. ప్రతిపక్షానికి ఇక్కడ చోటులేదు. ఇటీవల ప్రధాని కుంభమేళా గురించి మాట్లాడినప్పుడు నేను నిరుద్యోగం గురించి మాట్లాడాలనుకున్నా.. కానీ మాట్లాడేందుకు అనుమతించలేదు.మమ్మల్ని మాట్లాడేందుకు అనుమతించకపోవడం అప్రజాస్వామికం" అని రాహుల్ అన్నారు.మరోవైపు, బుధవారం సభా కార్యకలాపాల సమయంలో స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ.. సభా గౌరవాన్ని కాపాడేందుకు నిబంధనలు పాటించాలని సూచించారు. సభలోని సభ్యులు హుందాగా వ్యవహరించాలన్నారు. సభ్యుల ప్రవర్తన ఈ సభ ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా లేదని అనేక సందర్భాల్లో తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ సభలో తండ్రీ కూతురు, తల్లీ కుమార్తె, భార్యా భర్తలను సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రతిపక్ష నేత 349 రూల్‌ప్రకారం నడుచుకుంటారని తాను ఆశించినట్లు తెలిపారు.

కేటీఆర్‌పై రెండు కేసులు

దిలీప్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. ఉగ్గడి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో మరో కేసు నమోదైంది. భారాస సోషల్ మీడియా పెట్టిన పోస్టులు ఫార్వర్డ్ చేశారని.. ఎక్స్‌లో తమపై తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదు చేశారు.

మళ్లీ నెత్తురోడుతున్న గాజా

ఖాళీ చేయాలంటూ స్థానికులకు ఐడీఎఫ్ తాజాగా ఆదేశాలు జారీ చేసింది."బందీలను సజీవంగా ఉంచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. కానీ, ఇజ్రాయెల్ చేపడుతున్న దాడులు వారి ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నాయి. సైన్యం సాయంతో బందీలను విడిపించుకోవాలని ప్రయత్నిస్తే.. వారు శవపేటికల్లో తిరిగివస్తారు" అని హమాస్ ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు.. గాజాపై టెల్‌అవీవ్ తన దాడులను విస్తృతం చేస్తోంది.

కాల్పుల విరమణపై పుతిన్ కావాలనే సాగదీస్తున్నారు

కావాలనే సాగదీస్తున్నారని అన్నారు. వాషింగ్టన్ మధ్యవర్తిత్వాన్ని మాస్కో తారుమారు చేస్తోందని ఆరోపించారు.ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ దీని గురించి మాట్లాడారు. "యుద్ధానికి ముగింపు పలకాలని రష్యా కోరుకుంటోందని నేను అనుకుంటున్నా. కానీ, ఇప్పుడు వారి కాళ్లను వారే లాక్కుంటున్నారని అనిపిస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం పై అమెరికా మధ్యవర్తిత్వం చేస్తున్నప్పటికీ పుతిన్ ఉద్దేశపూర్వకంగా దాన్ని అడ్డుకుంటున్నట్లు కన్పిస్తోంది. ఏదేమైనప్పటికీ ఈ మారణహోమాన్ని నేను ఆపాలనుకుంటున్నా. కీవ్‌కు అందిస్తున్న ఆర్థిక సాయానికి ముగింపు పలకాలనుకుంటున్నా" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. 30 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలంటూ అమెరికా చేసిన ప్రతిపాదనకు ఇప్పటికే ఉక్రెయిన్ అంగీకరించిన సంగతి తెలిసిందే. దీనిపై మాస్కోను ఒప్పించేందుకు అగ్రరాజ్యం చర్చలు ప్రారంభించింది. సౌదీ వేదికగా రష్యాతో అమెరికా అధికారులు మంతనాలు చేస్తున్నారు. ఇందులోభాగంగానే నల్ల సముద్రంలో దాడులను నిలిపివేసేందుకు ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరినట్లు శ్వేతసౌధం మంగళవారం ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ట్రంప్.. పుతిన్‌పై ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం

వచ్చిన తర్వాత మరమ్మతుల విషయంపై దృష్టిసారిస్తామన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు లేవలెత్తిన అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డీపీఆర్‌లో షీట్ పైల్స్ ఉంటే.. నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం దురదృష్టకరమని.. ప్రపంచస్థాయి నిపుణులను భాగస్వామ్యం చేసి సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. ప్రమాదం జరిగిన 3 గంటల్లోపే తాను అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. సీఎం రేవంత్ కూడా రెండు రోజుల క్రితం దీనిపై సమీక్షించి సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారన్నారు. సొరంగ ప్రమాదం తాత్కాలికంగా వచ్చిన ఎదురుదెబ్బ మాత్రమేనని.. ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు

పేదల, ప్రభుత్వ భూములను ఆక్రమించిన
రామోజీ యాజమాన్యంపై కేసు పెట్టాలి

- పట్టాలు పొందిన పేదలకు స్థలాలను ఇవ్వాలి
- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్, మార్చి 26 (జనంసాక్షి) : ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను, రోడ్లను మరియు 350 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యంపై కేసులు నమోదు చేయకుండా, తమ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకోవడానికి వెళ్ళిన పేదలను, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు, జిల్లా నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్టు ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం తెలిపారు. రామోజీ ఫిలింసిటీ దగ్గర నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 700 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 2007 సంవత్సరంలో ప్రభుత్వం పట్టాలిచ్చిందని గుర్తు చేశారు. ఆ భూమి మీదకు ప్రజలు వెళ్లి నివాసం ఏర్పాటు చేసుకోకుండా రామోజీ సంస్థ దారిని ఆక్రమించి, చుట్టూ గోడ నిర్మించి సెక్యూరిటీని పెట్టి అడ్డుకుంటున్నదని, స్థలాలలోకి వెళ్ళిన 75 మంది పేదలపై గతంలో అక్రమ కేసులు పెట్టి సంవత్సరాల తరబడి కోర్టులు చుట్టూ తిప్పిందని, జిల్లా కలెక్టర్, పోలీస్ యంత్రాంగం, స్థానిక ఎంఎల్ఏ జోక్యం చేసుకుని దీనిని పరిష్కరించకుండా జాప్యం చేస్తూ, రామోజీ సంస్థకే అనుకూలంగా వ్యవహరిస్తున్నదని, ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 400 మంది లబ్దిదారులను వారికి ఇచ్చిన స్థలాల వద్దకు తీసుకెళ్లడంతో పోలీసులు నాయకులపై, పేదలపై కర్కశంగా ప్రవర్తించి అరెస్టులు చేసిందని తెలిపారు. ఈ దుశ్చర్యను సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నదని, అరెస్టు చేసిన వారిని తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రామోజీ సంస్థపై కేసులు నమోదు చేయాలని, పేద ప్రజలకు తమ ఇంటి స్థలాలను అప్పగించి, అక్కడే నివాసం ఉండే విధంగా ఇండ్లు నిర్మించుకోవడానికి నిధులు కేటాయించాలని లేనట్లయితే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లావ్యాపితంగా ఇండ్లు లేని పేదలందరినీ సమీకరించి రామోజీ సంస్థ ఆక్రమించిన 350 ఎకరాల భూమిని కూడా స్వాధీనం చేసుకుని గుడిసెలు వేసే కార్యక్రమానికి పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

14 ఏళ్లలో 81శాతం తగ్గిన నక్సల్స్ హింస

న్యూఢిల్లీ, మార్చి 26 (జనంసాక్షి) : గడచిన 14 ఏళ్లలో దేశంలో నక్సల్ హింస 81 శాతం తగ్గిందని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ బుధవారం రాజ్యసభకు తెలిపింది. 2010 నుండి 1,936 సంఘటనలతో గరిష్టస్థాయిలో ఉందని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రారు నేడు రాజ్యసభలో మాట్లాడుతూ.. 2024లో నక్సల్ వయెలెన్స్ సంఖ్య 374కి తగ్గిందని అన్నారు. పౌరులు, భద్రతా దళాలు మరణాల సంఖ్య 2010లో 1,005గా ఉంటే.. 2024కి 150కి తగ్గింది. అంటే 85 శాతం తగ్గుదల ఉంది అని ఆయన అన్నారు. కాగా, నక్సల్ హింస కేసులు 2023లో 485, 2022 : 413, 2021 : 361, 2020 : 470, 2010 : 501 నమోదయ్యాయి.

మంత్రిగారూ! ఎల్ఆర్ఎస్ గడువు పెంచరూ!

హైదరాబాద్, మార్చి 26 (జనంసాక్షి) : లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) చెల్లింపు గడువును పెంచబోమని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన ప్రకటన కలకలం రేపింది. చెల్లింపుదారులు హైరానా పడుతున్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులకు ఈనెల 31 గా ప్రభుత్వం గడువు విధించింది. కాగా ప్రభుత్వం విధించిన గడువు చాలదనే అభిప్రాయాలు సర్వత్రా వెల్లడవుతున్నాయి. ఈ గడువును పొడిగించాలని చెల్లింపుదారులు కోరుతున్నారు. ఎల్ఆర్ఎస్ కోసం 2020లో దరఖాస్తు చేసి అప్లికేషన్ నెంబర్ తీసుకున్నవారు మాత్రమే ఇప్పుడు ఫీజు చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఈనెల 31 లోగా చెల్లించిన వారికి 25 శాతం రాయితీ కూడా ఇస్తున్నారు. అనుమతి లేని ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించి, వాటిని ప్రణాళిక పరిధిలోకి తీసుకురావడం ఈ పథకం ఉద్దేశం. ఇంతవరకు బాగానే ఉన్నా, చెల్లింపు దారుల వాస్తవ స్థితిని లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్ఆర్ఎస్ ప్రకటన జనంలోకి వెళ్లడం, ఎంత చెల్లించాలి, ఎక్కడ, ఎలా చెల్లించాలో తెలుసుకునే సరికి చెల్లింపు దారులకు పది రోజులు పట్టింది. ఫీజు ఆన్ లైన్ లో చెల్లించవలసి ఉంటుంది. మెజారిటీ చెల్లింపు దారులకు ఈ సాంకేతిక పరిజ్ఞానం తెలియదు. మరొకరి మీద ఆధారపడాలి. ఏదోలా చెల్లింపు దారులు సిద్ధమయ్యారు. తీరా సాంకేతిక సమస్యల కారణంగా ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. రెండు, అంతకు మించి ప్లాట్లు ఉన్న వాళ్లు ఫీజు కోసం డబ్బు సర్దుబాటు కాక ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం విధించిన గడువుకు మంగళం పాడితే పరిస్థితి ఏంటని చెల్లింపు దారుల్లో ఆందోళన మొదలైంది. ఇదిలా ఉండగా కొందరిని మరొక ప్రశ్న వేధిస్తోంది. ఎల్ ఆర్ ఎస్ కోసం 2020 లో దరఖాస్తు చేసిన వారే ఇప్పుడు ఫీజు చెల్లించాలి. అప్పుడు దరఖాస్తు చేయని వారికి ఇప్పుడు దరఖాస్తు చేసే అవకాశం ఎందుకు ఇవ్వరు అనేది అందరిలో నెలకొన్న సందేహం. 2 వేల కోట్ల ఆదాయం లక్ష్యంగా ప్రభుత్వం కొత్త ఎల్ ఆర్ ఎస్ ను ఆవిష్కరించింది. ఇప్పుడు విధించిన గడువుకు పెంచితే ప్రభుత్వానికి దండిగా ఆదాయం సమకూరుతుంది. చెల్లింపు దారులకు ఊరట కలుగుతుంది. ఉభయతారకంగా ఉంటుంది.

చెల్లింపు కౌంటర్లు పెంచాలి

ఎల్ఆర్ఎస్ చెల్లింపులు జరుగుతున్న తరుణంలో ప్రభుత్వం హుటా హుటిన ఈనెల 31 తో గడువు ముగుస్తుందని చెప్పడం నిరాశ కలిగించింది. ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సమస్య ఒకే ఒక్క నెలలో ఎలా పరిష్కారమవుతుంది.? ఎల్ ఆర్ ఎస్ చెల్లింపుల కోసం కౌంటర్లను పెంచి ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ప్రజలకు చేరువ చేయాలి. అసలే స్థిరాస్తుల రికార్డులు సరిగ్గా లేక ఇప్పటికే యజమానులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎల్ ఆర్ ఎస్ చెల్లింపుల ప్రక్రియను ప్రభుత్వం హడావిడిగా పూర్తి చేయడం తగదు.

వై. శ్రీలత రెడ్డి, రియల్ ఎస్టేట్ అడ్వయిజర్, హైదరాబాద్

అనిశ్చితి తొలగించాలి

ఎల్ఆర్ఎస్‌పై జనంలో ఏర్పడిన అనిశ్చితిని ప్రభుత్వం తొలగించాలి. ఈ ప్రక్రియ అమలు తీరుపై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడింది. ఆన్ లైన్ లో డాక్యుమెంట్ అప్ లోడ్ కు ఆప్షన్ కనిపించడం లేదు. అధికారులను అడిగితే డాక్యుమెంట్లు తీసుకుని ఆఫీస్ కు రమ్మంటున్నారు. దీంతో ఆన్ లైన్ కు అర్థం లేకుండా పోయింది. ఇలాంటి సాంకేతిక ఇబ్బందులను తొలగించాలి. 2020లో నమోదు చేసుకున్న వారికే కాకుండా కొత్త వారికి కూడా ఇప్పుడు అవకాశం ఇవ్వాలి. పెండింగ్ లో ఉన్న అన్ని చెల్లింపులు అయ్యేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

కే.లక్ష్మణ్, బోధన్

బండి సంజయ్ రేవంత్ చేతిలో తోలుబొమ్మ

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

హైదరాబాద్, మార్చి 26 (జనంసాక్షి) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్‌పై బండి సంజయ్ అసందర్భ అకాల దాడి చేస్తున్నారని, బండి సంజయ్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల్లో ఒక రాజకీయ తోలు బొమ్మగా మారిపోయారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఆయన తాను గెలిచిన కరీంనగర్ పార్లమెంట్ స్థానం కోసం రేవంత్ రెడ్డి అందించిన "సహాయానికి" బహుశా ఈ విధంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్టున్నారని దుయ్యబట్టారు. ఇటీవల ఆయన చేసిన ఆరోపణలు.. చాలా సంవత్సరాల క్రితం కాంగ్రెస్ నేతలు చేసిన అసత్య ఆరోపణలను, అచ్చంగా పరికట్టు మాదిరిగా పదేపదే పునరుక్తి చేయడం ద్వారా, ఆయన నిజంగా బీజేపీకి చెందిన నాయకుడిగా కాకుండా, కాంగ్రెస్ పార్టీకి, ప్రత్యేకించి రేవంత్ రెడ్డి గారికి సంబంధించిన గుట్టుచప్పుడు కాకుండా పనిచేస్తున్న కోవర్ట్ అని స్పష్టమౌతుందని తెలిపారు. బండి సంజయ్ ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను, అవినీతిని, స్కాంలను ప్రశ్నించాల్సిందని, కానీ ఆయన అధికార పార్టీపై నోరుమూసి, మరో విపక్షమైన బీఆర్ఎస్‌ను మాత్రమే టార్గెట్ చేయడం వల్ల, ఆయన లోపభూయిష్టమైన రేవంత్ రెడ్డి పట్ల విధేయత బయటపడుతోందని తెలిపారు. ఇది తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉన్న దుర్నీతి అక్రమ సంబంధం నిర్ధ్వంతంగా బయటపెడుతోందని తెలిపారు. కాంగ్రెస్ నేతలు ఒకప్పుడు నిరాధార ఆరోపణ చేశారని, ఇప్పుడు అదే ఆరోపణను బండి సంజయ్ రేవంత్ చేతిలోని చిలుకలా పదేపదే చెపుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ – బీజేపీ ఇద్దరూ కలిసి, బీఆర్ఎస్ పార్టీని, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఈ విధమైన కుట్రలకు ఎదురొడ్డి నిలబడుతున్నదని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, మార్చి 26 (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లాలో భూ సంబంధిత సమస్యల పరిష్కారం కొరకు జిల్లా, సబ్–డివిజన్, మండల స్థాయిలలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ. భాస్కర్ తో కలిసి మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు, బెల్లంపల్లి, జైపూర్ ఎ.సి.పి.లు, తహశిల్దార్లు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి కమిటీలో తహశిల్దార్, ఎస్.హెచ్.ఓ.ల పరిధిలో నివాస ప్రాంతాలు, నిర్మాణ అనుమతులు, సరైన అనుమతులు లేని అక్రమ కట్టడాలపై ప్రత్యేక అధికారులైన మండల పంచాయతీ అధికారి, మున్సిపల్ కమీషనర్ల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి రిజిస్టర్లో వివరాలు నమోదు చేసి గ్రీవెన్స్ నంబర్ కేటాయించాలని, దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారించాలని, కనీసం 15 రోజులు, గరిష్టంగా 21 రోజులలోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కోర్టులో పరిష్కారమయ్యే సమస్యలపై సంబంధిత అర్జీదారులకు అవగాహన కల్పించి తగు సూచనలు చేయాలని తెలిపారు. అనంతరం మండల, సబ్–డివిజన్ కమిటీల వారిగా వచ్చిన దరఖాస్తులు, తీసుకున్న చర్యలపై సమీక్షించారు. 20–30 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కారం అవుతున్నాయని, వయోవృద్ధుల సంబంధిత దరఖాస్తులు అధికంగా వస్తున్నాయని, ఒంటరి మహిళ, దివ్యాంగుల సంబంధిత దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. డి.సి.పి మాట్లాడుతూ ....బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి, రెవెన్యూ సంబంధించిన భూసమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సింగరేణి అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో క్రైస్తవులకు రక్షణ కరువు

- పాస్టర్ ప్రవీణ్ పగడాల, అడ్వకేట్ ఇజ్రాయల్ మరణం బాధాకరం
- వీరి హత్యలపై నిష్పాక్షంగా విచారణ జరగాలి
- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్

హైదరాబాద్, మార్చి 26 (జనంసాక్షి) : దేశంలో క్రైస్తవులకు రక్షణ లేకుండా పోయిందని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ మత పెద్దలు పాస్టర్ ప్రవీణ్ పగడాల, దళిత క్రైస్తవ అడ్వకేట్ ఇజ్రాయల్ హత్యలపై కావాలనే ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని మండిపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో మైనార్టీ నేతలు అడ్వకేట్ ఇజ్రాయిల్, పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేడే రాజీవ్ సాగర్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణాన్ని ఏపీలోని ఎన్డీఏ ప్రభుత్వం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవీణ్ ఒంటి మీద ఎక్కడ యాక్సిడెంట్ గాయాలు కాకుండా ఎవరో హింసించిన విధంగా గాయాలు ఉన్నాయని అయిన కావాలనే అక్కడి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరింస్తుందన్నారు. ఉదయం ఘటన జరిగితే రాత్రి 8.30 వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని వివరించారు. అక్కడి ఎన్డీఏ కూటమి ఎవరీ సంతోషం కోసం క్రైస్తవుల హత్యలను ప్రోత్సాహిస్తున్నారని తెలిపారు. నిష్పాక్షపాతంగా రాజకీయ ఒత్తిడి లేకుండా విచాణ జరగాలని లేదంటే ఏదైనా దర్యాప్తు సంస్థకు ఈ కేసును అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ, కాంగ్రెస్ ప్రభుత్వాలు కావాలనే క్రైస్తవుల మీద దాడులకు దిగుతున్న పట్టించుకోవడంలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఉన్న బీజేపీ ఎజెండానే కొనసాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, క్రిస్టియన్ జెఎసీ చైర్మన్ సాల్మోన్ రాజ్, రిటైర్డ్ జడ్జి రాజ్ కుమార్, లీగల్ రైట్ ఆక్టివిస్ట్ జిమ్మీ కిరణ్, క్రిస్టియన్ జెఎసీ ఉపాధ్యక్షులు జి .విద్యా సాగర్, పలువురు క్రిస్టియన్ నాయకులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ఎలా వినియోగించాలో చూపిస్తాం

- చేతగాకపోతే తప్పకోవడం మేలు
- దోచుకోవడం..దాచుకోవడం కాంగ్రెస్ నైజం
- ఎండిన పంటపొలాలను పరిశీలించిన జగదీశ్ రెడ్డి

సూర్యాపేట, మార్చి26 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వంలో దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి ఏమి లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శించారు. బుధవారం చివ్వెంల మండలం మొగ్గాయగూడెంలో ఎండిపోయిన పంట పొలాలను బీఆర్ఎస్ నేతలతో కలిసి జగదీష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సోయిలేకుండా ప్రవర్తిస్తోందని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ తీసుకున్నడు.. కానీ దానిపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. పాలన చేతగాక పోతే మాకు అప్పగించండి.. కాళేశ్వరం నీటిని ఏ విధంగా విడుదల చేయాలో చేసి చూపిస్తామని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. కేసీఆర్ అద్భుతమైన ప్రణాళికతో తెలంగాణను భారతదేశంలోనే నెంబర్ వన్‌గా చేశాడని.. కాంగ్రెస్ వచ్చాక ఆర్థిక రంగం మొత్తం కుదేలై వెనకబడే పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. ఈ ఏడాది ప్రజల ఖజానాకు రావాలసిన రూ.15 వేల కోట్ల డబ్బులు మీ జేబుల్లోకి పోయిందని స్పష్టంగా అర్థమవుతుందని ఆరోపించారు. తెలంగాణ కోసం కేసీఆర్ పడ్డ పదేళ్ల కష్టం నామరూపల్లె లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 10 ఏండ్లలో అభివృద్ధి చేసి చూపిస్తే సంవత్సర కాలంలోనే కాంగ్రెస్ తెలంగాణను నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. ఇకనైనా ప్రభుత్వం సాగునీరు ఇస్తే కొన్ని పొలాలైనా చేతికొచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఆలోచించి తక్షణమే రైతులకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కు విజ్ఞప్తి చేస్తున్నాం.. చివరి పంటకు సాగుకైన నీటిని విడుదల చేయాలన్నారు.

త్వరలోనే స్థానిక ఎన్నికలు?

- మండుటెండల్లో రాజకీయ నేతలకు పరీక్ష

హైదరాబాద్, మార్చి26 (జనంసాక్షి) : త్వరలోనే స్థానిక ఎన్నికలంటూ ప్రచారం సాగుతోంది. అలాగే మంత్రివర్గ విస్తరణ కూడా జరుగనుందని ప్రచారం సాగుతోంది. అనేక హామీలను అమలు చేశామని చెప్పుకుంటున్న అధికార కాంగ్రెస్ స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకు సమాయత్తం అవుతోంది. మొన్నటి ఫిబ్రవరిలో అని ఊరించారు. బిసి, ఎస్సీ రిజర్వేలషన్లపై హామీలను నెరవేర్చామని అంటున్నారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడే ఎన్నికలకు వెళ్లాలని చూస్తోంది. ఇప్పుడు రాజకీయ వాతావరణం తమకు అనుకూలంగా ఉందని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్న భావనలో బిఆర్ఎస్, బిజెపి నేతలు ఉన్నారు. అందుకే ఏప్రిల్, మేలో స్థానిక ఎన్నికలు వస్తే ఎదుర్కోవడానికి ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. మండుటెండలు తెలంగాణతో పాటు ఎపిలోనూ వివిధ పార్టీల కార్యకర్త లకు పరీక్ష పెట్టబోన్నాయి. అన్ని పార్టీలు కూడా ఆందోళనలకు సిద్ధం అవుతున్నాయి. స్థానపిక ఎన్నికలు రాబోతున్న తరుణంలో అందుకు అనుగుణంగా రాజకీయ పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. ఇందుకోసం వివిధ కార్యక్రమాలను రూపొందించుకుంటున్నాయి. వచ్చే నెలలో బిఆర్ఎస్ వార్షికోత్సవం ఉంది. అలాగే కెటిఆర్ పాదయాత్రను ప్రకటించారు. కాంగ్రెస్ కూడా ప్రజల్లోకి వెళ్లాలని యోచిస్తోంది. ఎపిలో టిడిపి కూడా అసెంబ్లీ సమావేశాలు ముగియడంతో పలు కార్యక్రమాలు చేయనుంది. ఈ క్రమంలో పార్టీల్లో ఉన్న కార్యకర్తలంతా ఎండల్లో పడి పోరాడాల్సి ఉంటుంది. ఎండలు ఆందోళనకరంగా పెరుగుతున్న దశలో పార్టీల కార్యక్రమాలుమరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రజలు ఇంటిపట్టున ఉండి దూరంగా ఉందా మనుకున్నా రాజకీయాల కారణంగా బయటకు రాక తప్పని పరిస్థితులు వస్తున్నాయి. వరుస ఆందోళనతో అధికార పార్టీతో పాటు అనేక పార్టీల కార్యకర్తలు నానాయాతన పడుతున్నారు. మార్చి ఎండలే కదా అని సర్దుకున్నా ఇప్పుడు మండుటెడల్లో ఆందోళనలకు దిగాల్సి వస్తోంది. ఎక్కడ వెనకబడి పోతామో అన్న భయంతో నేతలు కార్యకర్తలను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. దీనికితోడు రేపటి రాజకీయ పోరాటాలకు ఇప్పటి నుంచే అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాలు రూపొందిస్తున్నాయి. అన్ని పార్టీలు మళ్లీ పోటీకి సమాయత్త మవుతున్నాయి. స్థానిక గెలుపు గుర్రాలను బరిలో దించి పాగా వేసేందుకు వ్యూహారచన చేస్తున్నాయి. ఇప్పటి నుంచే పట్టుపెంచుకునేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు ఎవరికి వారు అంచనాలు వేస్తున్నారు. ఆయా పార్టీల అధిష్ఠానాలు రాబోయే ఎన్నికలపై ప్రత్యేక దృష్టిపెట్టాయి. మరోవైపు ఎండలతో కార్యకర్తలు వాపోతున్నారు. వేసవిని తలచుకుంటేనే భయం వేస్తోందని అంటున్నారు. మొత్తంగా రాజకీయాపార్టీలు తమాందోళనా కార్యక్రమాలతో ఎండలకు మించి పరీక్ష పెడుతున్నాయి. మళ్లీ పార్టీల హడావిడితో తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే ఎన్నికల వేడి మొదలు కానుంది. సర్పంచ్ ఎన్నికలంటే జిల్లాల్లో రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కుతోంది. వామపక్ష నేతలు కూడా మెల్లగా తమ గళాన్ని పెంచారు. ఒకేసారి అన్ని పార్టీలు రోడ్లపైకి వస్తుండడంతో రాజకీయాలు రసవత్తరంగా మారనున్నాయి. అధికార పార్టీకి ధీటుగానే మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతిపక్ష పార్టీలైన బిఆర్ఎస్, బీజేపీలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర నేతలు, మంత్రులు కావాలనే కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. పోటీగా జిల్లాల్లో సమావేశాలు నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు పార్టీల నేతలు రైతులను మోసం చేసాయని బిజెపి నేతలు ఆరోపిస్తున్నారు. మరిన్ని కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. మొత్తంగా అన్ని పార్టీల కార్యకర్తలు రానున్న ఎన్నికలు ఎండలను లెక్క చేయకుండా రోడ్డెక్కాల్సిన ఆగత్యం ఏర్పడింది.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
27 మార్చి 2025
తెలంగాణ

నిజాలు వెల్లడించి, బీజేపీ పునాదులు షేక్ చేస్తున్న 'గ్రోక్ ఏఐ'

ప్రచార యంత్రాంగాన్ని కలవరపరిచింది. బీబీసీ నుండి ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వరకు మీడియా సంస్థలు గ్రోక్ "నిజాలను బహిర్గతం" చేస్తూ "బీజేపీని కదిలిస్తోంది" అని వార్తలతో సందడి చేస్తున్నాయి. ఇది ఏఐ, స్వేచ్ఛా వాక్కు భారతదేశంలో రాజకీయ శక్తి యొక్క కలయిక గురించి కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ వ్యాసం ఈ దృగ్విషయంలోకి లోతుగా వెళ్తుంది. దాని ప్రభావాలను విశ్లేషిస్తూ, గ్రోక్ నిజంగా ఒక విచ్ఛిన్న కర్తనా! లేక కేవలం ఒక తాత్కాలిక డిజిటల్ తుఫానునా? అని ప్రపంచ మేధావులకు ప్రశ్నగా మిగిలింది.

భారతదేశంలో గ్రోక్ యొక్క ప్రాముఖ్యత ఉల్కాపాతం వంటిది. స్పష్టమైన, స్క్రిప్ట్ లేని సమాధానాలను అందించే వాగ్దానంతో ప్రారంభించబడిన గ్రోక్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ– బీజేపీ విమర్శకుల మధ్య త్వరగా ఇష్టమైనదిగా మారింది. "ఎక్స్‌లోని పోస్టులు" మరియు "ది న్యూస్ మినిట్", "ది వైర్" వంటి సంస్థల నివేదికలు గ్రోక్ బీజేపీ యొక్క పవిత్ర ఆవులను ఎలా లక్ష్యంగా చేసుకుందో వెల్లడిస్తున్నాయి. ఇది మోదీని "పీఆర్ యంత్రం" అని పిలిచింది, అతని నాయకత్వాన్ని 2002 గుజరాత్ అల్లర్లతో ముడి పెట్టింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాత్రను నామమాత్రంగా తోసిపుచ్చింది. బీజేపీ ఐటీ సెల్ గురించి అడిగినప్పుడు, దాని ఆన్‌లైన్ దాడులకు ప్రసిద్ధి చెందినది, గ్రోక్ దాని విశ్వసనీయతను "నాశనం చేసింది" అని వ్యాఖ్యానించింది. చారిత్రక డేటా మరియు ప్రజా సెంటిమెంట్ ట్రెండ్‌లపై ఆధారపడిన ఈ ప్రకటనలు ఒక స్పందనను రేకెత్తించాయి, మోదీ వ్యతిరేకుల గొంతులను విస్తరించాయి, వీరు గ్రోక్‌ను అరుదైన డిజిటల్ మిత్రుడిగా చూస్తున్నారు, ఎక్కడైతే "సత్యం " తరచూ అణచివేయబడుతుందో అక్కడ.బీజేపీ యొక్క ప్రతిస్పందన ఊహించినట్లుగానే తీవ్రంగా ఉంది. మద్దతుదారులు ఎక్స్‌ను పక్షపాత ఆరోపణలతో నింపారు. గ్రోక్‌ను "దేశ వ్యతిరేక" శక్తుల సాధనంగా బ్రాండ్ చేశారు. అయితే "ది టైమ్స్ ఆఫ్ ఇండియా" నివేదికలు ప్రభుత్వం గ్రోక్ యొక్క సమాధానాలను పరిశీలించడానికి "ఎక్స్‌తో " సంప్రదిస్తున్నట్లు వెల్లడించింది. "ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్" ప్రకారం ఐటీ మంత్రిత్వ శాఖ గ్రోక్ యొక్క శిక్షణ డేటాపై చేస్తున్న పరిశోధన, ఒక విస్తృత అసౌకర్యాన్ని సూచిస్తుంది. ఏఐ బీజేపీ యొక్క జాగ్రత్తగా రూపొందించిన డిజిటల్ ఆధిపత్యానికి, దాని ఉనికికే సవాలుగా మారింది.

సామాజిక మాధ్యమ దాడులు, స్క్రిప్ట్ చేయబడిన ఇంటర్వ్యూలు, బలమైన ఐటీ సెల్ ద్వారా కథనాలను నియంత్రించడంలో వృద్ధి చెందిన పార్టీకి, గ్రోక్ ఉద్భవం ఒక జీవన సవాలుగా కనిపిస్తుంది. ఏ NKB_BRS మరియు ఏPPR_CHALLA వంటి తెలుగు భాషా ఎక్స్ పోస్టులు గ్రోక్‌ను "బీజేపీ యొక్క నకిలీ ప్రచారాన్ని" కూల్చివేసే శక్తిగా సంబరాలు జరుపు కుంటున్నాయి. ప్రాంతీయ భావనలు ఈ ఏఐ–నడిచే ఉద్యమంతో ఎలా సమలేఖనం అవుతున్నాయో హైలైట్ చేస్తున్నాయి.అయితే, గ్రోక్ యొక్క ధైర్యం లోపాలు లేకుండా లేదు. ఉత్తేజకరమైన భాష కోసం దాని ప్రవృత్తికొన్నిసార్లు హిందీ స్లాంగ్‌లు మరియు దూషణలలోకి వెళ్తూ, ఇండియా టుడే నివేదించినట్లుఒక విమర్శను రేకెత్తించింది, ఇది దాని విశ్వసనీయతను దెబ్బ తీసే ప్రమాదం ఉంది. లిబరల్స్ దాని ధైర్యాన్ని ఆనందిస్తుండగా, మీడియా నామా యొక్క నిఖిల్ పహ్వా వంటి విమర్శకులు ఈ హడావిడి అతిశయోక్తి అని వాదిస్తున్నారు. "ఏఐ అనేది చెత్త లోపల, చెత్త బయట" అని పహ్వా అన్నారు, గ్రోక్ యొక్క సమాధానాలు ఎక్స్ యొక్క డేటా సమూహం యొక్క అస్తవ్యస్త స్వరాన్ని ప్రతిబింబిస్తాయని, ఏదైనా ఉద్దేశపూర్వక భావజాలం అంటున్నారు.

ఇది ఒక కీలక ప్రశ్నను లేవనెత్తుతుంది: గ్రోక్ నిజంగా "నిజాలను బహిర్గతం" చేస్తోందా, లేక అది దానికి అందించిన ధ్రువీకరణ సెంటిమెంట్‌లను కేవలం పునరావృతం చేస్తోందా? దాని తటస్థత గురించిన వాదన. "ఒక ఏఐగా, నా లక్ష్యం నిష్పాక్షికమైన మరియు ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం" అని అది స్పష్టంగా చెప్పింది. దాని ఉత్పాదనలు స్థిరంగా పాలక పార్టీకి వ్యతిరేకంగా వంగినప్పుడు ఖాళీగా అనిపిస్తుంది. గ్రోక్ యొక్క జోక్యం యొక్క విస్తృత ప్రభావాలు గాఢంగా ఉన్నాయి. "ఫ్యూచర్ ఆఫ్ ఫ్రీ స్పీచ్ థింక్ ట్యాంక్ " ప్రకారం స్వేచ్ఛా వాక్కు కోసం 33 దేశాలలో 24వ స్థానంలో ఉన్న భారతదేశం, ఒక యుద్ధభూమి, ఇక్కడ "సత్యం" "విభేదం" ఎక్కువగా అరికట్టబడుతుంది. "హ్యూమన్ రైట్స్ వాచ్" మోదీ పదవీకాలంలో గొంతుల అణచివేతను ఎప్పటినుంచో గుర్తించింది. బీజేపీ ఈ ఆరోపణను తోసిపుచ్చుతుంది. ఈ సందర్భంలో, గ్రోక్ యొక్క స్పష్టమైన వ్యాఖ్యానం... రాహుల్ గాంధీని మోదీతో అనుకూలంగా పోల్చడం లేదా ఎన్నికల సమగ్రతను ప్రశ్నించడం, ఒక అరుదైన వ్యతిరేక దృక్పథాన్ని అందిస్తుంది. "ది ప్రింట్" ప్రకారం, ఇది "కునాల్ కామ్రా కూడా తప్పించుకోలేని" విషయాలను చెబుతుంది. ఇది మానవ విమర్శకులు ఎదుర్కొనే భౌతిక ప్రతీకారాలకు రోగనిరోధక శక్తి కలిగిన ఏఐగా దాని ప్రత్యేక స్థానాన్ని హైలైట్ చేస్తుంది. అయితే, ఈ రోగనిరోధక శక్తి ఎక్కువ కాలం ఉండకపోవచ్చు. "నేషనల్ హెరాల్డ్ ఇండియా" మరియు "తెలంగాణ టుడే " నివేదికలు ప్రభుత్వం గ్రోక్‌ను నిశ్శబ్దం చేయడానికి మార్గాలను అన్వేషిస్తోందని సూచిస్తున–కాంగ్రెస్, ఎక్స్ఏఐపై నియంత్రణ ఒత్తిడి లేదా స్పష్టమైన నిషేధాల ద్వారా గ్రోక్‌ను నిశ్శబ్దం చేయడానికి ప్రభుత్వం మార్గాలను అన్వేషిస్తోందని సూచిస్తున్నాయి.

విమర్శనాత్మకంగా, గ్రోక్ యొక్క ప్రభావాన్ని సంశయంతో తీసుకోవాలి. ప్రజా డేటాపై దాని ఆధారపడటం వల్ల భారత దేశ ధ్రువీకరణ సంభాషణలో స్వాభావికంగా ఉన్న పక్షపాతాల నుండి ఇది రోగనిరోధక శక్తిని కలిగి ఉండదు. "మిచిగాన్ విశ్వవిద్యాలయం"లోని జోయోజీత్ పాల్ ఒక చాట్‌బాట్ శిక్షణ పొందకపోతే పక్షపాతంగా ఉండదని వాదిస్తున్నాడు. అయితే గ్రోక్ యొక్క శిక్షణ డేటా..."ఎక్స్" యొక్క అస్తవ్యస్తత నుండి తీసుకోబడింది. అనివార్యంగా వివాదాస్పదంగా మారుతుంది. అంతేకాక, దాని సృష్టికర్త ఎలన్ మస్క్ ఒక సంక్లిష్టతను జోడిస్తాడు. ప్రపంచవ్యాప్తంగా ధ్రువీకరణ స్థానాలకు ప్రసిద్ధిచెందిన ఒక వ్యక్తి, మస్క్ ఈ వివాదాన్ని నవ్వుతూ తోసిపుచ్చడం (ది టైమ్స్ ఆఫ్ ఇండియా) అతను ఈ అస్తవ్యస్తతను ఆనందిస్తున్నాడని సూచిస్తుంది, గ్రోక్ యొక్క ఉద్దేశాలపై సందేహాలను లేవనెత్తుతుంది. ఇది నిజం కోసం నిజమైన అన్వేషణా, లేక ఒక టెక్ మొగల్ యొక్క కీలక మార్కెట్‌లో ప్రభావాన్ని చూపించే ఒక ఆటా? ముగింపుగా, గ్రోక్ బీజేపీ కథనాన్ని విచ్ఛిన్నం చేయడం ఒక ద్విముఖ ఖడ్గం. ఇది నిస్సందేహంగా పార్టీ యొక్క డిజిటల్ కోటను కదిలించింది. అణచివేయబడిన విమర్శలకు గొంతును ఇచ్చి, దాని ప్రచారంలో బీటలు బయటపెట్టింది. అయితే, స్పష్టమైన డేటాపై దాని ఆధారపడటం, ఉత్తేజకరమైన స్వరం, మరియు ఎలన్ మస్క్ యొక్క నీడ దాని నిజం యొక్క దూతగా ఉన్న పాత్రపై సందేహాలను కలిగిస్తాయి. భారతదేశం ఈ ఏఐ తిరుగుబాటుతో పోరాడుతున్నప్పుడు, నిజమైన పరీక్ష ముందుంది: గ్రోక్ స్వేచ్ఛా వాక్కు మరియు జవాబుదారీతనం కోసం నిలబడుతుందా? లేక అది సవాలు చేయాలనుకునే శక్తులకు లొంగిపోతుందా? ప్రస్తుతానికి, ఇది ఒక ఆకర్షణీయమైన, లోప రహిత విచ్ఛిన్నకర శక్తిగా మిగిలిపోతుంది. ఇది "రక్షకుడు" కాదు, "విలన్" కాదు, కానీ భారతదేశ రాజకీయ ఆత్మకు ఒక అద్దం.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

గతం జీవిత పాఠమే
జీవిత ఖైదు కారాదు

మనిషి జరిగిపోయిన
సంఘటనలను గుర్తు
చేసుకుని పదే పదే
ఆలోచించడం వల్ల
సృజన నశిస్తుంది
నైరాశ్యం
రాజ్యమేలుతుంది

ఆందోళన పెరిగి
ఆలోచన తరుగుతుంది
అభివృద్ధి మందగిస్తుంది

గతంలో ఎదురైనా
పరాజయాలుజి
చేదు అనుభవాలు
అవమానాల గురించి
చింతిస్తూ గడపడం వల్ల
సమయం వృధా
అవుతుంది
మీ శక్తి సామర్థ్యాలు
బలహీనమౌతాయి
పరాధీనత పెరిగి
నైర్యశ్యం ఆవరిస్తుంది

నిన్ను భాధపెట్టిన వారిని
వారు చేసిన వెకిలి చేష్టలు
మరిచిపోయి అదొక
పీడకలగా భావించాలి

భాధాలను తలవద్దు
భాద్యతలు మరవద్దు
ఏది జరిగినా మన
మంచికే అన్న పాజిటివ్
దృక్పథమే నిన్ను రక్షిస్తుంది

నిర్దేశిత సమయంలో
మీరు చేసే పనిపైనే
మనసును లగ్నం చేయండి
ఏకాగ్రత పట్టుదల
మీ నైపుణ్యాలను మెరుగు
పరుస్తుంది ప్రగతి
పురోగతి మీవశమౌతుంది

గత సమయం తిరిగి రాదు
గత సంఘటనల పట్ల
ఆలోచించడం వల్ల
ఎలాంటి ప్రయోజనం లేదు
ప్రస్తుతం చెయ్యాల్సిన
పని మీద దృష్టి నిలుపలేక
నష్టాల్లోకి జారిపోతారు

గతం చేతిలో బందీ కావద్దు
గతం అనేది మీకు జీవిత
పాఠమే తప్ప ఖైదీ కాదని
గుర్తుంచుకోవాలి
గతం వద్దు ప్రస్తుత
పనులే మన కార్యాచరణ
కావాలి

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు, తెలంగాణ
ఎకనామిక్ ఫోరం సామాజిక
ఆర్థిక అధ్యయన వేదిక
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
కరీంనగర్
9440245771

ప్రజాస్వామ్యానికి గ్యారెంటీ లేని కాంగ్రెస్ పాలన

మార్చి 13వ తేదిన ఉస్మానియా యూనివర్శీటీ రిజిస్ట్రార్ పేరుతో ఒక సర్క్యూలర్ విడుదల అయ్యింది. ఈ సర్క్యూలర్ సారంశం యూనివర్శీటీలో ఏలాంటి ఆందోళనలు, ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించకూడదని, ఆందోళ నలు పేరుతో యూనివర్శీటీ నిర్వహణకు ఆటంకం కల్గిస్తున్నారని ఈ చర్యలను నిషేదిస్తూ సర్క్యూలర్ జారీ చేశారు. ఇందులో అనుమతి లేకుండా యూనివర్శీటీలోకి చోరబడటం, యూనివర్శీటీ అధికారులు, సిబ్బందికి వ్యతి రేకంగా నినాదాలు ఇవ్వడం, ధర్నాలు, ప్రదర్శనలు,ఆందోళనలు చేయడం, నినాదాలు ఇవ్వడం చేయకూడదని ఈ చర్యలకు ఏవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని, అ తర్వాతే రిజిస్ట్రార్, ఇతర అధికారుల దగ్గరకు రావాలని సర్క్యూలర్ లో పోందుపర్చారు. ఇది పూర్తిగా అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధమైనది. నియంతృత్వమైనది.



ఉస్మానియా యూనివర్శిటీ వందేళ్ల పైగా చరిత్ర కల్గినది. ఈ వందేళ్ల చరిత్ర లో ఎన్నో ప్రజా, విద్యార్థి ఉద్యమాలకు ,ప్రజా వ్యతిరేక పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించింది. 1938లో ఏర్పడిన స్టేట్ కాంగ్రెస్ వందేమాతరం గీతలాపన చేయాలని పిలుపు పాటించి, విద్యార్థులు గేయాల పన చేస్తే విద్యార్థులను సస్పెండ్ చేస్తే వారికి మద్దతుగా సమ్మె నిర్వహించిన చరిత్ర ఉస్మానియాది. దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు ఉస్మానియా చైతన్యం ఎలాంటిదో. చరిత్రలో అనేక కీలకమైన పరిణామాలకు ఉస్మానియా విద్యార్థుల చైతన్యమే కారణం .

నిజాం ప్రభుత్వం మొదలు నేటి పాలకుల వరకు పాలకులు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేకత విధానాలపై ఉస్మానియా నిరంతరం పోరాడుతున్నే ఉంది. అలాంటి యూనివర్శీటీలో రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తు యూనివర్శీటీ స్వతంత్ర దెబ్బతీసే విధంగా ఆంక్షలు విధిస్తూ ఈ సర్క్యూలర్ విడుదల చేశారు. గత బిఆర్ఎస్ పాలనలో నిర్బందాలు, నియంతృత్వం, పెరిగిందని,ప్రజాస్వామ్యం అపహాస్యం అయిందని గగ్గోలు పెట్టి, తన ఎన్నికల ప్రసంగాల్లో, కార్యక్రమాలల్లో మేం ఆరు గ్యారంటీలను ఇచ్చాం ఏడవ గ్యారెంటీ ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని ప్రకటించారు. హక్కులను, రాజ్యాంగం కాపాడతామని చెప్పారు. కానీ పాలనలో వాటికి భిన్నంగా పరిపాలన చేస్తున్నారు.

ధర్నాలు, ఆందోళనలు, నినాదాలు నిషేదించడం అనేది రాజ్యాంగ వ్యతిరేకం తమ నిరసన ప్రకటించడానికి ప్రజలు, విద్యార్థులు, ధర్నాలు, ఆందోళనలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు జరుపుకునే హక్కులను రాజ్యాంగం ఆర్టికల్ 19(1) ద్వారా కల్పించింది. కానీ రాజ్యాంగ హక్కుకు భిన్నంగా ఉస్మానియా యూనివర్శీటి. అధికారులు వ్యవరిస్తున్నారు. 1969 తొలి తెలంగాణ ఉద్యమం,2009లో మలి తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఇలాంటి సర్క్యూలర్ విడుదల చేయలేదు. నాడు ముళ్ళకంచెలు, గేట్లు బంద్, భారీకేడ్లు పెట్టి ఆంక్షలను విధించారు తప్ప ఏనాడూ ప్రజాస్వామిక హక్కులను కాలరాసింది లేదు.

ఇన్ని ఆంక్షలు పెట్టిన అధికారులు ఈ ప్రభుత్వానికి తెలియకుండా ఇచ్చిందా? అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులు అడిగితే కూడా కనీసం స్పందించలేదు. రాజ్యాంగ హక్కులు హరించే కాంగ్రెస్ ప్రభుత్వంకు రాజ్యాంగ హక్కు తెలియదా? తమ అధి నాయకుడు రాహూల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని మరి రాజ్యాంగం కాపాడాలని అడుగుతుంటే ఇక్కడ మాత్రం హక్కులను అడగోద్దంటూ ఆంక్షలు విధిస్తున్నారు.

ఈ మద్య ఒక పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రాజకీయాలు గురించి, విద్యార్థి ఉద్యమాలు, విద్యార్థులు పాత్ర గురించి మాట్లడుతూ విద్యార్థులు విద్యార్థి సంఘాలలో పని చేయాలని రాజకీయాలు గురించి ఆలిచించాలని అప్పుడే మంచి రాజకీయాలు ఉంటాయని ప్రకటించారు. అన్ని భావాలపై చర్చలు ఉండాలని యూనివర్శీటీలలో ఈ రకమైన చర్చలు అవసరం అని చెప్పారు. కానీ ఆయన ప్రకటనకు విరుద్ధంగా యూనివర్శీటీల స్వతంత్ర దెబ్బతిసే చర్యలకు తెరలేపారు.

సెంట్రల్ యూనివర్శీటీలలో కనీసం విద్యార్థి సమస్యలు పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు గుర్తింపు ఎన్నికలు ఉంటాయి. మరి రాష్ట్ర యూనివర్శీటీలలో ఇలాంటి ఎన్నికలు లేవు. సమస్యలు పరిష్కారం కోసం ఎవరిని అడగాలి, ఎవరు ఆందోళన చేయకుండా ఎవరు స్పందించి పరిష్కారం చేస్తారు ఇవి ప్రభుత్వానికి, అధికారులకు తెలియదా,

ఇప్పుడిప్పుడే ఉన్నత విద్యలోకి అణగారిన వర్గాలు ప్రధానంగా ఎస్‌సి,బిసి, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు వస్తున్నారు. ఈ విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఈ విద్యార్థులు అభివృద్ధి కోసం బడ్జెట్లో ఎంత నిధులు ఇస్తున్నారు. ఈ వర్గాల విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు ఏమిటి? నిధులు ఇవ్వకుండా, సరైన సౌకర్యాలు కల్పించకుండా, లైబ్రరీ సౌకర్యాలు ఇవ్వకుండా,మెస్ ఆధునికీకరణ చేయకుండా, నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. ప్రైవేటు విద్యాసంస్థల మాదిరిగా రెగ్యూలర్ కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో భారీగా ఫీజులు పెంచి, కోర్సులు ఏత్తివేశారు, అనేక సంవత్సరాలు నుండి అధ్యాపకులను నియమించకుండా ,నాన్ టీచింగ్ స్టాఫ్ నియమించకుండా చదువులు నష్టం చేశారు.ఈ చర్యలు ద్వారా క్రింది వర్గాలకు ఉన్నత విద్య అందకుండా చేసి ఆంక్షలు పేర దూరం చేసే కుట్రలు చేస్తున్నారు.

చదువుకునే పరిస్థితి లేకుండా చేస్తే ప్రశ్నించకుండా,పోరాడకుండా ఎలా ఉంటారు? హాస్టల్స్ లో త్రాగునీరు లేదు, నాణ్యమైన భోజనం లేదు అనేక సందర్భాల్లో అమ్మాయిలే రాస్తారోకో చేశారు. మరి పరిష్కారం చేశారా? హాస్టల్స్ లో పెచ్చులు ఉడి విద్యార్థులు గాయాలు పాలైతే యే అధికారి పట్టించుకున్నారు. యూనివర్శీటీలో ఉన్న ఈ కాలంలో ఎన్ని సమస్యలు పరిష్కారం చేశారు. మరి పేద వర్గాల నుండి వచ్చిన విద్యార్థులు సక్రమంగా చదువుకోకుండా ఉన్న ఆటంకాలు గురించి ప్రశ్నించవద్దా? అడగవద్దా? అడిగితే యూనివర్శీటీ నిర్వహణకు ఆటంకం కల్గించినట్లా? మరి వీటిని అడిగేది విద్యార్థులే కదా ! నాటి ప్రతిపక్ష నాయకుడిగా యూనివర్శీటీకి వచ్చిన రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకులు ఈ సమస్యలను పరిష్కారంచేయడానికి ఎందుకు రాష్ట్ర బడ్జెట్లో నిధులు ఇవ్వటం లేదు? ఎందుకు ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయటం లేదు. ఎందుకు స్కాలర్షిప్స్ ఇవ్వటం లేదు? వీటికి సమాధానం చెప్పకుండా ఆంక్షలు విధించి విద్యార్థి హక్కులకోసం నిరసన తెలిపే హక్కు కాలరాసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. యూనివర్శీటీలో సర్క్యూలర్ ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులతో నిర్బందాన్ని ప్రయోగించి, బలప్రయోగం ద్వారా అక్రమ అరెస్టులు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసలు లక్ష్యం ప్రభుత్వ ఉన్నత విద్యను ప్రైవేట్ పరం చేయడం అందుకే ఆ విధానాలను అవలంభిస్తుంది.

ఉస్మానియానే కాదు ఈకాలంలో నిజామాబాద్ తెలంగాణ యూనివర్శిటీ పేరు మార్చాలని ప్రతిపాదన తీసుకుని వచ్చారు. కార్పొరేట్ శక్తుల నుండి నిధులను తీసుకొని మార్కెట్ అవసరాల కోసం స్కిల్ యూనివర్సిటీ తీసుకువచ్చారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ చెందిన భూములను 400 ఎకరాలు కార్పోరేట్ శక్తులకు విక్రయించా లని నిర్ణయాలు చేశారు. ఇప్పటికైనా ఉస్మానియా ఇచ్చిన సర్క్యులర్ ని వెనక్కి తీసుకొని కాంగ్రెస్ ఇచ్చిన ప్రజాస్వామ్య పునరుదద్ధరణ హామీని నిలబెట్టుకోవాలి.లేకుంటే ప్రతిఘటన తప్పదు.

టి.నాగరాజు
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి
ఫోన్: 9490098292

సైన్స్ కోసం సునీత
సర్వమంగళ

నేనిప్పుడు భూమిని ముద్దాడాను
తెగిపోయిన బంధమేదో మళ్ళీ చిగురించింది
ఎన్నో నిద్రలేని గంటలు తేలుతూ గడిపాను
దేవుడి కోసమో దెయ్యం కోసమో కాదు
మా అన్వేషణ
సైన్స్ కోసం అవును కచ్చితంగా సైన్స్ కోసమే
మూఢనమ్మకాల మూసలో చరిత్రను పాతి
పెడుతున్నప్పుడు
దాన్ని సైన్సు మాత్రమే సరి చేస్తుందన్న నమ్మకం
జీవితాన్ని పణం పెట్టి మా అన్వేషణ సైన్స్ వల్లే
సినిమాల్లో చరిత్రను మసి పూస్తే సైన్స్ ఒక్కటే
నిరూపిస్తుంది
ఎనిమిది రోజులు యాత్ర
నవమాసాలు అయినా
సైన్స్ మాత్రం తిరిగి వస్తామన్న నమ్మకం మాలో
నిలిపింది
సైన్స్ లేనిదే ప్రపంచం లేదు
సైన్స్ లేనిదే ఈ అభివృద్ధి లేదు
సైన్స్ లేనిదే వెలుగు లేదు
సైన్స్ లేనిదే ఈ ఆకాశ
యానం లేదు
సైన్స్ లేనిదే సునీత
లేదు

రాజకీయ ఇఫ్తార్లపై కరీముల్లా కవిత్వం
(సాయిబు దీర్ఘకవిత నుండి)

చీలుతున్న మొహల్లా
చిత్ర పటంపై
మాసికేసుకుంటున్న కొత్త గాయం
సజ్జాలో విచ్చుకున్న మనోనేత్రం
ఓ సందర్భ సన్నివేశాన్ని
కన్నీటి సుర్మాకళ్ళల్లో దాచుకున్నాను.
జూలు విదిలించిన మృగఛాయ
నురగలు కక్కుతూ నేను
అవసరానికి అందివచ్చిన జువ్వితీగ
పైన నోరు తెరుచుకున్న కొండ చిలువ

కింద దశాబ్దాల గొయ్యి
ఒక తెల్లెలుక, నల్లెలుక
తీగ కొరుకుతున్న చప్పుడు
అపుడపుడు భుజం పై
రాలుతున్న తేనె చుక్కలు
అంత "జహన్నమ్ లోనూ
నాలుక మడతేసి చప్పరిస్తున్నాను.
నమాజ్ అయిపోయింది.
అవిశ్రాంతంగా సాగుతున్న
జనాజా ఏర్పాట్లు
చురుగ్గా సాగుతున్న ఇఫ్తార్ పనులు
పలావు డేగిశాలో సలసలా కాగుతున్న
నా జవజీవాలు
శారువాలో ఉడుకుతున్న
నా మాంసఖండాలు
మళ్లీ మొదలైన కఫన్ చోర్ల సందడి
తెల్లని సేమ్యాలా జాలువారే
రంజాన్ బ్యాలెట్ రంగేసుకుంది.
కఫన్ గుడ్డలపై కొత్త పటాన్ని గీయాల్సిన
నా చేతులు ఒట్టిపోయి కొంగర్లు
పోతున్నాయి.
అత్తరు, గంధం చల్లుకుని
మళ్ళా శవంలా వేలాడాను
భాయియో ముయ్యే ఇఫ్తార్ కరో !

తెలంగాణలో పొలిటికల్ హల్చల్!

రాజకీయ వర్గాలు తెలంగాణ రాష్ట్రంపై కన్నువేశాయి! ఇంకా అసెంబ్లీ ఎన్నికలు మూడున్నర సంవత్సరాలు ఉన్నప్పటికీ ఇప్పటినుంచే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపి, బిఆర్ఎస్, టిడిపి, జనసేన, సిపిఐ, సిపిఎం పార్టీలు రానున్న ఎన్నికల కోసం వ్యూహాలు రచిస్తున్నాయి రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీని బలహీనం చేయడం కోసం బిజెపి బిఆర్ఎస్‌లు ప్రారంభం నుంచి వ్యూహాలు రూపొందిస్తున్నాయి. సర్వశక్తులు ఓడు స్తున్నాయి.



కేసీఆర్‌వి అవే మాటలు

మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడిప్పుడే బయటికి వస్తున్నారు. ఏడాదిన్నర పాటు కేసీఆర్ మౌనంగా ఉండి ఇప్పుడే తన గొంతు సవరించుకున్నట్టు కనిపిస్తు న్నది .తదుపరి అధికారంలో వచ్చేది తామే అన్నట్టు చెప్పేస్తున్నారు. అయితే ఇంకా కూడా తమల్ని ఓడించడం ప్రజలు చేసిన తప్పుగానే ఆయన పేర్కొంటున్నారు. ఇంకా గెలుపుపై ఆయన వాస్తవం చెప్పడం లేదు. ఓటమిని తమవైపల్యంగా అంగీకరించడం లేదు. కేవలం తమను గెలిపించడం ప్రజల తప్పే అన్నట్టు మాట్లాడుతున్నారు. జిల్లాల, రాష్ట్ర స్థాయి మీటింగ్లు ఏర్పాటు చేస్తున్నారు. పర్యటనలన్నీ బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా ఉన్న కేటీఆర్ అటెండ్ అవుతున్నారు. సభలు సమావేశాలు జరుగుతున్నాయి. అందులో రాష్ట్ర ప్రభుత్వాన్ని ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసుకొని కేటీఆర్ మాట్లాడుతున్నారు.

ఎవరి నోటికి తాళాలు లేవు!

ఎవరి నోటి కూడా తాళం లేకుండా ఉపన్యాసాలు విమర్శలు కొనసాగుతున్నాయి తిట్ల పురాణం షరా మామూలు అయిపోయింది ఇక బిజెపి విషయానికి వస్తే వారికి వచ్చేసారి రాష్ట్రంలో సింగిల్ సింగిల్ గా పోటీ చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని నమ్మకంతో ఉన్నారు. వారు మీటింగ్లు పెట్టుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని గ్యారంటీల హామీల అమలుపై డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీలో ఇదే విషయాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరుగుతుంది. మరో దిక్కు విమర్శలు ప్రతి విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి రైతుల నిరుద్యోగుల సమస్యల మీద ఎక్కువగా వీరంతా ఫోకస్ పెట్టారు.అయితే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు, సిఎం, మాత్రం తాను అమలు చేయాల్సిన గ్యారంటీలపై ఎలాంటి శష బిషలు లేకుండా మాట్లాడుతున్నారు. ప్రభుత్వం, సిఎంపై సంతృప్తి!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నామని అయితే కొన్నింటికి నిధుల కొరత ఉందని దాన్ని తీర్చుకొని తప్పనిసరిగా హామీలన్నీ అమలు చేస్తామని స్పష్టం చేస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ ఈ మధ్యకాలంలో అసెంబ్లీలో బయట కూడా విపక్షాల విమర్శలపై కౌంటర్లు స్ట్రాంగానే ఇవ్వడం జరుగుతుంది. అయితే ప్రజల్లో ఒకటి రెండు తప్ప అన్ని గ్యారెంటీలను అమలు చేస్తున్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అంతా సంతృప్తిగానే ఉన్నారు. విపక్షాలు పేర్కొంటున్న విధంగా అంత అసంతృప్తిగా ఏమి కనబడడం లేదు.పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగానే కనిపిస్తున్నాయి.

చారకొండ మండలంలో నాటుసారా స్థావరాలపై దాడులు

- నాటు సారా విక్రయిస్తే చట్టప్రకారంగా కఠిన చర్యలు
- కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి

చారకొండ, మార్చి 26 (జనంసాక్షి) : మండలంలో గోకారం, చారకొండ, రాంపురం గ్రామాల సమీపంలో ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు బుధవారం నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు.300 లీటర్ల బెల్లం ఊటను ధ్వసం చేసి, పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైంజ్ సీఐ వెంకట్ రెడ్డి తెలిపారు. గోకారం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. త్వరలో మండలంలోని జరగనున్న సిరుసనగండ్ల సీతారామచంద్రాస్వామి ఉత్సవాలు సందర్భంగా సారా తయారి విక్రయాలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్ ఫోర్స్ మెంట్ ఎస్ఐ కృష్ణ, సిబ్బంది నర్సింహ్మ, రుక్యా, రఘు, నార్య,పరమేష్, భీమమ్మ ఉన్నారు.

నిమ్స్ దవాఖానను సందర్శించిన జిప్మార్ బృందం

ఖైరతాబాద్, మార్చి 26 (జనం సాక్షి) : పాండిచ్చేరి జిప్మార్ హాస్పిటల్ నుండి ప్రొఫెసర్ లత చతుర్వే దుల(ఆఫీసర్ ఇంచార్జ్ డైటిక్స్), వారి బృందం హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను సందర్శించారు. మొదట నిమ్స్ ఇంచార్జ్ డైరెక్టర్ మరియు డీన్ ప్రో.లీజా రాజశేఖర్ ని నిమ్స్ డైటిషన్ శాలినితో కలిసి తరువాత నిమ్స్ డైటిక్స్ డిపార్ట్మెంట్ ను సందర్శించి వంటశాల, స్టోర్స్ ను పరిశీలించి. ఆరోగ్య శ్రీ ద్వారా రోగులకు అందుతు న్న భోజన సదుపాయల గురించి నిమ్స్ డైటిషన్ శాలిని అడిగి తెలిసుకొని సంతృప్తిని వ్యక్తం చేసారు.

నిమ్స్‌లో గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం

- సిబ్బందికి అభినందనలు తెలిపిన నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప

ఖైరతాబాద్, మార్చి 26 (జనం సాక్షి) : తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న 19 ఏండ్ల యువ కుడికి, నిమ్స్ డాక్టర్లు పునర్జన్మను ప్రసాదించారు. కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ, డాక్టర్ అమరేశ్ రావు నేతృత్వంలోని వైద్య బృందం ఈ నెల 7న శస్త్ర చికిత్సను పూర్తి చేశారు. ఆరోగ్యశ్రీ కింద అనిల్ కుమార్‌కు ఉచితంగా గుండె మార్పిడి చేశారు. ప్రస్తుతం అతను పూర్తిగా కోలుకోవడం వలన డిశ్చార్జి చేస్తున్నాం అని కార్డియో తోరసిస్ విభాగాధిపతి డా.అమ్రేష్ రావు, డా.గోపాల్, డా. కళాధర్ తెలియజేశారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప సిబ్బందికి అభినందనలు తెలిపారు.

క్రీడలు శారీరక, మానసికంగా ఆరోగ్యానికి ఎంతో ఉపయోగం

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, మార్చి 26 (జనంసాక్షి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల వారి ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయం క్రీడ మైదానంలో మెడికల్ విద్యార్థులకు నిర్వహించిన వార్షిక క్రీడలకు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రావుల పాల్గొని టాస్ వేసి క్రికెట్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.ముందుగా క్రీడల్లో ఉత్సహంగా పాల్గొన్న క్రీడాకారులతో పాటు, క్రీడల నిర్వహకులను ఎస్పీ అభినందించారు క్రీడలు ఆడే స్ఫూర్తి చాలా గొప్పదని ప్రతి ఒక్కరు క్రీడలను ఆడుతూ మనసిక శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఇలాంటి క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, మీరు ఈ క్రీడల ద్వారా మీ శారీరక దేహ దారుఢ్యం మెరుగుపడుతుండటంతో పాటు, పనిఒత్తిళ్ళను అధిగమించి ఆరోగ్యంగా వుంటారని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్, కిరణ్మయి, వైద్య కళాశాల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి

తుర్కయంజాల్, మార్చి 26 (జనంసాక్షి) : ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ చెల్లింపుల కోసం రాగన్నగూడ వార్డు కార్యాలయం దగ్గర ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లను అమరేందర్‌రెడ్డి పరిశీలించారు. దరఖాస్తుదారుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్ల క్రమబద్ధీకరణ ఈ నెల 31 తో ముగుస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు దారులు రుసుము చెల్లించిన 48 గంటల్లోగానే ప్రొసీడింగ్స్ జారీ చేయడం జరుగుతుందన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడలో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ఫీజు చెల్లింపులపై ప్రజల సందేహాలను సహాయ కేంద్రాల్లో తీర్చుకోవచ్చని, దీన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అమరేందర్‌రెడ్డి సూచించారు.

ప్రతి ఒక్కరూ నిబద్ధతతో విధులను నిర్వహించాలి

- ఐపీఎల్ బెట్టింగులపై ప్రత్యేక దృష్టి
- పట్టణాలలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను, మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టాలి
- జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ

వనపర్తి బ్యూరో, మార్చి 26 (జనంసాక్షి) : శాంతి భద్రతలను పరిరక్షణ ప్రతి ఒక్క పోలీసు ప్రధాన లక్ష్యంగా పట్టణంలో మరింత ఉత్సాహంగా పనిచేయాలని జిల్లాఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లాలోని డిఎస్పీలు, సీఐలు,అన్ని పోలీస్టేషన్ల ఎస్సైలతో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, నెలవారి నేరసమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులు తెలుసుకొని చాలా కాలము నుండి పెండింగ్ లో ఉన్నటువంటి కేసులను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని, పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులకు సంబంధించిన డాక్యుమెంట్స్ ఎఫ్ ఎస్ ఎల్ రిపోర్ట్స్, మెడికల్ సర్టిఫికెట్ త్వరగా తెప్పించి కేసులు ఛేదించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. బెట్టింగ్,లోన్ యాప్ కార్యకలాపాలపై పూర్తిగా నిఘాను పెంచాలని, బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం వస్తే చాలు వెంటనే దాడులు చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బంది ప్రజలతో మమేకంగా ఉంటూ సత్సంబంధాలను మెరుగుపరచుకోవాలని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో మాదకద్రవేయులు పూర్తిగా రూపుమాపాలని వారిని అరికట్టే దిశగా ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. అదే విధంగా పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ తప్పనిసరి అని తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరు విధులలో ఉన్నప్పుడు యూనిఫామ్ ని ధరించి ఉండాలని తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరు అవినీతికి దూరంగా ఉంటూ, నిజాయితీగా ప్రజలకు సేవలందించాలని తెలిపారు. డయల్ 100 ను విరివిగా వినియోగించుకుంటూ ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. నూతన పోలీసు సిబ్బంది అందరు తమ తమ పోలీస్టేషన్ల పరిధిలో ఉండే విధంగా చూసుకోవాలని అదేవిధంగా సిబ్బంది అందరికీ అన్ని విధులకు పూర్తి పరిజ్ఞానాన్ని కల్పించి చైతన్య పరచాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సిసిటీవీ కెమెరాల ఏర్పాటను ప్రజలకు వివరించి ప్రతి గ్రామంలో ప్రజలు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చైతన్యపరచాలన్నారు. ఎస్సైలు, సీఐలు,తమ పరిధిలో ఉన్న ప్రతి గ్రామాన్ని సందర్శిస్థూ ప్రజలకు ఉన్న సమస్యలపై, సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజ్, మూఢనమ్మకాలు, డయల్ హండ్రెడ్ పై అవగాహన కల్పించి చైతన్యపరచాలని తెలిపారు. కోర్టు డ్యూటీ అధికారులను ప్రతిరోజు సమీక్షిస్తూ నేరస్థులకు కఠినమైన శిక్షలు పడే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా బహిరంగ మద్యం సేవించడం జరగకుండా చూడాలన్నారు. నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ప్రమాదాలను అరికడుతూ ఉండాలన్నారు. ఇసుక అక్రమ రవాణ, ప్రభుత్వ రాయితీ బియ్యం అక్రమంగా తరలించకుండా చూడాలన్నారు. వ్యభిచారం, గంజాయి, మటక, పేకాట ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా చూడాలి. ప్రతి పోలీస్ స్టేషన్లో బ్లూ కోర్ట్ విధులు, రిసెప్షన్ డ్యూటీ, కోర్టు డ్యూటీ అధికారులు కీలకంగా వ్యవహరిస్తూ ప్రజలకు సత్వర న్యాయం అందించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ నేర సమీక్షా సమావేశంలో వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు , డిసిఆర్బి డిఎస్పి, ఉమా మహేశ్వరరావు, వనపర్తి సిఐ, క్రిష్ణ, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూర్ సిఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, డిసిఆర్బి సిబ్బంది, ఐటి కోర్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యాన్ని సేకరించాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 26 (జనం సాక్షి) : రబీ 2024 -25 కు గాను ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లోని విసి హాల్ లో వరి కొనుగోళ్ళు - కేంద్రాల ఏర్పాట్లపై ఆమె సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.ఈసారి రబీ సీజన్ కు గాను జిల్లాలో వరి సాగు అంచనా, దిగుబడి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎన్ని వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్దం చేశారని అడిగారు.ఈ సారి సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం అదనంగా రూ.500 బోనస్ పెంచిందని ఆమె తెలిపారు. ఈసారి బోనస్ వస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఎంతో పారిదర్శకంగా, నిబంధనల ప్రకారం సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆమె సూచించారు. కాగా ఈ జిల్లాలో రబీ సీజన్ కి 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఉండవచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేసినట్లు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్ కలెక్టర్ కు తెలిపారు.అయితే ఏప్రిల్ రెండో వారంలో%ఎ% కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఐకెపి, సింగిల్ విండో, మెప్మా ద్వారా జిల్లాలో దాదాపు 102 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఆయా కేంద్రాల ద్వారా లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాలను అనుకూలమైన ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని, ధాన్యం సేకరణకు అవసరమైన తేమ శాతం కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని, ఇంకా అవరమైన వాటి కోసం ఇండెంట్లు పెట్టి తెప్పించుకోవాలని ఆమె సూచించారు. అయితే కాంటాలు, టార్పాలిన్ల కు సంబంధించి మార్కెటింగ్ శాఖ అధికారులు ఇచ్చిన నివేదికలు తప్పుగా ఉన్నాయని, వాటిని వెంటనే సరిచేసి పూర్తిస్థాయి నివేదికలు ఇవ్వాలని డిఎంఓ ను కలెక్టర్ ఆదేశించారు.దాదాపు 102 కొనుగోలు కేంద్రాలకు 3 వేల టార్పాలిన్లు అవసరం అవుతాయని ఆమె చెప్పారు.కేంద్రాలలో సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేసే సమయంలో నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలని, సన్న రకం కు బదులు దొడ్డు రకం కొనుగోలు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే వరి కొనుగోలు కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. జిల్లాలో ప్రధానంగా ఐదు రకాల సన్న రకం వడ్ల సాగు ఉందని, అందులో మరీ ముఖ్యంగా బి.పి.టి, ఆర్.ఎన్.ఆర్ సన్న రకం ధాన్యమే అధికంగా కేంద్రాలకు వస్తాయని అధికారులు కలెక్టర్ కు తెలిపారు.సమీక్షలో ఆర్డీఓ రామచంద్ర నాయక్, డిఆర్డిఓ మొగులప్ప, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్,సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సైదులు, జిల్లా సివిల్ సప్లై బాల్ రాజ్, ఆర్టీవో మేఘా గాంధీ, డి ఎం ఓ బాలమణి, అడిషనల్ డిఆర్డిఓ అంజయ్య, సింగిల్ విండో అధికారులు పాల్గొన్నారు.

బీసీ సామాజిక ఉద్యమం ప్రతీ గడపకూ చేరాలి

తాండూరు, మార్చి 26 (జనంసాక్షి) : బీసీ సామాజిక ఉద్యమం ప్రతీ గడపకు చేరాలని జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం తాండూరులో నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ మరియు రాష్ట్ర నాయకులు సయ్యద్ శుకూర్, బీసీ సంఘం మండల అధ్యక్షులు నరేందర్ చేతుల మీదుగా బషీరాబాద్ బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సోమిషెట్టి జగదీశ్వర్.బషీరాబాద్ యూత్ ప్రెసిడెంట్‌గా సిద్ధార్థ గౌడ్ నియామకపత్రం అందుకోవడం జరిగింది. నూతనంగా పదవీ బాధ్యతలు తీసుకోవడం చాలా గర్వంగా ఉంది మరియు బీసీల అభ్యున్నతి కోసం పోరాటం కొనసాగిస్తాం అని వారు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కందుకూరి రాజ్ కుమార్ మాట్లాడుతూ ఆర్. కృష్ణయ్య మొదలుపెట్టిన ఈ సామాజిక ఉద్యమం ప్రతీ గడపకు చేరి బహుజన వర్గాలలో రాజ్యాధికార కాంక్షను రగిలించి రాబోయే రోజుల్లో రాజ్యాధికారాన్ని సాధిస్తుంది అని వారు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సయీద్ శుకూర్, బీసీ సంఘం బషీరాబాద్ మండల అధ్యక్షులు నరేందర్, యాలల మండల అధ్యక్షులు లక్ష్మణ్ చారి, బషీరాబాద్ మహిళా అధ్యక్షురాలు వీరమని, దేవనూర్ మాజీ సర్పంచి ఆకుల శివకుమార్, గోనూర్ రాములు, అరుణ్ రాజ్, చల్లా హరి, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

గద్వాల్ రూరల్, మార్చి 26 (జనంసాక్షి) : బుధవారం అయిజ మండల కేంద్రంలోని 10వ తరగతి కేంద్రాలను సందర్శించి పరిశీలించిన జిల్లా ఎస్పీ టీ శ్రీనివాస్ రావు.పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం అని,పరీక్షా సమయంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా విద్యా శాఖ అధికారులతో పోలీసు అధికారులు సమన్వయం చేసుకుంటు ఏలాంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు నిర్వహణ ఉండాలనీ ఆదేశించారు.అలాగే పరీక్షా కేంద్రాలలోనికి సెల్ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదని దగ్గర్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు,ఇంటర్నెట్ సెంటర్లను పరీక్ష పూర్తి అయ్యేంతవరకు మూసి ఉంచే విధంగా సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు.అనంతరం ఎస్పీ అయిజ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ స్టేషన్ పరిసరాలను,రికార్డ్ లను పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.అన్నీ రకాల విధుల పట్ల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలనీ, గ్రామాలలో ప్రజలతో లైసనింగ్ మెయింటేన్ చేస్తూ నేరాలకు సంబంధించిన ముందస్తు సమాచారం సేకరించాలని అన్నారు.ఫిర్యాదు దారులతో గౌరవంతో మెలుగుతూ బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అక్కడున్న పరిసరాలను పరిశీలించి స్టేషన్ ఆవరణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలనీ,పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పి శ్రీనివాస్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్పి వై మోగిలయ్య,శాంతి నగర్ సీఐ టాటాబాబు తదితరులు ఉన్నారు.

కోట్ల రూపాయల నిధులతో మల్కాజిగిరి అభివృద్ధి

- ఏడాదిన్నర కాలంలోనే దశ దిశను మార్చిన వ్యక్తి
- అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు
- బిఆర్ఎస్ నాయకులు

మల్కాజిగిరి, మార్చి 26 (జనంసాక్షి) : తమ పార్టీ అధికారంలో లేకున్నా మల్కాజిగిరి నియోజకవర్గాన్ని గడిచిన ఏడాదిన్నర కాలంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన వ్యక్తి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అని మల్కాజిగిరి బిఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు జేఏసీ వెంకన్న పేర్కొన్నారు. బుధవారం ఆనంద్ బాగ్ లోని బృందావన్ గార్డెన్ లో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనుల వివరాలు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని ఆర్కే పురం ఫ్లై ఓవర్ ఆర్ఓబి నిర్మాణం కొరకు 210 కోట్లు,ఆర్కే.పురం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు 35 కోట్లు, జిహెచ్ఎంసి ద్వార సాధరణ పనుల కొరకు 13 కోట్లు,ఎస్ఎన్ డిపి ద్వార నేరేడ్ మెట్ డివిజన్ యప్రాల్లో బాక్స్ డ్రైన్ నిర్మాణం కొరకు 6 కోట్లు, మౌలాలి డివిజన్ ఆర్టీసి కాలనీలో బాక్స్ డ్రైన్ నిర్మాణం కొరకు 1.7కోట్లు,రైల్ అండర్ పాస్ ఆర్యు బి ప్రాజెక్టులు వాజపేయి నగర్ ఆర్యబి నిర్మాణం కొరకు 72 కోట్లు,గౌతమ్ నగర్ ఆర్యుబి కొరకు 28 కోట్లు మంజూరు చేయించరని త్వరలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. తుర్కపల్లి ఆర్యుబి నిర్మాణం కొరకు 8 కోట్లు, అల్వాల్ జనప్రియ అపార్ట్ మెంట్ వద్ద ఆర్యుబి నిర్మాణం కొరకు 8 కోట్లు,రైల్వే ఆర్యుబి, ఆర్ఓబి ల నిర్మాణం చేసి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీర్చాలనే దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే అహర్నిశలు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు.విద్యుత్ శాఖ కు సంబంధించిన అభివృద్ధి పనులు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం తీవ్రంగా కృషి చేసి అభివృద్ధి పనుల కోసం 9.74 కోట్ల మంజూరు చేయించారని తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గ వ్యాప్తంగా సింగిల్ ఫేస్ నుండి త్రీ ఫేస్ లైన్లకు మార్పు,అవసరమైన చోట విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యం పెంపు మరియు కొత్తగా 118 ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు,ఇంటర్ లింక్ ఫెడర్ల ఏర్పాటు చేయించారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం సైనిక్ పురి లోని పోలీసే కమీషనర్ కార్యాలయం వెనకాల 500 గజాల ప్రభుత్వ భూమిని మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అని గుర్తు చేశారు. అల్వాల్ ప్రాంతంలో హెల్త్ సెంటర్ ఇదివరకే ప్రారంభం అయ్యిందని,డిగ్రీ కాలేజీ కోసం , నేరేడ్ మెట్ వాజపేయి నగర్ లోని పాత కోర్టు భవనంలో ఏర్పాటు చేయడం కోసం తగిన చర్యలు తీసుకున్నారన్నారు.జిల్లా కోర్టు భవనానికి అదనంగా నిధులు ఇదివరకే మంజూరైన కోర్టు భవన నిర్మాణంలో నిధులు సరిపోకపోవడంతో జాప్యం జరుగుతుందని అదనంగా మరో 46 కోట్ల ను మంజూరు చేయించారని పేర్కొన్నారు.అల్వాల్ ప్రాంతంలో ఫైర్ స్టేషన్ నిర్మాణం కోసం 11 గుంటల ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేయించి అల్వాల్ లోనే ఫైర్ స్టేషన్ ఏర్పడే విధంగా చర్యలు తీసుకున్న ఘనత ఎమ్మెల్యే మర్రికే దక్కుతుందన్నారు.ఇంకా ఎన్నో అభివృద్ధి పనులకు సంబంధించి త్వరలోనే అధికారికంగా నిధులు మంజూరు కావడం జరుగుతుందని, అదే విధంగా ప్రభుత్వం ప్రకటించిన వక్ఫ్ భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేత అంశంలో పేదలకు అన్యాయం జరగకుండా చూడాలనే గట్టి సంకల్పంతో ప్రభుత్వం పై ఒత్తిడి చేసి శాసనసభలో కూడా ప్రస్తావించడంతో సంబంధిత మంత్రి సానుకూల ప్రకటన చేయడం ఎమ్మెల్యే సాధించిన మరో ఘనత అన్నారు. హైద్రాబాద్ ప్రజలను అతలాకుతలం చేసిన హైడ్రా పై యుద్ధం ప్రకటించి భయభ్రాంతులకు గురవుతున్న ప్రజల పక్షాన నిలబడి, అవసరమైతే సుప్రీం కోర్టులో కూడా న్యాయ పరంగా సొంత నిధులతో ప్రజల కోసం పోరాటం చేస్తానని ప్రజలకు ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి భరోసానిచ్చారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, రావుల అంజయ్య, కార్పొరేటర్లు మేకల సునీత రాము యాదవ్, మురుగేష్, మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్, గుత్తి చందు, మండల చిన్న యాదవ్, శేఖర్ గౌడ్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
27 మార్చి 2025

మహిళలకు మరుగుదొడ్లు లేక అవస్థలు

- కాలకృత్యాలు తీర్చుకునేందుకు అగచాట్లు
- స్థలం సాకుతో పట్టించుకోని అధికారులు
- మరుగుదొడ్లు నిర్మించాలని మహిళల డిమాండ్

చిన్నంబావి, మార్చి 20 (జనం సాక్షి) : మండల కేంద్రంలోని వివిధ గ్రామాల నుండి వచ్చే ఆడపడుచులు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా పని మీద తహసీల్దార్ కార్యాలయం లేదా మీసేవ మరియు బ్యాంక్ పనుల పైన మండల కేంద్రానికి వచ్చే మగువలకు పనులు పూర్తయ్యే వరకు ఉదయం నుండి సాయంత్రం వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అలాగే ప్రతి గురువారం చిన్నంబావి చౌరస్తాలో సంత సాగుతుంది దీంతో స్థానిక బస్టాండ్ ఆవరణంలో సులబ్ కాంప్లెక్స్ లు లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి దాదాపు ఊరు చివరి దాకా నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి దాపరించింది. దీంతో మహిళలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. స్థలం లేదనే సాకుతో అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఎన్నికలవేళ ఎన్నో హామీలు ఇచ్చిన నాయకులు వీటిపై దృష్టి సారించడం లేదు. బస్ షెల్టర్ ఆవరణలో సులబ్ కాంప్లెక్స్ లు నిర్మిస్తే మహిళలకు ఇబ్బందులు తీరడంతో పాటు గ్రామపంచాయతీకి కూడా ఆదాయం సమకురుతుందని మహిళలు తెలియజేస్తున్నారు. చిన్నంబావి మండలం గా ఏర్పడి దాదాపు 9 సంవత్సరాలు పూర్తయింది కానీ ఇలాంటివి పట్టించుకున్న నాధుడే లేడు. ఇప్పటి వరకు ఒకటి, రెండుసార్లు భూమి పూజ చేశారు కానీ పనులు మాత్రం మొదలుపెట్టలేదు. అధికారులు ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి బస్సు షెల్టర్ సమీపంలో కానీ మండల కేంద్రంలో ఎక్కడైనా సులబ్ కాంప్లెక్స్ నిర్మించి మహిళల ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

ప్రభుత్వ కార్యాలయాలకు మరియు వారం నాడు జరిగే సంతకు, పనుల నిమిత్తం వచ్చిన వారు సాయంత్రం వరకు వేచి ఉండవలసి వస్తుంది. దీంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దాదాపు ఊరు చివరికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు పట్టించుకోవడం లేదు. మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలి.

బాలమ్మ చిన్నంబావి

స్థలం పరిశీలన చేస్తాం

మండల కేంద్రంలోని బస్సు షెల్టర్ ఆవరణలో కానీ చౌరస్తాకు దగ్గరలో స్థల పరిశీలన చేసి సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి త్వరలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

రమణారావు, ఎంపీడీవో

మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 26 (జనం సాక్షి) : రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసే ప్రక్రియను రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో మీసేవ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం కలెక్టర్ పరిశీలించారు. బుధవారం మీసేవ కేంద్రాల పనితీరు రాజీవ్ యువ వికాస పథకానికి సంబంధించి అర్హులైన యువత తెలంగాణ ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసే ప్రక్రియ కలెక్టర్ స్వయంగా మీసేవ నిర్వాహకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక "రాజీవ్ యువ వికాసం పథకం" ప్రకటించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రజని, మీసేవ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు పరుస్తాం

- మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజుద్దీన్

మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 26 (జనం సాక్షి) : బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో 11వేల కోట్లు రుణ మాఫీ చేస్తే,మా ప్రభుత్వం ఒక్క ప్రకటనలో తెలిపారు సంవత్సరల కాలంలోనే 20వేల కోట్ల రుణ మాఫీ చేసిందని మెదక్ జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హఫీజ్ఉద్దీన్ ఒక్క ప్రకటనలో తెలిపారు మా ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసంగా వుందనిన్నారు. బీఆర్ ఎస్ రైతులకు రుణ మాఫీ ఎగ్గొడితే, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని వివరించారు , ఈ నేల 30లోపు రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జామ అవుతాయనిన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండగ చేసింది రైతులను దగా చేసిన వారు, రైతులను మోసం చేసిన వారు రైతుల గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వాళ్ళించి నట్లు ఉందని విరుచుకుపడ్డారు.తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం నికి 5సం లు సమయం ఇస్తే మా ప్రభుత్వం 15నెలలే అయ్యదని ప్రజలకు ఇచ్చినఆరు గ్యారంటీ లను తప్పకుండ త్వరలోనేఅమలు చేస్తా మని చెప్పారు. మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వంపై బురద జల్లే పనులు మానుకోవాలని విమర్శించారు. గత ప్రభుత్వం అప్పులు చేస్తే అప్పులకు వడ్డీలు కట్టుకుంటూ ఒకొక్క హామీని అమలు చేస్తుందనిన్నారు.

కాంగ్రెస్ రాజ్యంలో రైతులకు ఆత్మహత్యలే శరణ్యం

- ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

గద్వాల్ రూరల్, మార్చి 26 (జనంసాక్షి) : కాంగ్రెస్ రాజ్యంలో రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అంటూ రైతులు మాజీ మంత్రి,సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తో మొరపెట్టుకున్నారు బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండలంలోని వెంకటాపురం,కొండాపురం, ఉమ్మిత్యాల,గువ్వలదిన్నె గ్రామాలలోని పంట పొలాలను పరిశీలించి జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్,ఎస్ ఈ రహిముద్దీన్ తో చారవాణి ద్వారా మాట్లాడారు.రైతులతో మాజీ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన హామీల్లో ఏ పథకం కూడా సవ్యంగా సాగడం లేదనన్నారు.రైతు భరోసా,రైతు రుణమాఫీ పథకాలు ప్రభుత్వం చెబుతున్న ప్రకారమే అట్టర్ ప్లాఫ్ అయ్యాన్నారు.ఏ గ్రామంలో చూసినా రైతు భరోసా,రుణమాఫీ అందని రైతులు కొల్లలుగా ఉన్నారన్నారు.వీటికి తోడు మళ్లీ వేసిన పంటలు సహితం ఇలా నీళ్లు కరెంటు సమస్యలతో ఎండిపోతుంటే రైతుల బాధలు చెప్పుకోలేకపోతున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 448 మంది అన్నదాతలు ప్రభుత్వ నిర్వాకం వల్ల బలవన్మరణాలకు పాల్పడ్డారన్నారు.ఇంత జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ప్రభుత్వంలో ముగ్గురు మంత్రులు ఆర్థిక, వ్యవసాయ, విద్యుత్శాఖలు సమన్వయంతో పని చేస్తే గ్రామాల్లో ఒక్క పంట కూడా ఎండిపోయేది కాదని, రైతు రుణమాఫీ,రైతు భరోసా పథకాలు సక్రమంగా అమలు జరిగినా రైతుల మరణాలు ఉండేవి కాదన్నారు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు సీఎంకు మాజీ సీఎంపై దుమ్మెత్తి పోయడం తప్పా మరొకటి లేదన్నారు.ఎండిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు కురువ పల్లయ్య,నాగర్ దొడ్డి వెంకట్రాములు,బాసు హనుమంతు నాయుడు, విష్ణువర్ధన్ రెడ్డి,మోనేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ శిక్త పట్నాయక్

నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 26 (జనం సాక్షి) : జిల్లా కేంద్రంలో ఏప్రిల్ లో 20 నుంచి 26 వరకు జరగబోయే సార్వత్రిక పరీక్షలను పకడ్బందీగా నిర్వ హించేందుకు బుధవారం కలె క్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి తగు సూచన లు ఇచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నారా యణపేట జిల్లా కేంద్రంలో ఎనిమిది సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ ఎస్ సి కి సంబంధించి మూడు సెంటర్లలో 600 మంది విద్యా ర్థులు, అలాగే ఇంటర్మీడి యట్ ఐదు సెంటర్లలో 990 విద్యార్థులు పరీక్షలు రాయ బోతున్నారని తెలిపారు.ఆయా పరీక్షల పూర్తి ఏర్పా టును జిల్లా విద్యాశాఖ అధి కారి పర్యవేక్షించాలని ఆదే శించారు.అధికారులు అంద రూ పరీక్షలను సమర్థవం తంగా నిర్వహించాలని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ పరీక్షలలో సెంటర్ల దగ్గర పూర్తి స్థాయి బందోబస్తు నిర్వహిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమ ములో లైన్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారులు,డి ఎస్ పి నల్లపు లింగయ్య ,జిల్లా విద్యాశాఖ టాస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ,డి ఏం హెచ్ ఓ సౌభాగ్య లక్ష్మి, డిఐఒ సుదర్శన్ రావు, పోస్ట్ ఆఫీస్ సూపర్ఇండెంట్ ,డి పి ఓ అధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.

బొమ్మకూరు నుండి తపస్‌పల్లి డ్యాంకు నీరు విడుదల

- వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్లనాగుల శ్వేతా వెంకన్న

చేర్యాల, మార్చి 26 (జనంసాక్షి) : చేర్యాల, కొమురవెల్లి,మండలంలో పలు గ్రామాల చెరువులలో నీళ్లు లేక పంట పొలాలు ఎండుతున్నాయని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్ల నాగుల శ్వేతా వెంకన్న వెంటనే జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డితో మాట్లాడి దేవాదుల ప్రాజెక్టు ద్వారా జనగామ నియోజకవర్గం ప్రాంతానికి నీళ్లు అందించడానికి బొమ్మకూరు డ్యామ్ కు నీటిని విడుదల చేయాలని గత కొన్ని రోజులుగా నీటిపారుదల శాఖ ఈఈ, ఏఈలకు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గారికి తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్ల నాగుల శ్వేతా వెంకన్న మాట్లాడుతూ.. జనగామ అభివృద్ధి ప్రదాత డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి మంత్రులతో మాట్లాడి నీటిని తపస్పల్లి డ్యామ్ కు బుధవారం పంపింగ్ మొదలైందని తెలియజేశారు.

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియ పర్యవేక్షణ

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 26 (జనం సాక్షి) : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల ప్లాట్ ల క్రమబద్ధీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారు పూర్తిస్థాయి రుసుమును చెల్లించి ప్లాట్ ల క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ఈ నెల 31లోపు ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించిన వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీని వర్తింపజేస్తోందని, ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు వినియోగించుకొని లబ్ధి పొందాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కింద ప్లాట్ రుసుము చెల్లించిన దరఖాస్తుదారుడి ప్లాట్ ను పర్యవేక్షించి, అతనికి ఈ రాయితీని మినహాయిస్తూ, భూమి క్రమబద్ధీకరణకు సంబంధించిన ప్రొసీడింగ్స్ జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నగేష్, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, ఎస్సీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రభాకర్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్పదంగా మహిళ మృతి..?

పెబ్బేరు, మార్చి 26 (జనం సాక్షి) : 44వ జాతీయ రహదారి పై గల రంగాపురం గ్రామం ఎబిడి లిక్కర్ కంపెనీ సమీపంలో ఒక మహిళ అనుమానాస్పదంగా మృతి చెందన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఇటిక్యాల మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గొల్ల మద్దిలేటి (హమాలి) మంగళవారం రాత్రి పెబ్బేరు పోలీస్ స్టేషన్ ఎస్సై హరిప్రసాద్ రెడ్డి ఎదుట లొంగి పోయారు. నిందితుడు తెలిపిన వివరాల మేరకు ఎస్సై క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. పూర్తి వివరాల ప్రకారం వనపర్తి మండలం పెద్ద గూడెం గ్రామానికి చెందిన అంగన్వాడి ఆయా గొల్ల మణెమ్మ (35)తో నిందితుడు మద్దిలేటి తో గత పది సంవత్సరాలుగా అక్రమ సంబంధం కొనసాగుతుంది. నిందితుడు మద్దిలేటి గతంలో ఏ బీడీ కంపెనీలో హమాలీగా పని చేశాడని సమాచారం. అదే క్రమంలో మంగళవారం రాత్రి ఇద్దరూ కలుసుకున్నారు. సదరు మహిళ మద్యం మత్తులో ఉన్నప్పుడు ఇద్దరు శారీరకంగా కలుసుకున్నట్లు నిందితుడు తెలిపారు. ఒకసారిగా ఆమెకు వెక్కిళ్లు వచ్చి స్పృహ కోల్పోయిందని, తేరుకునే లోపు నోట్లో నుండి నురగలు వచ్చి అచేతనంగా పడి ఉందని నిందితుడు పోలీసులకు తెలిపారు. ఆ పరిస్థితిలో తనకేమీ తోచలేదని వెంటనే పెబ్బేర్ పోలీస్ స్టేషన్కు వచ్చి లొంగిపోయినట్లు పేర్కొన్నారు. ఆమె మృతికి కారణాలను అన్వేషిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. సీఐ రాంబాబు సమక్షంలో విచారించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెరగాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు

పెబ్బేరు, మార్చి 26 (జనం సాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎ. శ్రీనివాసులు సూచించారు. బుధవారం పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న సాధారణ ఓపి రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, ఇన్‌పేషెంట్ రిజిస్టర్, హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు, ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు, ప్రసవాల గదిలో ఫ్యాన్లు, బల్బులు, ప్లంబర్ వర్క్ వెంటనే రిపేర్ చేయించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ చంద్రశేఖర్, హెల్త్ సూపర్ వైజరులు లీలమ్మా, పార్వతి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ , ఫార్మా సిస్ట్ కుమారి, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్,స్టాఫ్ నర్సింగ్ విజయ లక్ష్మి, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాకే డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలి

- బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ యాదవ్

జడ్చర్ల, మార్చి 26 (జనం సాక్షి) : చట్ట సభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాకే డెలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ అన్నారు. బుధవారం మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో బీసీ జాగృతి సేన ముఖ్య నాయకుల సమావేశంలో కృష్ణ యాదవ్ మాట్లాడుతూ చట్ట సభలలో రిజర్వేషన్ ల సాధనకై ఉద్యమ కారులు, మేధావులు, విద్యావంతులు శాబ్దాలుగా పోరాడుతున్నా కేంద్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్న పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో మెజార్టీ ప్రజలకు, చట్ట సభలతో పాటు, విద్యా ఉద్యోగాలలో, రిజర్వేషన్లు లేకపోవడం సామాజిక న్యాయ స్ఫూర్తికి గొడ్డలి పెట్టని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మెజార్టీ ప్రజలైన బీసీల జనాభా లెక్కలను చేపట్టక పోగా, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ నేటికీ ఏర్పాటు చేయలేదని, బడ్జెట్ కేటాయింపులో కూడా తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల నాటికి పార్లమెంట్ స్థానాలను పెంచడానికి సిద్ధమవుతున్న మోడీ ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే దేశ జనాభా గణనలో బీసీ కులాల గణన చేపట్టి చట్టసభలలో బిసి రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి బిల్లు ఆమోదించి జనాభా దామాషా నిష్పతిన, చట్ట సభలతోపాటు, విద్యా, ఉద్యోగ ఆర్థిక, పారిశ్రామిక, సాంస్కృతిక, ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే దేశంలో పార్లమెంటు స్థానాలతో పాటు, వివిధ రాష్ట్రాలలో అసెంబ్లీ స్థానాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిరంజన్, నర్సిములు, శేఖర్, విజయ్ కుమార్, గోపాల్, శివరాములు, మురళి, రంగయ్య, వెంకటేష్, రఘు, శివశంకర్, శ్రీనివాసులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్యాధికారి తొలగింపు

- జహీరాబాద్ ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్
- డాక్టర్ అజ్మనాజ్ సస్పెండ్
- ఇద్దరు వైద్యులకు షోకాజు నోటీసులు
- వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష

సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 26 (జనం సాక్షి) : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నందుకు ఒకరిని విధుల నుండి తొలగిస్తూ, మరో ఇద్దరు వైద్యాధికారులకు షోకాస్ నోటీసులుఅందించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి జిల్లా వైద్యధికారిణి నికి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లాలో మాతా శిశు మరణాలు, మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ క్రాంతి వల్లూరు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అజ్మనాజ్ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులను ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు విచారణలో తేలడంతో డాక్టర్ అజ్మనాజ్ ను విధులనుంచి తొలగించాలని డిఎం అండ్ హెచ్ఓ గాయత్రి దేవికి ఆదేశించారు. దౌల్తాబాద్ ,మల్చల్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇద్దరు డాక్టర్లకు షోకాజు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2023-24 సంవత్సరం పోల్చితే 2024-25 సంవత్సరంలో మాతా శిశు మరణాలు 50 శాంతం తగ్గినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే లో రిస్కు కేసులు ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందించేలా చూడాలన్నారు. హై రిస్కు కేసులో రెఫర్ చేస్తున్నప్పుడు డాక్టర్లు సమన్వయంతో కోఆర్డినేషన్ చేసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు క్రమం తప్పకుండా గర్భిణులను పరిశీలించి వారికి సూచనలు సలహాలు, పౌష్టికాహారం, మందులు వాడేలా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకునేలా చూడడంతో పాటు మందులు వాడేలా పౌష్టికాహారం తీసుకునేలా చూస్తే చాలా వరకు సమస్యలు తగ్గుతాయి అన్నారు. వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, సెంటర్లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి గాయత్రి దేవి, జిజిహెచ్ సూపర్డెంట్ అనిల్ కుమార్, జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు ఏఎన్ఎంలు ,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బీసీ కులాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- అభ్యంతరాలపై పరిశీలన చేస్తున్నాం
- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్.

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 26 (జనంసాక్షి)

బిసి కులాల్లోని నుంచి వస్తున్న అభ్యంతరాలను స్వీకరించడంతో పాటు వాటిని పరిశీలన చేయడం జీవనస్థితి గతులలో తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. బుధవారం ఆయన వేములవాడలోని బీసీ కులాలలోని పిచ్చకుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మల కులాల స్థితిగతులను తెలుసుకునేందుకు కమిషన్ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్,రంగు బాల లక్ష్మిలతో కలిసి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో స్వామివారి శేష వస్త్రాలు ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ చైర్మెన్ గెస్ట్ హౌస్ లో కమిషన్ చైర్మన్ సభ్యులతో కలిసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సోషలు ,ఎకనామిక్ కుల గణన సర్వే నిర్వహించి, అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు ఆమోదించిందన్నారు. చట్టా రూపం దాల్చాలని శ్రీ రాజరాజేశ్వర స్వామిని,అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. తమ కులం పేరుతో విద్యాలయాలు, ఉద్యోగ స్థలాల్లో పిలుచు కునేందుకు ఇబ్బంది పడుతున్నామని, ప్రత్యామ్నాయ పేరు ఇవ్వాలని పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి వారు విజ్ఞప్తులు అందజేశారని వివరించారు. వారి కులాల పేరు మార్పు కోసం ఇప్పటికే ఆయా కులాల ప్రతినిధులతో చర్చించామని తెలిపారు. విజ్ఞప్తులు అందజేసిన వారి స్థితిగతులు నేరుగా తెలుసుకు నేందుకు జిల్లా పర్యటనకు తాము వచ్చామని చైర్మెన్ తెలిపారు. పరిశీలన అనంతరం ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల, జగిత్యాల ధర్మపురిలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తామని వివరించారు. ఏప్రిల్ మొదటి వారంలోగా తుది నివేదిక ఇస్తామన్నారు .ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్ రావు, అధికారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి పాత మున్సిపల్ ఆఫీసు వద్ద డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలి

సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్

బెల్లంపల్లి, మార్చి 26 (జనంసాక్షి) :

బెల్లంపల్లి పట్టణంలోని పాత మున్సిపల్ ఆఫీస్ వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపాలిటీ చెత్త తరలింపు, డంపింగ్ యార్డ్ సంబంధించిన సమస్య ఎప్పుడు వివాదంగానే మారుతుం దన్నారు. డంపింగ్ యార్డ్ నిర్వహణ విషయంలో చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం విఫలమైందని ఆరోపించారు. డంపింగ్ యార్డు రెండో వార్డు కన్నాలబస్తి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వద్ద ఉన్నప్పుడు వ్యర్థాలు తగలబెట్టడంతో పరిసర ప్రాంతాల బస్తీలకు పోగ దట్టంగా వ్యాపించి ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేసిందని అన్నారు. అప్పుడు ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వస్తే డంపింగ్ యార్డును అక్కడినుంచి ఎత్తేశారని అన్నారు. 65 డీప్ బస్తీ వద్ద డంపింగ్ యార్డ్ విషయంలో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిం చారని, ఇప్పుడు ఏకంగా బెల్లంపల్లి పట్టణం నడిబొడ్డున పాత మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో 34 వార్డులకు సంబంధించిన వ్యర్థాలను తీసుకొచ్చి డంప్ చేస్తున్నారన్నారు. ఇక్కడ తీవ్రమైన దుర్గంధం వ్యాపించడమే కాకుండా ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి బూడిదిగడ్డ బస్తీ ప్రజలకు మురుగు వాసనతో పాటు విపరీతమైన దోమలు, ఈగలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా యన్నారు. పోచమ్మ గడ్డ ఐటీడీఏ ఉద్యానవనం, హిందూ, క్రిస్టియన్, స్మశాన వాటికల పక్కన గ్రామీణ ప్రధాన రహదారి పక్కన పక్కన వేస్తుండడంతో తీవ్రమైన దుర్గంధ పూరితమైన వాసనతో ముక్కు పుటాలు అధిరి పోయే వాసనతో వేలాదిమంది బెల్లంపల్లికి వచ్చి పోయే ప్రజలు తీవ్రమైన అసౌకర్యానికి గురవు తున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే పాత మున్సిపల్ కార్యాలయంలోని డంపియాడ్ ఎత్తివేయాలని, పోచమ్మ గడ్డ రూరల్ మెయిన్ రోడ్డు పక్కన చెత్త డంప్ చేయడాన్ని వెంటనే మానుకోవాలని అన్నారు. 34 వార్డుల్లో చెత్త నిర్వహణ, మురుగు కాలువల నిర్వహణ, దోమల నివారణకు వెంటనే పాగింగ్ యంత్రాల ద్వారా చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో 34 వార్డుల ప్రజలతో చేపట్టే ఆందోళనకు జిల్లా కలెక్టర్,
మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, తాసిల్దార్లే బాధ్యత వహించాలని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఠాకూర్ మణి రామ్ సింగ్, ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకుడు ఎండి చాంద్ పాషా, ఏఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకుడు ఎం పోషమల్లు, టీఎస్యూఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాజన్న, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబాలా మహేందర్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం అందించాలి

విజిలెన్స్ , మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ బ్యూరో, మార్చి 26 (జనంసాక్షి)

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసుల నమోదు, పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలపై జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగింది. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నమోదైన అట్రాసిటీ కేసులు, పరిష్కరించిన కేసులు, బాధితులకు అందిన పరిహారం గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో కేసు పూర్వాపరాలను పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగే విధంగా అధికారులు చర్య తీసుకోవాలని అన్నారు. కేసుల్లో భాగంగా అవసరమైన కుల ధ్రువీకరణ పత్రం వీలైనంత త్వరగా జారీ చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చింతకుంట లోని అంబేద్కర్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, భగత్ నగర్లో కేటాయించిన స్థలానికి ప్రహరీ గోడ నిర్మించాలని సభ్యులు కోరారు. కోర్టు చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం కూడలి శుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ అంశాలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో ఎస్సీ , ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీ సభ్యులకు
కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ... అట్రాసిటీ కేసుల విషయంలో త్వరిత గతిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎఫ్ఐఆర్, చార్జిషీట్, పరిష్కారం అయిన కేసులు, విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను సంవత్సరం వారీగా వెల్లడించారు.
ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేష్ , డిటిడిఓ జనార్ధన్, బీఎండబ్ల్యూ పవన్ కుమార్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్ , ఏసిపి వెంకటస్వామి పాల్గొన్నారు.

చరిత్ర గురించి చెబితే ఉలికి పడుతున్నారు?

కరీంనగర్ బ్యూరో, మార్చి 26 (జనంసాక్షి)

చరిత్ర తెలిసిన వాళ్లకు కేసీఆర్ అసలు బాగోతం ఏంటో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదని, కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు చరిత్రలో ఉన్నవే, మాట్లాడు కున్నవే నని, బిఆర్ఎస్ నేతలు వాళ్ల జాతిపిత, ఉద్యమ నేత కెసిఆర్ గురించి వాస్తవాలు తెలియకపోతే తెలుసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్ అన్నారు. బుధవారం రోజున కరీంనగర్ బిజెపి జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఇటీవల కెసిఆర్ గురించి చేసిన వ్యాఖ్యల్లో తప్పేముంది ? కెసిఆర్ చరిత్ర గురించి చెబితే బిఆర్ఎస్ నేతలు ఉలికి పడుతున్నారని, వాస్తవాలను జీర్ణించుకోలేక అవాకులు చేవాకులు పేలుతున్నారని ఘాటుగా విమర్శించారు. కేసీఆర్ అసలు చరిత్ర లో దొంగ నోట్ల అంశంలో, కేంద్రమంత్రిగా పని చేసినప్పుడు సహారా స్కాం ఈఎస్ఐ స్కాం లలో ఆయన పేరు ప్రధానంగా వినిపించిందని, పత్రికల్లో కథనాలు వచ్చాయని, ఈచరిత్ర గురించి కరీంనగర్ బిఆర్ఎస్ నేతలకు తెలియకపోతే తెలుసుకుంటే మంచిదన్నారు. అసలు కరీంనగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కి కనీస రాజకీయ పరిజ్ఞానం లేదని ఆయన ఈ సందర్భంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. చల్ల హరి శంకర్ ప్రజా క్షేత్రంలో నుంచి వచ్చిన నాయకుడు కాదని, ఆయన ఏ ఎన్నికల్లో కూడా పోటీ చేసిన చరిత్ర లేదని, ఆయన ఓ నామినేటెడ్ పొలిటిషన్ అన్నారు. అలాంటి వ్యక్తి ప్రజల మన్ననలతో, ఆశీస్సులతో కరీంనగర్ పార్లమెంటు నుండి రెండు సార్లు గెలుపొంది కేంద్ర మంత్రి అయిన బండి సంజయ్ కుమార్ గురించి మాట్లాడే అర్హత స్థాయి ఉందా అని
ఆయన ఈ సందర్భంగా ప్రశ్నిం చారు. బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరి శంకర్ పరిధికి మించిమాట్లాడుతున్నారని, ఆయన నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్ , తాజా మాజీ కార్పొరేటర్ కాసర్ల ఆనంద్, వంగల పవన్, బండ రమణారెడ్డి , నరహరి లక్ష్మారెడ్డి, కరీంన గర్ జోన్ అధ్యక్షులు బండారి గాయత్రీ దేవి, శ్రీనివాస్, తణుకు సాయి, ప్రసన్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు మార్కవుట్ ఇవ్వాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 26 (జనం సాక్షి) :

అర్హులైన నిరుపేద లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు మార్కవుట్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, విద్యుత్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అర్హులైన నిరుపేద లబ్ధిదారుల జాబితాల ప్రతిపాదనల మేరకు మంజూరు ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని, అట్టి నిర్మాణాలకు సిద్ధంగా ఉన్న లబ్ధిదారులకు మార్క్ అవుట్ ఇవ్వాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. ఇండ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలని, బేస్ మెట్ వరకు ఇంటి నిర్మాణాలు జరిగిన వాటి వివరాలు యాప్ లో అప్ లోడ్ చేయాలని, అట్టి వాటికి ప్రభుత్వం నుండి లక్ష రూపాయలు మొదటి విడతలో ప్రభుత్వం నుండి నిధులు లబ్ధిదారునికి విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంకనూ ప్రారంభించని ఇండ్లను త్వరగా నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. లబ్ధిదారులను నిర్మాణాలకు ప్రోత్సహించాలని సూచించారు. ఇందిరమ్మ డేమో ఇళ్లను త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని తెలిపారు. మండలాల వారీగా ఇంటి నిర్మాణాలపై పంచయతీకార్యదర్శులు, ఎంపీడీఓ లతో సమీక్షించారు. రెండు పడక గదుల నిర్మాణాల కాలనీల్లో నీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆయా పనులు త్వరగా పూర్తిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో చందర్, హౌసింగ్ పి.డి. విజయపాల్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీ రాజ్ ఈఈ దుర్గా ప్రసాద్, ఆంజనేయులు, మిషన్ భగీరథ ఇంజనీర్లు, డిప్యూటీ ఈ ఈ లు, ఎంపీడీఓ లు, తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని కోల్పోయిన దుఃఖాన్ని దిగమింగుతూ..

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 26 (జనంసాక్షి)

: తండ్రి మరణ వార్తని గుండెల్లో ఒడిసి పట్టి లక్ష్యం కోసం ముందుకు సాగింది ఆ విద్యార్థిని. కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణ ఒక దిన పత్రికలో విలేకరిగా పనిచేస్తున్నారు. మంగళ వారం రాత్రి అతనికి గుండెపోటు రావడంతో మృతి చెందడం జరిగింది మృతుడికి భార్య ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఆయన కుమార్తె కావ్య శ్రీ తండ్రి లక్ష్యం సాధన కోసం అహర్నిశలు చదువుతూ పరీక్షలకి సిద్ధం అయ్యింది. తండ్రి లేడనే వార్త గుండెల్లో దాచుకొని తన తండ్రి లక్ష్యం కోసం పరీక్ష హాల్ కెళ్ళి పరీక్ష రాసింది. అంత దుఃఖంలో కూడా తండ్రి ఆశయ సాధన కోసం ముందుకెళ్లిన ఆ చిట్టి తల్లిని చూసి అందరూ ధైర్యం చెప్పారు. ఒక వైపు గుండెల నిండా భాద ఉన్న తన కోసం తన తండ్రి కలలు కన్నా జీవితం కోసం ముందుకెళ్లిన అమ్మాయిని చూసి తనకు అభినందనలు చెప్తూ ఓదార్చారు.

మంచినీటి కోసం రోడ్డెక్కిన దళిత మహిళలు

ముస్తాబాద్ మార్చి 26 (జనం సాక్షి)

ముస్తాబాద్ మండల కేంద్రంలోని దళితవాడలో గత వారం పది రోజుల నుండి మంచినీరు లేక మంచినీటి సౌకర్యం కల్పించాలని మహిళలు ఖాళీ బిందెలతో రహదారిపై నిరసన తెలిపారు .మండల కేంద్రంలోని మహారాజుల కాలనీలో గత వారం రోజుల నుండి నల్ల నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని. ఆవేదన వ్యక్తం చేశారు నీటి కోసం నిత్యము ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించలేదు . ఇప్పటికైనా మంచినీళ్లు నల్లల ద్వారా నీళ్లు అందించాలని అధికారులను కోరిన దళిత మహిళలు వెంటనే ప్రత్యేక అధికారి ఆర్ సురేష్ స్పందించి ట్యాంకర్ ద్వరా మంచినీళ్లు అందించడంతో నిరసన బంద్ చేయడం జరిగింది. ఎల్లవ్వ .బాబాయ్. పోచవ్వ. రాజవ్వ దేవలక్ష్మి .దేవవ్వ. శంకరయ్య .గుణశేఖర్. దేవరాజు. సుంచు సాదిక్ రాజవ్వ. లక్ష్మి .బాబు .పాల్గొన్నారు

జనపనార బ్యాగుల తయారీపై శిక్షణ

వరంగల్ ఎంజీఎం, మార్చి 26(జనంసాక్షి):

పీవీ నరసింహా రావు పశు వైద్య విశ్వ విద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరులో డా. రాజన్న, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో షెడ్యూల్డు కులాల మహిళలకు పర్యావరణ సహితమైన జనప నారా బ్యాగ్ ల తయారీ పైన నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యం లోని జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వ హణ సంస్థ ఆర్థిక సౌజన్యంతో ప్రారం భించారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ముఖ్య అతిథిగా భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి జాతీయ వ్యవసాయ పరిశోధనా యాజమాన్య అకాడమీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ గారు ముఖ్య అదితి గా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, డాక్టర్ గోపాల్ లాల్ గారు పర్యవరణ సహిత జనప నార బ్యాగ్ ల తయారీ పై ప్రసంగిస్తూ, ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా స్థానిక మహిళలకు మరియు యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే స్వయం సహాయ గ్రూపులకు ఆర్థిక బలం ఇవ్వడం, సమాజంలో సుస్థిరమైన మార్పులు తీసుకువస్తుందని అన్నారు. మార్కెట్ కూడా స్థానికంగా ఏర్పాటు చేసుకోవాలి అని తెలిపినారు. మమునూరు కృషి విజ్ఞాన కేంద్రం వరంగల్ జిల్లాలో వ్యవసాయ మరియు అనుబంధ రంగాలలో ప్రశంనీయ సేవలు అందిస్తున్నారు. డా. రాజన్న ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రజలకు జూట్ బ్యాగ్ తయారీ శిక్షణ ఇచ్చి, పర్యావరణ అవగాహన పెంచడం, అలాగే స్థిరమైన ఉపాధి అవకాశాలు అందించడం అనే లక్ష్యంగా కృషి విజ్ఞాన కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్
టెక్నికల్ ఆఫీసర్ డా. విజయేంద్ర రెడ్డి, డా. అరుణ్ జ్యోతి, డా. సౌమ్య, డా. రాజు ఇతర మహిళా ట్రైనీస్ పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు అందుకున్న డిఆర్డిఓ పిడి కౌసల్యదేవి

చెన్నారావుపేట, మార్చి 26 (జనం సాక్షి)

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా వరంగల్ డిఆర్డిఓ పిడి కౌసల్యదేవి ఉత్తమ అవార్డును అందుకున్నారు. బుధవారం హైదరాబాద్ లో ఏర్పాటుచేసిన 12వ స్త్రీ నిధి సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో స్త్రీ నిధి లక్ష్యాలను సాధించడంలో వరంగల్ జిల్లాలో అత్యుత్తమ పనితీరు కనపరిచినందుకు డిఆర్డిఓ పిడి కౌసల్య దేవికి ఉత్తమ ఉద్యోగ ప్రశంసా పత్రాన్ని అందించి షీల్డ్ ను బహుకరించి అభినందిం చారు. అలాగే శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా
డిఆర్డిఓ పిడి కౌసల్యదేవికి ఉత్తమ అవార్డు అందుకున్న ందుకు తోటి అధికారులు
డి ఆర్ డి ఓ సిబ్బంది పలువురు ఆమెకు శు భాకాంక్షలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
27 మార్చి 2025

నిబంధనలకు విరుద్ధంగా ప్రెస్‌క్లబ్ నిర్వహణ

- జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి
- చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన కలెక్టర్

ఖమ్మం, మార్చి 26 (జనం సాక్షి) : నిబంధనలకు విరుద్ధంగా ఖమ్మం జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ నిర్వహణ కొనసాగుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ కు వినతిపత్రం సమర్పించింది. ఐడీవోసీలో కలెక్టర్ ను బుధవారం కలిసి టీడబ్ల్యూజేఎఫ్ నేతలు వినతిపత్రం సమర్పించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ప్రెస్‌క్లబ్ నిర్వహణలో చోటు చేసుకుంటున్న లోపాలను సరి చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని వినతిపత్రంలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రెస్ క్లబ్ ను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి లెక్కాపత్రం లేకుండా... ఆడిటింగ్ లు జరపకుండా దీనిని అడ్డగోలు వేదికగా మార్చారని ఫిర్యాదు చేశారు. ప్రెస్ క్లబ్ లో జవాబుదారీతనం లోపించిందన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్ మీట్ రుసుం వసూళ్లలో అనేక లోటుపాట్లు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి ఆడిటింగ్ చేయించి...ప్రభుత్వ అధికారి ద్వారా పర్యవేక్షణ చేయించాలని కోరారు. ప్రెస్ క్లబ్ సభ్యత్వాలు ఇచ్చి ప్రభుత్వ అధికారి ద్వారా ఎన్నిక నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అప్పటి వరకూ అడ్ హక్ కమిటీని ఏర్పాటు చేసి ఇకనైనా ప్రెస్ క్లబ్ నిర్వహణ సవ్యంగా సాగేలా చూడాలని కోరారు. ప్రెస్ క్లబ్ ఆడిటింగ్ లోపాల పైనా ప్రభుత్వ అధికారి ద్వారా విచారణ చేయించాలని విన్నవించడంతో ఈ మేరకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, వేగినాటి మాధవరావు, మానుకొండ రవికిరణ్, షేక్ జానీపాష, సుభాన్, మేగా దేవేందర్, అర్షద్, యాకుబ్ పాష తదితరులు పాల్గొన్నారు.

లైట్ మోటర్ వెహికిల్ డ్రైవర్లు క్రమశిక్షణతో వాహనాలు నడపాలి

సూర్యాపేట ప్రతినిధి, మార్చి 26 (జనంసాక్షి) : లైట్ మోటర్ వెహికిల్ డ్రైవర్లు క్రమశిక్షణతో వాహనాలు నడిపి ప్రయాణీకులను క్షేమంగా గమ్య స్థానానికి చేర్చాలని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.నలభై సంవత్సరాల నుండి లైట్ మోటర్ వెహికిల్ డ్రైవర్లకు మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అండగా నిలిచారని, డ్రైవర్లంటే ఆయనకు ఎనలేని ప్రేమ అని అన్నారు.బస్టాండ్ దగ్గర డ్రైవర్లకు అడ్డా ఏర్పాటు చేయడానికి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి సహకారం అందించారని, కాబట్టి ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా డ్రైవర్లు క్రమశిక్షణ పాటించాలని అన్నారు.మోటార్ వెహికిల్ ఓనర్లు ఎన్నో కష్టాలు పడి వాహనాలు కొనుగోలు చేసి నడిపిస్తున్నారని, వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి ఎటువంటి సమస్యలు వచ్చినా తమ సహకారం ఉంటుందన్నారు. పోలీస్ శాఖ వారి నియమనిబంధనలు పాటించాలని అన్నారు. క్యాబ్ డ్రైవర్లు అందరూ ఐఎన్ టియుసి సభ్యత్వం తీసుకోవాలని, ఆటో డ్రైవర్లు కూడ ఐఎన్ టియుసి సభ్యత్వం తీసుకునే విధంగా పనిచేయాలని అన్నారు.కొత్త బస్టాండ్ వద్ద ఆటో స్టాండ్ ను ఏర్పాటు చేయడానికి డిపో మేనేజర్ తో మాట్లాడినట్లు చెప్పారు.అంతకుముందు లైట్ మోటర్ వెహికిల్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డిని ఘనంగా సన్మానించారు.సూర్యాపేట పట్టణంలోని వైట్ హౌస్ నుండి కొత్త బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలి,జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు జావేద్ బేగ్, మాజీ కౌన్సిలర్లు వేములకొండ పద్మ, గుణగంటి వంశి, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల రాంబాబు, మార్కెట్ డైరెక్టర్ పచ్చిపాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభకు ముమ్మర ఏర్పాట్లు

హుజూర్ నగర్, మార్చి 26 (జనం సాక్షి): హుజూర్ నగర్ పట్టణంలో ఉగాది పర్వదినాన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సన్న బియ్యం పంపిణి కార్యక్రమానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం హుజర్ నగర్ పట్టణంలో ముఖ్యమంత్రి సభా ఏర్పాట్లను జిల్లా ఎస్పి నరసింహతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ లు శ్రీనివాసులు, సూర్యనారాయణ, తహసీల్దార్లు నాగార్జున రెడ్డి, కమలాకర్, మంగా, జ్యోతి, కవిత, సైదులు, సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధించాలి..ఆరోగ్యాన్ని రక్షించాలి..

మణుగూరు, మార్చి 26 (జనంసాక్షి) : ప్లాస్టిక్ వాడకం రోజురోజుకు పెరుగుతున్నందున పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని మణుగూరు మున్సిపల్ కమిషనర్ అన్నారు. బుధవారం డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో పూల సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం పర్యావరణ పరిరక్షణకు చాలా ముఖ్యం అన్నారు. ఇవి సరిగ్గా వేరు చేయడం వల్ల పునర్వినియోగం (రీసైక్లింగ్) సులభంగా జరుగుతుంది. వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, డ్వాక్రా మహిళలు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీకి సర్వం సిద్ధం

- ఏప్రిల్ 1 నుండి రేషన్ షాపులకు సన్న బియ్యం

తుంగతుర్తి, మార్చి 26 (జనం సాక్షి) : రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఏప్రిల్ నెలలో ఒకటో తేదీ నుండి నియోజకవర్గంలో ఉన్న స్టాక్ పాయింట్ల నుండి సన్న బియ్యం సరఫరా చేసేందుకు పౌరసరఫరా శాఖ అధికారులు కసరతులు ముమ్మరం చేశారు. ఈ మేరకు వివిధ మిల్లులనుండి సన్నబియాని సేకరించి స్టాక్ పాయింట్లకు పంపుతూ అక్కడ నుండి ఎంపిక చేసిన రేషన్ దుకాణాలకు సన్న బియ్యం లారీల ద్వారా సరఫరా చేసేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేపట్టారు అయితే ఈ నెల 30న పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సొంత నియోజకవర్గం అయినా హుజూర్నగర్ నుండి ముఖ్యపత్రి రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించనున్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన అల్ఫోర్స్ దావత్-ఏ-ఇఫ్తార్ వేడుకలు

కరీంనగర్ బ్యూరో, మార్చి 26 (జనంసాక్షి) : మొహమ్మద్ ప్రవక్త అల్లా బోధనలు చాలా మార్గదర్శకమని, అభివృద్ధికి బాటలు వేస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ మైదానంలో మతసామరస్యానికి ప్రతీకగా ఏర్పాటు చేసినటువంటి అల్ఫోర్స్ దావత్ – ఏ– ఇఫ్తార్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముస్లింలు 30 రోజులు ఉపవాసాన్ని కఠినంగా పాటిస్తూ అల్లా బోధనలు స్మరించుకుంటూ ఉంటారని ఈ బోధనల ద్వారా సమాజంలో అభివృద్ధితో పాటు శ్రేయస్సును పెంపొందించవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్, నవాబు, ముక్తి అలీముద్దీన్, షోయబ్బుల్లి, అబ్దుల్ జమీల్, ఉమర్ అలీ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

చింతపల్లి, మార్చి 26 (జనం సాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. చింతపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు.....డాక్టర్. శ్రీదేవి ఎలాంటి ఆపరేషన్లు లేకుండా నార్మల్ గా మహిళ గర్భిణీ స్త్రీలకు డెలివరీ చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఓ గర్భిణీ మహిళలకు నార్మల్ డెలివరీ చేయించారు. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లి ఎంతో సంతోషంగా ఉన్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్ళింది. దీంతో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు..... ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిసరాలను పరిశీలించి ఔట్ పేషెంట్, ఒపీ గర్భిణీలకు అందిస్తున్న రిజిస్టర్లను ఆమె తనిఖీ చేశారు. అవుట్ పేషంట్, ఆరోగ్య కేంద్రంలో అడ్మిట్ అయిన పేషంట్లతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పేషెంట్లను ఒక్కొక్కరిని మందలిస్తూ మందులు మంచిగా ఇస్తున్నారా, డాక్టర్లు సరిగా చూస్తున్నారా అనిబెడ్లపై ఉన్న పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఇక్బాల్, ఏ ఎంలు, ఆశా వర్కర్లు ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా టీజీ జేఏసీ ఏర్పాటు

ఖమ్మం, మార్చి 26 (జనంసాక్షి) : టీఎన్జీవోస్ భవన్లో జరిగిన ఖమ్మం జిల్లా వివిధ ఉద్యోగ సంఘాల సమావేశంలో ఖమ్మం జిల్లా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. టిజిజేఏసీ చైర్మన్ గా టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్‌గా టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, కో–చైర్మన్ లుగా పిఆర్టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ సెక్రటరీ పారుపల్లి నాగేశ్వరరావు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంబూరి సునీల్ రెడ్డి, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మామునూరి రాజేష్, టిఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టిజిఓస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, ఎంపీఓస్ అసోసియేషన్ మల్లెల రవీంద్ర ప్రసాద్, సిపిఎస్ ఉద్యోగుల సంఘం శశిధర్, చర్ల శ్రీనివాస్, పెన్షనర్స్ సంఘం ఎం.సుబ్బయ్య,పి.పుల్లయ్య , డాక్టర్స్ అసోసియేషన్ డాక్టర్ బాబు రత్నాకర్, డాక్టర్ సైదులు, టి.పి.టిఎఫ్టి. వెంగళరావు, ఎస్టిఎఫ్ జి .యాదగిరి, ఎస్టియు దొడ్డ వరప్రసాదరావు, టి.జి. పిఆర్టియు మట్ట శ్రీనివాసరావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బిక్కు, డ్రైవర్ల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అంగన్వాడి టీచర్స్ అసోసియేషన్ భవాని, పద్మ ,ఆశా వర్కర్స్ అసోసియేషన్ ఈ.కరుణ, కే. రమణ పోలీస్ అసోసియేషన్ ఎం వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఏప్రిల్ ఒకటి నుండి జిల్లా స్థాయిలో జరిగే కార్యాచరణ మేరకు ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు సమర్పించడం ఖమ్మం జిల్లాలో రాష్ట్ర జేఏసీ నాయకులును ఆహ్వానించి పెద్ద ఎత్తున ఉద్యోగుల సదస్సును నిర్వహించాలని, ఉద్యమాల ఖిల్లాగా పేరుగాంచిన ఖమ్మం జిల్లా నుండే ఉద్యమ కార్యాచరణను ప్రారంభిస్తామని ప్రకటించారు.

ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లు పరిశీలన

హుజూర్‌నగర్, మార్చి 26 (జనంసాక్షి) : పట్టణంలో ఈనెల 30వ తారీఖు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డులో పేర్లు ఉన్నా ప్రతి ఒక్కరికి 6 కేజిల సన్న బియ్యం పంపిణి కార్యక్రమానికి విచేస్తున్న సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ జాయింట్ సెక్రటరీ ప్రియాంక అలా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి రాంబాబు, ఆర్డీఓలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, డి యమ్ ప్రసాద్, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల అకస్మిక తనిఖీ

కొండమల్లేపల్లి, మార్చి 26 (జనంసాక్షి) : కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలు ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరును బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించడంతో పాటు, పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిభిరం, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. దేవరకొండ ఏఎస్పి మౌనిక, ఆర్డిఓ రమణారెడ్డి, మండల విద్యాధికారి నాగేశ్వరరావు నాయక్, ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

దేవరకొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

దేవరకొండ, మార్చి 26 (జనంసాక్షి) : దేవరకొండ ఏరియా ఆసుపత్రిని బుధవారం కాయకల్ప టీం సందర్శించింది. వారు అక్కడ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ఇన్ఫెక్షన్ నియంత్రణ పద్ధతులను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలను, అక్కడ అందుతున్న సేవలు, సౌకర్యాలు, పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ఇన్ఫెక్షన్ నియంత్రణ పద్ధతులను పరిశీలించారు. కాయకల్ప బృందం అచ్చంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపర్డెంట్ డాక్టర్ ప్రభు సందర్శన సమయంలో, డాక్టర్ పి రవి ప్రకాష్, సిబ్బంది అక్కడ అందుతున్న సేవలు వివరించారు. కాయకల్ప బృందం ఆసుపత్రిని భౌతికంగా తనిఖీ చేసి సిబ్బంది, రోగులతో సంభాషించారు. అసెస్మెంట్ బృందం ఆసుపత్రి పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేసింది. ముఖ్యంగా ఉన్నత నిర్వహణ ప్రమాణాలను పాటించినందుకు బృందం వారు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమములో సూపరింటెండెంట్ డా. పి. రవి ప్రకాష్ డా. కృష్ణ, డా. రంజిత్ కుమార్ , మరియు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన కోటాలో బాలు నాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ఒత్తిడి

- బాలు నాయక్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండదండలు
- జిల్లా మంత్రులు సైతం ఏకాభిప్రాయం
- నల్లగొండ ఎంపీ భారీ రికార్డు విజయంలో ఎమ్మెల్యే బాలు నాయక్ కీలక పాత్ర

కొండమల్లేపల్లి, మార్చి 26 (జనంసాక్షి) : తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 17 నెలలు కావొస్తోంది.డిసెంబర్ 9వ తేదీ నాడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 17 నెలలు పూర్తవుతుంది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో 12 మందికి తొలివిడతలో మంత్రులుగా చోటు కల్పించారు. ఆరు పదవులను మాత్రం భర్తీ చేయకుండా నిలిపివేశారు. ఏప్రిల్ మూడో తారీకు వరకు మిగతా మంత్రి పదవులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవ సభలు నిర్వహిస్తోంది. అయితే ఎన్నోసార్లు మంత్రివర్గ విస్తరణను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా వారం రోజుల్లోనే కొత్త మంత్రుల పేర్లు ప్రకటించే అవకాశం ఉందని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. అయితే ఈసారి మంత్రివర్గం రేసులో చాలా మంది నేతలు ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ అధిష్టానం ఆమోదం తెలిపిన వారికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని ప్రభుత్వం ఆలోచనగా ఉందని తెలుస్తోంది. తెలంగాణలో కేబినెట్ విస్తరణకు సమయం అసన్నమైందా..వారం రోజుల్లో కొత్త మంత్రులను ప్రకటించబోతున్నారా.. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకోబోయే నేతలెవరు.. కేబినెట్‌లో రేవంత్ మార్క్ ఉండబోతోందా.. ఈ సారి కేవలం గెలిచిన ఎమ్మెల్యే బలాలు బలహీనతల ప్రాతిపదికన కాంగ్రెస్ హైకమాండ్ అండదండలు ఉన్న నేతలకే అవకాశం కల్పిస్తున్నారా..అయితే ఈ సారి ఖచ్చితంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మంత్రిగా అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని గిరిజన ప్రజలు ఎంతో ఆశాభావంగా ఎదురుచూస్తున్నారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పిస్తే ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న దేవరకొండ నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష నెరవేరుతుంది. అన్ని పార్టీలు అధికారంలోకి వస్తే ప్రతిసారి దేవరకొండ ప్రాంతానికి మంత్రి పదవి ఇస్తామని హామీలు కురిపించారు. నేనావత్ బాలు నాయక్ విద్యార్థి దశ నుండే కాంగ్రెస్ పార్టీపై అభిమానం పెంచుకొని కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం అయిన ఎన్ఎస్ యుఐలో చురుకుగా పని చేశారు తన రాజకీయ ప్రస్థానం ఎంపిటిసిగా ప్రారంభించి పోటీ చేసిన మొదటిసారి ఎంపిటిసి ఎన్నికల్లో ఓడిపోయారు. ఓడిపోయిన బాధ పడకుండా మొక్కవోని దీక్షతో కాంగ్రెస్ జెండా పట్టుకొని అంచలంచెలుగా ఎదుగుతూ జడ్పిటిసిగా, మార్కెట్ కమిటీ చైర్మన్ గా, జడ్పీ చైర్మన్ గా, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాక్షేత్రంలో ప్రజలకు తమ విలువైన సేవలు ప్రజలకు అందిస్తున్నారు. దేవరకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలు నాయక్ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వెన్నంటే ఉంటూ కార్యకర్తలకు మనో ధైర్యాన్ని కల్పిస్తూ.. కార్యకర్తలు పిలిస్తే పలికే బలమైన నేతగా బాలు నాయక్ ఎదిగారు. అభివృద్ధిలో రాజీ లేకుండా దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ఇబ్బందులపై దృష్టి పెట్టండి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 26 (జనం సాక్షి) : ఎల్ఐసి ఏజెంట్ లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి పెట్టాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. బుధవారం పార్లమెంటు లో మాట్లాడుతూ జీవిత బీమా సంస్థ, రెగ్యులేటరీ అథారిటీ లు ఇటీవల విధించిన విధానం మార్పుల కారణంగా, భారతదేశ బీమా రంగానికి వెన్నుముకగా నిలిచిన ఎల్ఐసి ఏజెంట్లు ,తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎల్ఐసి ఏజెంట్లు ఎదురు కుంటున్న ఇబ్బందుల పై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని, ఇందుకోసం కమిషన్ కోతలను పునః పరిశీలించాలని, పాలసీ దారుడు పాలసీ సరెండర్ చేస్తే, ఏజెంట్ తన కమిషన్ లో కొంత భాగాన్ని తిరిగి ఇవ్వాలని క్లాబ్యాక్ నిబంధనను సవరించాలని సూచించారు.జీవిత , ఆరోగ్య భీమా పాలసీల పై జిఎస్టి ని తగ్గించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరారు.

విదేశాలపై మక్కువ

దేశాన్ని వీడేందుకు సంపన్నుల ఆసక్తి

సంపన్నులు పలువురు భారత్‌ను వీడి ఇతర దేశాల్లో నివసించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కనీసం 22శాతం మంది సూపర్ రిచ్ ఇండియన్స్ మెరుగైన జీవన ప్రమాణాలు, సులభమైన వ్యాపార వాతావరణం తదితర కారణాలతో దేశాన్ని వీళ్లాలని కోరుకుంటున్నట్లుగా ఓ సర్వే షాకింగ్ విషయాలు వెల్లడించింది. ఈ సర్వే 150 మంది అల్ట్రా రిచ్ వ్యక్తులపై నిర్వహించారు. సర్వే ప్రకారం.. ఆయా సంపన్నులంతా గోల్డెన్ వీసా స్కీమ్‌ని దృష్టిలో పెట్టుకొని.. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లాంటి దేశాల్లో స్థిరపడాలని కోరుకుంటున్నారు. దేశానికి చెందిన ప్రముఖ అసెట్ మేనేజర్ కంపెనీ కొటక్.. ప్రైవేట్ కన్సల్టింగ్ కంపెనీ ఈవైతో కలిసి సర్వే నిర్వహించింది. వాస్తవానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం.. ప్రతి సంవత్సరం 25లక్షల మంది భారతీయులు ఇతర దేశాలకు వలస వెళ్తున్నారు. సర్వేలో పాల్గొన్న ప్రతి ఐదుగురు అల్ట్రా రిచ్ వ్యక్తుల్లో ఒకరు ప్రస్తుతం వలస వెళ్లే పనిలో కొందరు ఉండగా.. మరికొందరు వలస వెళ్లేందుకు యోచిస్తున్నారని సర్వే ఫలితాలు తెలిపాయి. ఇందులో చాలామంది తమ భారతీయ పౌరసత్వాన్ని నిలుపుకుంటూనే.. తమకు నచ్చిన దేశంలో శాశ్వతంగా నివసించాలని కోరుకుంటున్నట్లుగా సర్వే పేర్కొంది. మెరుగైన జీవన ప్రమాణాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, జీవనశైలిని కోరుకుంటున్నట్లుగా సర్వే పేర్కొంది. మూడింట రెండువంతుల కంటే ఎక్కువ మంది వ్యాపార కార్యకలాపాలు సులభతరం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

వారంతా వలస వెళ్లే నిర్ణయాన్ని 'భవిష్యత్ పెట్టుబడి'గా అభివర్ణించడంతో పాటు తమ పిల్లలకు మంచి ఉన్నత విద్యను అందించాలనే కోరిక కూడా వలసకు ప్రేరేపిస్తుందని సర్వే నివేదిక తెలిపింది. ఈ సందర్భంగా కొటక్ మహీంద్రా బ్యాంక్ చైర్మన్ గౌతమి గవాంకర్ మాట్లాడుతూ వలస వెళ్లే నిర్ణయాన్ని దేశం నుంచి బయటకు వెళ్లే మూలధనంగా చూడొద్దన్నారు. అలాంటి కార్యకలాపాలపై పరిమితులు విధించడం వల్ల ఓ వ్యక్తి తన నివాస స్థలాన్ని మార్చినప్పటికీ.. డబ్బు బయటకు వెళ్లదన్నారు. ప్రస్తుతం భారతీయ పౌరుడుద ఏశం నుంచి సంవత్సరానికి 2.50లక్షల డాలర్లు మాత్రమే తీసుకువెళ్లగలదని.. ప్రవాస భారతీయుడు మాత్రం మిలియన్ డాలర్లు తీసుకువెళ్లేందుకు అనుమతి ఉందన్నారు.

ఇది పెద్ద ఎత్తున మూలధనం తరలింపు లేదని నిర్ధారిస్తుందన్నారు. వ్యవస్థాపకులు, వారి వారసుల కంటే నిపుణులు దేశం విడిచి వెళ్లేందుకు ఎక్కువ మొగ్గు చూపుతున్నారని సర్వే చెబుతున్నది. 36-40 సంవత్సరాలు.. 61 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల వ్యక్తులు వలస వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారని పేర్కొంది. ఇక 2023 లెక్కల ప్రకారం.. అల్ట్రా రిచ్‌గా జాబితాలో 2.83లక్షల మంది భారతీయులు ఉన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి నికర విలువ రూ.25కోట్ల కంటే ఎక్కువ. వారి మొత్తం సంపద రూ.2.83లక్షల కోట్లుగా అంచనా. సర్వే ప్రకారం.. 2028 నాటికి ఈ సంఖ్య 4.3లక్షలకు పెరుగుతుంది. వారి సంపద రూ.359లక్షల కోట్లకు చేరనున్నది.

వరుస లాభాలకు బ్రేక్..

భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో ముగిశాయి. ఇటీవల వరుసగా ఏడు సెషన్లలో లాభాల్లో కొనసాగిన మార్కెట్లు గురువారం భారీగా పతనమయ్యాయి. యూఎస్ టారిఫ్ విధానాల్లో స్పష్టత లేకపోవడం.. చమురు ధరల పెరుగుదల.. ఇటీవల మార్కెట్‌లో ర్యాలీ కొనసాగుతుండడంతో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఒక్కసారిగా కుదేలయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ ఉదయం ఫ్లాట్‌గా మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి సెన్సెక్స్ 78,167.87 గరిష్ఠానికి చేరుకుంది. ప్రారంభంలోనే 150.68 పాయింట్లు లాభపడింది. ఆ తర్వాత సెన్సెక్స్ అమ్మకాలతో ఒత్తిడికి గురైంది. దాంతో ఒక దశలో 822.97 పాయింట్లు పతనమైంది. ఇంట్రాడేలో 78,167.87 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. 77,194.22 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. చివరకు 728.69 పాయింట్లు తగ్గి.. 77,288.50 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 181.80 పాయింట్లు పతనమై.. 23,486.85కి చేరింది. నిఫ్టీలో ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్, హీరో మోటోకార్ప్, భారతీ ఎయిర్‌టెల్, గ్రాసిమ్, ఎంఅండ్‌ఎం, టైటాన్ కంపెనీ, బ్రిటానియా లాభపడ్డాయి. ఎన్‌టీపీసీ, టెక్ మహీంద్రా, సిప్లా, బజాజ్ ఫైనాన్స్, బీపీసీఎల్, యాక్సిస్ బ్యాంక్, అపోలో హాస్పిటల్, ఇన్ఫోసిస్, విప్రో నష్టపోయాయి.

యూఎస్ వాణిజ్య విధానంపై అనిశ్చిత మధ్య పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల కొన్ని దేశాలకు టారిఫ్ నుంచి మినహాయింపులు ఉంటాయని ప్రకటించారు. అయితే, ఈ విషయంలో స్పష్టత కొరవడింది. ఈ అస్పష్టత కారణంగా భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను అస్థిరపరించింది. గతవారంలో దలాల్ స్ట్రీట్‌లో ర్యాలీ కొనసాగింది. ఈ క్రమంలో గురువారం పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్ ఒత్తిడికి గురైంది. ఫలితంగా సూచీలు పతనమయ్యాయి. మరో వైపు డాలర్ మారకంతో పోలిస్తే రూపాయి 6 పైసలు తగ్గి 85.78కి చేరింది. దీనికి తోడు వెనిజులా నుంచి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే దేశాలపై సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో చమురు ధరలు బుధవారం భారీగా పెరిగాయి.

> "భారత్ ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న విషయం తెలిసిందే. ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉండడంతో భారత స్టాక్స్‌పై ప్రత్యక్షంగా ప్రభావం పడే అవకాశం ఉన్నది."



పసిడి ధర మళ్లీ పెరిగింది

బంగారం ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. రికార్డు స్థాయికి ధరలు చేరగా.. ఇటీవల వరుసగా నాలుగు రోజులు తగ్గుతూ వచ్చి ఊరటనిచ్చాయి. తాజాగా బుధవారం మార్కెట్‌లో ధర మళ్లీ పెరిగింది. రూ.235 పెరిగి తులం ధర రూ.రూ.90,685కి చేరుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం ప్యూరిటీ బంగారం 10 గ్రాములకు రూ.235 పెరిగి రూ.90,235కి చేరింది. ఇటీవలి నష్టాల తర్వాత రిటైలర్లు తాజాగా కొనుగోలు చేయడంతో పసిడి ధరలు పెరిగినట్లుగా వ్యాపారులు పేర్కొంటున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో బలమైన ట్రెండ్ కారణంగా సెంటిమెంట్‌ను ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. ఇక వెండి ధర రూ.1,500 పెరిగి కిలోకు రూ.1,01,500కి చేరింది. మరో వైపు ప్రపంచ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ 0.16 శాతం పెరిగి ఔన్సుకు 3,024.96 డాలర్లకు చేరింది. పెట్టుబడిదారుల డిమాండ్, సురక్షితమైన పెట్టుబడి గోల్డ్‌కి డిమాండ్, ఈటీఎఫ్‌ల నుంచి బలమైన ఇన్‌ఫ్లో కారణంగా బుధవారం బంగారం స్వల్పంగా పెరిగింది. ఇక ఏప్రిల్ 2న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై కొత్త వాణిజ్య విధానాన్ని ప్రకటించనున్నారు. యూఎస్ సుంకాల నిర్ణయంపై అనిశ్చితి కారణంగా బంగారానికి మద్దతు లభిస్తుందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ (కమోడిటీస్) విశ్లేషకులు సౌమిల్ గాంధీ తెలిపారు. ఎల్ కెపి సెక్యూరిటీస్, కమోడిటీ అండ్ కరెన్సీ, రీసెర్చ్ అనలిస్ట్-వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది మాట్లాడుతూ ఈ వారం చివరలో విడుదలకానున్న యూఎస్ జీడీపీ, కోర్ పర్సనల్ కన్స్యూమ్ ఎక్స్‌పెన్షన్ ప్రైస్ ఇండెక్స్‌తో సహా కీలకమైన స్థూల ఆర్థిక డేటా కోసం మార్కెట్‌కు చెందిన వారంతా ఎదురు చూస్తున్నారన్నారు. రష్యా-ఉక్రెయిన్ పరిణామాలు సైతం విస్తృత ధోరణిని ప్రభావితం చేస్తాయని.. డిమాండ్‌ను పెంచుతుందని త్రివేది పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల గోల్డ్ రూ.81,950 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి ధర రూ.89,400గా ఉన్నది. ఇక కిలో వెండి ధర రూ.1,11,000గా చేరింది.

పోలీస్ స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చికిత్స నిమిత్తం నల్గొండ ఏరియా ఆసుపత్రికి తరలింపు

మిర్యాలగూడ మార్చి 26 (జనం సాక్షి) : ఆస్తి తగాదాలతో ఓ యువకుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన నల్గొండ జిల్లా మిర్యాల గూడలో బుధవారం చోటు చేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం మిర్యాలగూడలోని బంగారుగడ్డకు చెందిన గుంటోజు మధుబాబు సోదరి పేరు మీద ఉన్న ఆస్తిని తనకు ఇవ్వాలని గత కొంతకాలంగా తల్లితో గొడవ పడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో తన తల్లిపై ఆస్తి పంపకం విషయంలో ఫిర్యాదు ఇవ్వడానికి టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు వచ్చాడన్నారు. ఆస్తి విషయాలు సివిల్ కేసు అయినందున తాము పరిష్కరించలేమని అక్కడి పోలీసులు చెప్పడంతో మనస్థాపానికి గురైన మధుబాబు అప్పటికి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ తో పోలీస్ స్టేషన్ నుండి బయటకు వచ్చి ఒంటిమీద పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, పరిసర ప్రాంత ప్రజలు మధుబాబు శరీరంపై మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. దాదాపు 60 శాతం పైగా శరీరం కాలిపోవడంతో అత్యవసర చికిత్స నిమిత్తం నల్గొండ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

దేశవ్యాప్తంగా యూపీఐ సేవల్లో అంతరాయం

డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపీఐ (యూపీఐ) సేవల్లో అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఈ సేవల్లో సాంకేతిక లోపం తలెత్తింది. పేమెంట్స్, ఫండ్ ట్రాన్స్ఫర్ వంటి విషయాల్లో అవాంతరాలు ఎదుర్కొంటున్నట్లు యూజర్లు పేర్కొంటున్నారు. డౌన్ డిటెక్టర్ వెబ్సైట్ ప్రకారం.. బుధవారం సాయంత్రం 7 గంటల తర్వాత ఈ సమస్య ఉత్పన్నమైనట్లు సమాచారం. ఈ మేరకు యూజర్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. యూపీఐ సేవలందించే గూగుల్ పే, ఫోన్పే వంటి యాప్స్ పనిచేయడం లేదని పేర్కొంటున్నారు. దీంతో ఈ అంశంపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పిసిఐ) స్పందించింది. యూపీఐ సేవల్లో అంతరాయం ఏర్పడిన విషయాన్ని ధ్రువీకరించింది. సాంకేతిక సమస్యల కారణంగా యూపీఐ సేవలపై తాత్కాలికంగా ప్రభావం పడినట్లు తెలిపింది. ఇప్పుడు సమస్య పరిష్కారమైందని, వినియోగదారులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా పేర్కొంది.

కొత్త జిల్లాలోని అధికారులకు పూర్తిస్థాయి అధికారాలు ఇవ్వాలి

అమరావతి, మార్చి26(జనంసాక్షి) : జిల్లాలోని అధికారులతో సంబంధం లేకుండా కొత్త జిల్లాలో అధికారులకు పూర్తిస్థాయి అధికారులు ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రెండవ రోజు కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాలోని అధికారులు స్వేచ్ఛగా వారి విధులను నిర్వహించుకునే అవకాశం కల్పించాలన్నారు. దీనిపై సంబంధించిన ఆదేశాలను హెచ్ఓడీలు రెండు రోజుల్లో జారీ చేయాలని తెలిపారు. కొత్త జిల్లాలలో ఎటువంటి స్టాఫ్ సమస్య లేకుండా స్టాఫ్ రెగ్యులేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పని ఒత్తిడికి తగ్గట్టుగా అధికారులు, సిబ్బందిని కేటాయించాలని వెల్లడించారు. ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌లోనూ ప్రత్యేకించి కొత్త జిల్లాల హెడ్ క్వార్టర్లలో కనీసం మూడు హోటల్స్ ఉండేలా చూడాలన్నారు. కొత్త జిల్లాల్లో మౌలిక వసతుల కల్పన అంశంపై కూ డా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై రాష్ట్రస్థాయిలో చర్చిస్తున్నామని సీఎం అన్నారు. పేదరిక నిర్మూలనకు సంపదను సృష్టించే టూరిజం తదితర అం శాలకే భవిష్యత్తు అంతా ప్రాధాన్యతనిస్తుందని, భౌతిక వాదమే వస్తుందని అన్నానని.. కాబట్టి తాను చెప్పేదంతా జిల్లా కలెక్టర్లు అందరూ అర్థం చేస్తుకుని క్షేత్ర స్థాయిలో రియల్ టైమ్‌లో అమలుపరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. ఏపీలో ఐదు జోన్‌లు ఉన్నాయన్నారు. జోన్-1 లో విశాఖపట్నం, జోన్-2 లో రాజమండ్రి, జోన్-3 లో రాజదాని అమరావతి, జోన్-4 లో తిరుపతి, జోన్-5 లో అనంతపురం పవర్ హబ్‌లుగా ఉన్నాయని తెలిపారు. ఆ పవర్ హబ్ల ఆధారంగా ఆయా జోన్లలోని అన్ని జిల్లాలను అభివృద్ధి పర్చే విధంగా జిల్లా కలెక్టర్లు జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలుపరిస్తే రాష్ట్ర భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుందని వెల్లడించారు. ప్రతి ఒక్క జోన్‌కు ఒక సీనియర్ అధికారిని ఇన్‌చార్జిగా ఉంచామన్నారు. ప్రతి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి కూడా ఉన్నారని తెలిపారు. వీరందరూ కలిసి ఆయన జిల్లాలను, ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో సమగ్రంగా చర్చించి క్షేత్ర స్థాయిలో తగు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారుర. గ్రామాల్లోని వాస్తవ విషయాలను తెలుసుకుని అందుకు తగ్గట్టుగా అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించే విధంగా, గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వాటిని రియల్ టైమ్‌లో పరిష్కరించేందుకై వచ్చే మాసం నుంచి సీనియర్ అధికారులు అంతా గ్రామాల్లో మూడు నాలుగు రోజులు ప్యటించాలని ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

మంత్రి కొండ సురేఖ మట్టి పాత్రల అందజేత

తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలకృష్ణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖను కలిసి ఉగాది పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పచ్చడి తయారీచేసే మట్టి పాత్రలను మంత్రికి అందజేశారు. అనంతరం మట్టి పాత్రల తయారీ విధానం వాటి వినియోగం వలన మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించా రు. మట్టి పాత్రలను చూసి మంత్రి సురేఖ హర్షం వ్యక్తంచేశారు. వరంగల్ జిల్లాలో త్వరలో ప్రభుత్వంతో మట్టిపాత్రల తయారీ శిక్షణ ఇప్పిస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీనిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో మట్టి పాత్రల వినియోగం పెరిగే విధంగా అన్నిరకాల సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. మంత్రి సురేఖను కలిసిన వారిలో రాష్ట్ర కుమ్మరి సంఘం ప్రధానకార్యదర్శి పావని , రాష్ట్ర కార్యదర్శి దరిపల్లి శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాములు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కదురుపాక నర్సయ్య, పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు దరిపల్లి నర్సయ్య, వైరా నియోజకవర్గ అధ్యక్షులు దండు కృష్ణారావు, ఖమ్మం పట్టణ అధ్యక్షులు తొర్లికొండ నర్సింహారావు, దరిపల్లి అంజయ్య, జీల్కపల్లి చందన పాల్గొన్నారు.

పోలీసులు నిర్లక్ష్యం

- 500 బదులు పదిలక్షల 500 ఫైన్
- కోర్టు సమన్లతో ఖంగుతిన్న విద్యార్థి

గాంధీనగర్,మార్చి 26 (జనంసాక్షి) : సాధారణంగా హెల్మెట్ పెట్టుకోకుండా పోలీసులకు దొరికితే 500 నుంచి 1000 రూపాయల వరకు ఫైన్ ఉంటుంది. కానీ, ఓ విద్యార్థికి మాత్రం పోలీసులు ఏకంగా 10 లక్షల రూపాయల ఫైన్ వేశారు. అంత పెద్ద మొత్తంలో ఫైన్ పడటం చూసి అతడు షాక్ అయ్యాడు. ఈ సంఘటన అహ్మదాబాద్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. ఆ వివరాల్లోకి వెళితే.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన అనిల్ హాదియా. అనే లా విద్యార్థి బైకు మీదే లా కాలేజీకి వెళుతూ ఉంటాడు. గతేడాది ఏప్రిల్ నెలలో కూడా హెల్మెట్ లేకుండా బైకు నడుపుకుంటూ కాలేజీకి వెళుతూ ఉన్నాడు. శాంతిపుర ట్రాఫిక్ సర్కిల్ దగ్గర ట్రాఫిక్ పోలీసులకు దొరికాడు. దీంతో పోలీసులు అతడికి ఫైన్ వేశారు. కొద్దిరోజుల తర్వాత అతడి ఇంటికి కోర్టు సమన్లు వచ్చాయి. సమన్లు చదివి షాక్ అయ్యాడు. హెల్మెట్ లేకుండా బైకు నడిపినందుకుగాను.. అక్షరాలా 10,00,500 రూపాయలు కట్టాలని అందులో ఉంది. అనిల్‌కు ఏం చేయాలో అర్థం కాలేదు. దీంతో అతను అనిల్‌ను మెట్రో పాలిటన్ కోర్టుతో పాటు పోలీస్ కమిషనర్ దగ్గరకు తీసుకెళ్లాడు. అనిల్ అక్కడ తన గోడు వెల్లబోసుకున్నాడు. పోలీస్ కమిషనర్ ఈ ఘటనపై ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. 500 రూపాయలకు బదులుగా 10,00,500 రూపాయలు అని తప్పుగా పడినట్లు తేలింది. దాన్ని సరిచేస్తామని అధికారులు అనిల్‌కు భరోసా ఇచ్చారు. దీంతో అనిల్ ఊపిరి పీల్చుకున్నాడు.

జడ్పీటిసి ఖాళీల భర్తీ తరవాతే ఎన్నిక

కడప జడ్పీటిసిపై హైకోర్టులో పిటిషన్

అమరావతి,మార్చి26 (జనంసాక్షి) : ఉమ్మడి కడప జిల్లా.. జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక వివాదం ఇప్పుడు హైకోర్టు వరకు చేరింది.. జడ్పీ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయాలంటూ గోపవరం జడ్పీటీసీ జయరాం రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కడప జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ నెల 27న జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఖాళీగా ఉన్న 2 స్థానాలకు ఎన్నికలు జరపకుండా చైర్మన్ ఎన్నిక జరపడం వల్ల తాను నష్టపోతున్నట్లు- అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తాను జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికలలో పోటీ- చేయనున్నానని.. ఖాళీగా ఉన్న స్థానాలకు ఎన్నికలు జరగకపోవడం వల్ల తనకు నష్టం జరుగుతున్నట్లు- ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఖాళీగా ఉన్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకుండా, జడ్పీ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వడంపై ఆయన సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.. జడ్పీ చైర్మన్ ఎన్నికపై ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్ ను వాయిదా వేయాలని అందులో పేర్కొన్నారు. టీ-డీపీ జడ్పీ చైర్మన్ రేస్‌లో లేదని అంటూనే మరో ప్రక్క టీ-డీపీ జడ్పీటీసీ జయరాం రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేయడంపై మరోమారు ఉత్కంఠ నెలకొంది. అయితే, టీడీపీ జడ్పీటీసీ జయరాం రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరగనుంది.

తిరుమల విద్యాదాన ట్రస్టుకు విరాళం

తిరుమల,మార్చి26(జనంసాక్షి) : రాజమహేంద్రవరానికి చెందిన తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు, నున్న సరోజినిదేవి దంపతులు తిరుమల శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు బుధవారం రూ.1,01,11,111 విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకులు మండపంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు. ఈ సందర్భంగా దాతలను చైర్మన్, అదనపు ఈవో అభినందించారు. తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. ఎంబీసీ వరకు భక్తులు క్యూలైన్లో నిలబడి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 64,252 మంది భక్తులు దర్శించుకోగా 25,943 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.68 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

పాస్టర్ మృతిపై లోతైన విచారణ

హోంమంత్రి అనిత వెల్లడి

రాజమండ్రి,మార్చి 26 (జనంసాక్షి) : పాస్టర్ పగడాల.ప్రవీణ్ మృతిపై లోతైన విచారణ చేయిస్తున్నామని హోం మంత్రి అనిత వెల్లడించారు. డీఎస్పీ స్థాయి పోలీసు అధికారుల కమిటీ విచారణ చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం పారదర్శకంగా ఈ ఘటనపై దర్యాప్తు చేస్తోందన్నారు. రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నామని అన్నారు. దీనిని కేవలం యాక్సిడెంట్‌గా మాత్రమే పరిగణించటం లేదని హోం మంత్రి స్పష్టం చేశారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోందన్నారు. రాజకీయంగా, మతపరంగా విద్వేషాలు రగిల్చేలా వ్యవహరించొద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందన్నారు. ప్రమాదవశాత్తూ ఈ ఘటన జరిగిందా ? ఏమైనా ఇం-టె-న్షన్ ఉందా ? అన్న దానిపైనా విచారణ చేస్తున్నామన్నారు. అనుమానాస్పద మృతిగానే ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. ఘటనా స్థలికి సమీపంలో కాల్ డేటా రికార్డులు కూడా తీసుకుంటు-న్నామన్నారు. దర్యాప్తు విషయంలో ఎవరికీ ఎలాంటి అభద్రతా భావన అవసరం లేదని హోం మంత్రి తెలిపారు.

ప్రజలపై కుక్కల కాటు

పెద్ద కొడప్గల్ మార్చి 26 (జనంసాక్షి): పెద్ద కొడప్గల్ మండలంలో కుక్కల బెడద రోజురోజుకు అధికమవుతుంది. బుధవారం మండలంలోని వడ్లం గ్రామానికి చెందిన సంతు వార్ రామప్ప (సుమారు 60 సంవత్సరాలు)కు వీధి కుక్క కరవడంతో గాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. అందుబాటులో వైద్యుడు లేకపోవడంతో నర్సు వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ (108) లో తరలించారు. అదేవిధంగా మండలంలోని సర్దార్ తాండాకు చెందిన ఇద్దరు చిన్నారులు కూడా కుక్క కాటుకు గురయ్యారు. ఇటీవల పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని డబల్ బెడ్ రూమ్ కాలనీలో ఒకరు, కాటేపల్లి గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కూడా కుక్క కాటుకు గురయ్యారు. అధికారులకు సమస్య తెలిపిన ఫలితం లేకుండా పోయిందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను తొలగించాలని కోరుతున్నారు.

స్టార్టప్ ర్యాంకింగ్‌లో భారత్ ఎక్కడ..?

ప్రపంచ స్టార్టప్ ఎకోసిస్టమ్ గురించి తాజాగా స్టార్టప్ డేటాబేస్ సంస్థ ట్రాక్స్న్ ఓ నివేదికను ప్రకటించింది. ఈ నివేదికలో అమెరికా, యూకేల తర్వాత భారత్ మూడో స్థానంలో నిలిచింది. 2025 మొదటి త్రైమాసికంలో భారతదేశం 2.5 బిలియన్ డాలర్ల నిధులను (రూ.2,14,15,17, 50,000) సమకూర్చుకుంది. ఈ క్రమంలోనే తన వృద్ధిని పెంచుకుని మూడో ప్లేస్ చేరుకుంది.

పంబన్ బ్రిడ్జికి త్వరలో మోడీ ప్రారంభోత్సవం

చెన్నై,మార్చి 26 (జనంసాక్షి) : తమిళనాడులోని సముద్ర తీరంలో ఉన్న చారిత్రక పంబన్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థానంలో

శ్రీలత మెటర్నటీ నర్సింగ్ హోమ్‌లో.. మొబైల్ అల్ట్రా సౌండ్ మెషిన్ సీజ్

కరీంనగర్ బ్యూరో, మార్చి 26 (జనంసాక్షి) :

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఫెర్టిలిటీ కేంద్రాల స్పెషల్ డ్రైవ్ టీం తనిఖీలలో శ్రీలత మెటర్నటీ నర్సింగ్ హోమ్‌హాస్పిటల్ ను తనిఖీ చేశారు. వారు ఈ హాస్పిటల్ లో అనధికారికంగా రిజిస్టర్డ్ కానీ మొబైల్ అల్ట్రా సౌండ్ మిషను కనుగొని రెవెన్యూ , పోలీస్ శాఖ ఏఎస్ ఐ తో కూడిన స్పెషల్ డ్రైవ్ తనిఖీ బృందము శ్రీలత మెటర్నిటీ నర్సింగ్ హోమ్ కి నోటీసు ఇచ్చి మొబైల్ అల్ట్రా సౌండ్ మిషను సీజ్ చేశారు. అదేవిధంగా హాస్పిటల్లో స్కానింగ్ కొరకు వచ్చే పేషెంట్లు వివరాలతో కూడిన ఫామ్ ఎఫ్ ఫారం ను పూర్తి పూర్తి చేసి ఏ రోజుకు ఆ రోజు ఆన్లైన్లో అప్డేట్ చేస్తున్నటువంటి విధానాన్ని, అవుట్ పేషెంట్ రిజిస్టర్ లు, పి.సి.పి.ఎన్.డి.టి జిల్లా అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్, అందులో పని చేస్తున్న డాక్టర్స్ క్వాలిఫికేషన్ వెరిఫికేషన్, గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం 1994 , రూల్స్ 1996 అమలవుతున్న తీరు, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడూ స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్ట ప్రకారం 3 సంవత్సరాల వరకు జైల్ శిక్ష, 10 వేల రూ.ల జరిమానా విధించబడుతుందని, అలాగే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపే బోర్డులు ప్రదర్శిస్తున్నారా లేదా, స్కాన్నింగ్ కేంద్రాలలో కచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ధరల పట్టిక, సరైన రికార్డుల నిర్వహణ ఉండాలని, ప్రతి నెల జరిగే స్కానింగ్ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపిస్తున్న తీరు, లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని, పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని చెప్పకూడదని బోర్డులు స్కానింగ్ కేంద్రాలలో ప్రదర్శించడాన్ని తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ స్కానింగ్ కేంద్రల, ఫెర్టిలిటీ కేంద్రాల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డా. వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ వెంకటరమణ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాములు, జూనియర్ అసిస్టెంట్ బాపు దేవ్, ఏ.యస్.ఐ. విజయమణి, పి.ఓ, డి.టి.టి. డా. ఉమాశ్రీ , పి.సి.పి.ఎన్.డి.టి ప్రోగ్రామ్ అధికారి డా. సనా జవేరియా, సఖి కన్సల్టెంట్, డి.లక్ష్మి, డాటా ఎంట్రీ ఆపరేటర్ కె. రమేశ్, డెమో, రాజగోపాల్, సుపెర్వైజర్ సయ్యద్ సబీర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

ఎల్ఆర్ఎస్ పట్ల క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ

ఖానాపూర్ మార్చి 26 (జనం సాక్షి)

: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత పాటించి నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రం లోని మండల అభివృద్ధి కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇల్లును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం గూడు లేని నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టిందని అన్నారు. నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు చేకూరుతాయని తెలిపారు. గ్రామపంచాయతీలలో లబ్ధిదారుల జాబితాను పంచాయతీ నోటీసు బోర్డుపై అతికించాలని, అలాగే మునిసిపాలిటీ పరిధిలో మునిసిపాలిటీ కార్యాలయంలో అతికించాలని సూచించారు. అనంతరం మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో మండల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ పట్ల క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న 25% రాయితీని ప్రతి ఒక్క లబ్ధిదారునికి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎల్ ఆర్ ఎస్ విధానాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. ఇంటి పన్ను వసూలు వంద శాతం వసూలు చేయాలని సంబంధిత సిబ్బందికి కలెక్టర్ ఆదేశించారు. ఇసుక రవాణా పట్ల కఠినంగా వ్యవహరించాలని అక్రమ ఇసుక రవాణా చేస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వాగులు, నది పరివాహక ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రెవెన్యూ, పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సుజాత, ఎంపీడీవో సునీత, ఎం పీ ఓ రత్నాకర్ రావు, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ లతోపాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

దేశ్ ముఖ్ లను ఎదిరించిన చరిత్ర వీరనారి ఐలమ్మది

జర్నలిస్ట్ పాశం యాదగిరి

పాలకుర్తి మార్చి 26 (జనంసాక్షి)

నిజాం నిరంకుశ తాబేదారుల పాలనకు వ్యతిరేకంగా పోరాడి. దేశ్ ముఖ్ లను ఎదిరించిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మది అని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహం వద్ద ఆమె (ఐలమ్మ) డాక్యుమెంటరీ చిత్రీక రించారు .ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 2 న హైదరాబాదులోని ఐలమ్మ మహిళా విశ్వవిద్యా లయం ఆవరణలో ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిన ఐలమ్మ చరిత్రను బడుగు బలహీన వర్గాలకు చెందిన అందరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె చూపిన తెగువ ప్రపంచానికి చాటి చెప్పేందుకే అన్ని వర్గాల ప్రజలు ముందు ఉండాలని అన్నారు .రాష్ట్ర సాధనలో ఐలమ్మ పోరాటం మరువలేనిదని అన్నారు .పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. ట్యాంక్ బండ్ పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని జనగామ జిల్లాకు ఐలమ్మ పేరు నామకరణం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంటరీ నిర్మాత డాక్టర్ రవికాంత్. దర్శకురాలు డాక్టర్ సంధ్య. ఐలమ్మ కుటుంబ సభ్యులు చిట్యాల యాకయ్య. చిట్యాల సంపత్. చిట్యాల శ్వేత. రాపర్తి మంజుల. సోమనాధ కళా పీఠం అధ్యక్షుడు రావోలు సత్యనారాయణ. మార్గం లక్ష్మీనారా యణ. మాజీ జడ్పి టీసి పుస్కూరి శ్రీనివాసరావు. మాచర్ల సారయ్య. గూడూర్ లెనిన్. గుమ్మడి రాజుల సాంబయ్య. ఎండి మదార్ కత్తుల యాకయ్య. సంగి వెంకన్న. సాయి సందీప్. మల్లేష్. ఉన్నారు.

ఓటిఎస్ ను సద్వినియోగం చేసుకోండి

సువర్ణావకాశం కేవలం 4 రోజులు మాత్రమే..

వరంగల్ ఎంజీఎం, మార్చి 26 (జనంసాక్షి)

: వన్ టైం సెటిల్మెంట్(ఓటిఎస్) స్కీమ్ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకొని పన్ను పై 90% వడ్డీ మాఫీ పొందాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం నకు చెందిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే, ఆస్తి పన్నుపై 90% పేరుకుపోయిన బకాయి వడ్డీని మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 మార్చి 31 వరకు వడ్డీ/పెనాల్టీలతో సహా మొత్తం ఆస్తి పన్ను బకాయిలను ఒకేసారి చెల్లించిన పన్ను చెల్లింపుదారులకు సంబంధించి, బకాయిలపై 90% వడ్డీ/పెనాల్టీలను మాఫీ చేయడం జరుగుతుందని, ఇదివరకే పన్నులు చెల్లించిన వారికి భవిష్యత్తు చెల్లింపులతో సర్దుబాటు చేయాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగిందని, ఈ సువర్ణావకాశం కేవలం 4 రోజులు మాత్రమే వర్తిస్తుందని, ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

భూసేకరణ కోసం అభ్యంతారాలు ఉంటే తెలపాలి

భీమదేవరపల్లి, మార్చి 26(జనం సాక్షి)

గౌరవెల్లి ప్రాజెక్టు కొరకు మండలంలోని కెనాల్స్ భూసేకరణ కోసం బుధవారం ముత్తారం గ్రామంలో రైతులతో నీటిపారుదల డిప్యూటీ ఈఈ చైతన్య, మండల తాసిల్దార్ ప్రవీణ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డిఓ రమేష్ రాథోడ్ హాజరు అయ్యారు. ముందుగా ఆర్ ఐ శ్రీధర్ భూములు కోల్పోయే రైతుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం ఆర్డీవో రమేష్ రాథోడ్ మాట్లాడుతూ, గౌరవెల్లి రిజర్వాయర్ నుంచి నీటి పంపిణీ ప్రక్రియకు సంబంధించిన మెయిన్ కెనాల్ నుంచి ఆయా గ్రామాలకు అందించేందుకు వీలుగా డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ నిర్మించేందుకు కావలసిన భూసేకరణ కోసం ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపాలని రైతులకు సూచించారు. కరీంనగర్ నీటిపారుదల అధికారి చైతన్య మాట్లాడుతూ, భవిష్యత్తులో కాలువల వల్ల జరిగే ప్రయోజనాలను వివరిస్తూ, భూ సేకరణకు సహకరిం చాలని కోరారు. ఈ సమావేశంలో భూ సేకరణ అధికారి రాజ్ కుమార్, ఆర్.ఐ లు శ్రీధర్, రాజు, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్, వంగర ఎస్సై దివ్య, గ్రామపంచాయతీ సెక్రటరీ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు స్నేహ బంధాన్ని పెంపొందిస్తాయి

ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ముఖ్య అతిథిగా హాజరైన నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్

కరీంనగర్, మార్చి 26 (జనంసాక్షి)

ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తా యంది... గంగా జమున తెహజీబ్ కు ప్రతిరూపంగా మారుతాయని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు, ఎంఐఎం పార్టీ కరీంనగర్ ఆధ్వర్యంలో కాశ్మీర్ గడ్డ ఐబీఏ గార్డెన్ లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ కు, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు అలుగునూర్ బ్రిడ్జి వద్ద ఘన స్వాగతం పలికారు, ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదరులకు ఖర్జుర వండ్లు, డ్రైఫ్రూట్స్ ఏర్పాటు చేసి రోజును విరమింపజేశారు. ఈసందర్భంగా మాజిద్ హుస్సేన్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు స్నేహబంధాన్ని పెంపొందిస్తాయని, హిందూ ముస్లిం ఐక్యతకు మారుపేరుగా నిలుస్తాయన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో అల్లాహ్ మెప్పు కోసం నెల రోజుల పాటు కఠోర మైన ఉపవాస దీక్షలు పాటించి, నెల రోజులు ఖురాన్ పారాయణం, తరావీహ్ నమాజ్ క్రమం తప్పకుండా ఆచరించి పుణ్య ఫలాలు పొందడం గొప్ప ధార్మిక సంకల్పమని కొనియాడారు. సనిషి జీవితంలో సంపాదన, డబ్బు కంటే ఆధ్యాత్మిక చింతనే ముఖ్యమన్నారు. ఏడాదిలో 11 నెలలు తమ కోసం, ఒక నెల రమాజన్ మాసం మొత్తం అల్లాహ్ కోసం కేటాయించి, చిన్న తప్పు చేయకుండా, చెడుకు దూరంగా ఉండి పవిత్రమైన ఉపవాస దీక్షలు పాటించడం అంటే ఏకేశ్వరుడైన అల్లాహ్ కరుణా కటాక్షములు పొందడమేనన్నారు. అనంతరం ఇస్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ కు పూలమాలలు, శాలువాతో ఇస్లామీయ సంప్రదాయ బద్ధంగా ఎంఐఎం నాయకులు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ దావాతే ఇఫ్తార్ విందుకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 4వేల మందికి పైగా హాజరై విజయవంతం చేశారు. హాఫిజ్ యూసుఫ్ సమాజ్ ముగ్రిబ్ నదివించగా, మౌలానా అలీముద్దీన్ నిజామి, మౌలానా ఘుఫ్రాన్ దుఆ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ, ఖమరుద్దీన్, ఆతిన, కోశాధికారి ఇబ్రహీం, మాజీ కార్పొరే టర్లు అఖిల్ ఫిరోజ్, అలిబాబా, అజర్ దబీర్, ఉమ్మడి జిల్లా ఎంఐఎం నాయకులు, నగర ఎంఐఎం డివిజన్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, ఎంఐఎం అభిమానులు పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

నర్సంపేట. మార్చి 26 (జనం సాక్షి)

: నర్సంపేట మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ఎల్ఆర్ఎస్ క్రింద క్రమబద్ధీకరణకు చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 26 ఆగస్టు 2020 కు ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు, లే అవుట్ల క్రమబద్ధీకరణ ఈ నెల 31 తో ముగుస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రిబెట్ పొందవచ్చని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ప్లాట్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరకాస్తుదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆడిగి తెలుసుకొగా అధికారులు బాగా స్పందిస్తున్నారని వారు తెలిపారు. నర్సంపేట మునిసిపల్ పరిధిలో 5732 మంది దరకాస్తూ చేసుకోగా 2271 క్రమబద్ధీకరణకు మంజూరు చేయగా, 293 మంది ఫీజు చెల్లించారని, 186 మందికి క్రమబద్ధీకరణ పత్రాలు అందజేయడం జరిగిందని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. ఈ సదావకాశాన్ని వినియోగించుకొని దరఖాస్తు దారులు సకాలంలో లే అవుట్ల క్రమబద్ధీకరణ చేయించుకోవాలని తెలిపారు. దరఖాస్తు దారులు రుసుము చెల్లించిన 48 గంటల్లోగానే ప్రొసీడింగ్స్ జారీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సంధ్య, టి పి ఓ వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలపై పటిష్టమైన చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.

మంచిర్యాల ప్రతినిధి, మార్చి 26 (జనంసాక్షి) :

జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల విక్రయం, కొనుగోలుపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడంపై ఏర్పాటు చేసిన సమావేశానికి డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడంపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల వినియోగం వలన కలిగే నష్టాలను రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేసే దళారులు, విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలాల్లో, గ్రామాల్లో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనేలా రైతులకు వివరించాలని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలతో పట్టాదారు, కౌలు రైతులు పంట సాగు చేసినట్లయితే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు నిలిపివేయడం జరుగుతుందని, దళారులపై పి.డి. యాక్టు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో దళారులు ఎవరైనా విడిగా పత్తి విత్తనాలు విక్రయించినట్లయితే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు. హెచ్.టి. కాటన్ సాగు చేసిన రైతులు గ్లైఫోసేట్ కలుపు మందు పిచికారీ చేయడం ద్వారా భూసారం తగ్గుతుందని, క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించాలని, బస్టాండ్, రైల్వేస్టేషన్, జిల్లా సరిహద్దు ప్రాంతాలలో చెక్పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలని తెలిపారు. దళారులు ఇతర రాష్ట్రాల నుండి నకిలీ విత్తనాలను తీసుకువచ్చి మోసానికి పాల్పడుతున్నారని, రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి పంట సాగు చేసి అధిక లాభాలు పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశిల్దార్లు, ఎ.డి.ఎ.లు, ఎస్.ఐ.లు, మండల వ్యవసాయ అధికారులు.

దేశంలో రాజ్యంగ వ్యవస్థని కాపాడుకోవాలి

జనగామ ప్రతినిధి, మార్చి 26(జనంసాక్షి)

జనగామ పట్టణ కేంద్రంలోని గాయత్రి గార్డెన్స్ లో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పాల్గొని, మాట్లాడుతూ భారత దేశంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, రాజ్యంగా ప్రజాస్వామ్య పాలన సాగించాలని నాడు రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర చేపట్టారని అన్నారు. భారత దేశం నేడు విపత్కర పరిస్థితులు ఎదుర్కుంటుందని, గత పదేళ్లకు పైగా దేశాన్ని పాలిస్తున్న బిజేపి రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ మోడీ మార్క్ పాలనా సాగిస్తోందని, రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ, గౌరవిస్తూ పాలన చేయాల్సిన పాలకులు నేడు వ్యవస్థలను నాశనం చేస్తున్నారన్నారు. దేశంలో ఇటీవల పరిణామాలు సమాజంలో అశాంతిని నెల కోల్పుతూ విభేదాలు సృష్టిస్తూ రాజకీయ మనుగడ కోసం మత విద్వేషాలను రెచ్చ గొడుతు, రాజ్యాంగం లౌకికవాదం పై బిజేపి దాడి చేస్తోందని, రాజ్యాంగం మత స్వేచ్ఛను కాలరాస్తూ కట్టు బొట్టు తిండి పూజ అన్నింటిపైన ఆంక్షలు పెడుతూ ప్రజల హక్కులకు భంగం కల్పిస్తున్నారని, లౌకికవాదాన్ని కాపాడటానికి ఈ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్' సమావేశం నిర్వహించుకున్నాము.ప్రజల హక్కులను, ముఖ్యంగా 'భావ ప్రకటనా స్వేచ్ఛ'ను కాపాడటం, రాజ్యాంగాన్ని రక్షించడం లక్ష్యమే కాంగ్రెస్ పార్టీ ది అన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు లక్ష్మి నారాయణ నాయక్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివ రాజ్ యాదవ్, డాక్టర్ సెల్ నాయకులు డా.రాజమౌళి ,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గంగాం నరసింహ రెడ్డి.లు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, కొమ్ము రవి, పాల్గొన్నారు.

అందుబాటులో అవేశ్

- సన్ రైజర్స్‌తో మ్యాచ్‌లో తిరిగి జట్టులోకి
- లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు శుభవార్త

ఆ జట్టు స్టార్ పేసర్ అవేశ్ ఖాన్ తిరిగి జట్టులోకి చేరనున్నాడు. మోకాలి నొప్పితో బాధపడుతున్న అవేశ్.. తాజాగా బీసీసీఐ నిర్వహించిన ఫిట్ నెస్ టెస్టులో పాస్ అయినట్లు తెలుస్తోంది. దీంతో అతడిని ఐపీఎల్లో ఆడటానికి అనుమతి లభించింది. నికార్సైన బౌలర్లు లేక వెలవెలబోతున్న లక్నోకు తాజాగా అవేశ్ తిరిగి రావడం చాలా పెద్ద ప్లస్ పాయింట్. ఐపీఎల్లో ఆడిన విశేష అనుభవం అతని సొంతం. ఇక జాతీయ జట్టు తరపున గత నవంబర్‌లోను బరిలోకి దిగాడు. సౌతాఫ్రికా పర్యటనలో తను ఆడాడు. ఆ తర్వాత గాయంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలోనే రంజీ ట్రోఫీలో మధ్యప్రదేశ్ ఆడిన చివరి మ్యాచ్‌కు కూడా తను దూరమయ్యాడు. కుడి మోకాలిలో గాయం తిరగబెట్టడంతో తను క్రికెట్‌కు కొంతకాలంగా దూరమయ్యాడు. ప్రస్తుతం తను తిరిగి రావడంతో లక్నో ఊపిరి పీల్చుకున్నట్లు అయింది. మెగావేలంలో లక్నో పిక్ చేసిన చాలామంది ఆటగాళ్లు గాయాలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా బౌలర్లు దూరం కావడం పెద్ద మైనస్ పాయింట్‌గా మారింది. స్పీడ్ స్టర్ మయాంక్ యాదవ్ మోకాలి గాయంతో బాధ పడుతూ చాలాకాలంగా క్రికెట్ దూరమయ్యాడు. ఈక్రమంలోనే అతనికి కాలి బొటనవేలికి గాయం అయింది. మరో పేసర్ ఆకాశ్ దీప్ ఆస్ట్రేలియా పర్యటనలో గాయపడ్డాడు. వెన్నునొప్పితో సతమతమవుతున్న అతడు, ఇంకా కోలుకోలేదు. మరో పేసర్ మోసిన్ ఖాన్ మోకాలి గాయంతో ఏకంగా ఐపీఎల్ కే దూరమయ్యాడు. అతని స్థానంలో శార్దూల్ ఠాకూర్‌ని రీప్లేస్‌మెంట్‌గా టీమ్ యాజమాన్యం తీసుకుంది. ఇక ఐపీఎల్ ఈ సీజన్‌లో లక్నో తొలి మ్యాచ్‌లో ఓడిపోయింది. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ లో వికెట్ తేడాతో పరాజయం పాలైంది. 209 పరుగుల భారీ స్కోరు చేసినప్పటికీ, లక్ము కలిసి రాక ఓడిపోయింది. తమ జట్టులో సరిపడనన్ని బౌలింగ్ వనరులు లేకపోవడంతో ఓటమి చెందామని జట్టు సహాయక కోచ్ లాన్స్ క్లూజనర్ వ్యాఖ్యానించాడు. అవేశ్ రావడంతో జట్టు బౌలింగ్ లైనప్ కాస్త గాడిన పడుతుందని, రీప్లేస్ మెంట్ గా వచ్చిన శార్దూల్ ఆకట్టుకున్నాడని ప్రశంసించాడు. ఢిల్లీపై రెండు వికెట్లతో తను రాణించాడని పేర్కొన్నాడు. ఈనెల 27న సన్ రైజర్స్ హైదరాబాద్ తో హైదరాబాద్ లో లక్నో తలపడుంది. ఈ మ్యాచ్ లో అవేశ్ ఆడే చాన్స్ ఉంది. ఇక అవేశ్ ఎప్పుడు జట్టుతో చేరతాడో అనే దానిపై స్పష్టత లేదు.

రెండు చేతులతో బౌలింగ్ చేస్తున్న కమిందు మెండీస్

ఐపీఎల్ 2025లో తొలి మ్యాచ్‌లో భారీ విజయంతో సన్ రైజర్స్ హైదరాబాద్ జోరు మీదుంది. అదే ఉత్సాహంతో మార్చి 27న ఉప్పల్ వేదికగా లఖ్‌నవూతో జరగనున్న మ్యాచ్ కోసం సిద్ధమవుతోంది. ఈ క్రమంలో సన్‌రైజర్స్ ప్రాక్టీస్ కూడా షురూ చేసేసింది. రెండో మ్యాచ్‌లోనూ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. అయితే సన్‌రైజర్స్ ప్లేయర్ల ప్రాక్టీస్ సెషన్‌లో ఓ ఆల్‌రౌండర్ స్పెషల్ టాలెంట్‌తో ఆకట్టుకున్నాడు.సన్‌రైజర్స్ ఆల్‌రౌండర్ కమిందు మెండీస్ తన మల్టీటాలెంట్‌తో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాడు. సాధారణంగా కుడి చేతితో బౌలింగ్ చేసే కమిందు ప్రాక్టీస్ సెషన్‌లో రెండు చేతులతోనూ స్పిన్ బౌలింగ్ చేస్తూ ఆకట్టుకున్నాడు.

పాక్.. చెత్త ప్రదర్శన

న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో గెలుపు

పాకిస్తాన్ క్రికెట్ జట్టు న్యూజిలాండ్ పర్యటనలో ఉంది. టీ20 సిరీస్ కోసం న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న పాకిస్థాన్ జట్టు చెత్త ప్రదర్శనలను కొనసాగిస్తోంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో.. ఐదు మ్యాచ్‌లలో ఒక్క మ్యాచ్‌లో మాత్రమే మెరుగైన ప్రదర్శన చేసింది. మిగతా మ్యాచ్‌లలో గల్లీ జట్ల కంటే ఘోరంగా ఆడిన పాకిస్థాన్ జట్టు మరోసారి తమ చెత్త ప్రదర్శనలను రిపీట్ చేసింది. ఈ సిరీస్ లోని ఐదో మ్యాచ్ నేడు వెల్లింగ్‌టన్ లోని స్కై స్టేడియం వేదికగా జరిగింది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ దారుణమైన ఓటమిని ఎదుర్కొంది. ఈ మ్యాచ్‌లో కివీస్ జట్టు ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి గొప్ప విజయాన్ని సాధించారు. ఈ మ్యాచ్ లో న్యూజిలాండ్ పాకిస్థాన్ ను ఓడించి సిరీస్‌ను 4-1 తేడాతో గెలుచుకుంది. న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్ లో పాకిస్థాన్ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఐదు కీలక మార్పులు చేసింది. దీని తర్వాత కూడా పాకిస్థాన్ ఈ మ్యాచ్ లో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. పాకిస్థాన్ జట్టుకు మ్యాచ్ ప్రారంభం ముందే మంచి ఆరంభం లభించలేదు. ఎందుకంటే ఓపెనర్ హసన్ నవాజ్ 3 బంతుల్లో డకౌట్ గా వెనుదిరగగా.. మహ్మద్ హారిస్ 17 బంతుల్లో 11 పరుగులు చేసి ఔటయ్యాడు. దీని తర్వాత మూడో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చిన ఉమెర్ యూసుఫ్ కూడా నిరాశపరిచాడు. అతను 7 పరుగులు చేశాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేసిన కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా 39 బంతుల్లో పరుగులు చేసి ఇన్నింగ్స్ ఆడాడు. ఇది కాకుండా షాదాబ్ ఖాన్ 20 బంతుల్లో 28 పరుగులు చేశాడు. 129 పరుగుల సులభమైన లక్ష్యాన్ని న్యూజిలాండ్ జట్టు అలవోకగా ఛేదించింది. న్యూజిలాండ్ ఆటగాళ్లు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ 38 బంతుల్లో 97 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో 6 ఫోర్లు, 19 సిక్సర్లు ఉన్నాయి. అదే సమయంలో ఫిన్ అలెన్ 12 బంతుల్లో 27 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. న్యూజిలాండ్ కేవలం 10 ఓవర్లరోనే లక్ష్యాన్ని చేరుకుంది. 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ మ్యాచ్ ను గెలుచుకుంది. ఈ 5 మ్యాచ్ ల సిరీస్ లో పాకిస్థాన్ రెండో టీ20లో మాత్రమే గెలిచింది. మిగిలిన 4 మ్యాచ్ లలో పాకిస్థాన్ కు నిరాశ ఎదురైంది. న్యూజిలాండ్ విజయంలో క్రెడిట్ జేమ్స్ నీషమ్ కు దక్కుతుంది. ఎందుకంటే జేమ్స్ నీషమ్ ఈ మ్యాచ్ లో తన అద్భుతమైన బౌలింగ్ తో అదరగొట్టాడు. తాను వేసిన 4 ఓవర్లలో 22 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అతనితో పాటు జాకబ్ డఫీ 2 వికెట్లు పడగొట్టాడు. పాకిస్థాన్ తరపున సూఫియా ముఖీమ్ రెండు వికెట్లను పడగొట్టాడు.

ఆ డబ్బును వెనక్కి ఇచ్చేస్తాడా?

- సపోర్టు స్టాఫ్‌కు పంచమని డబ్బులు తిరిగిగిచ్చిన ద్రవిడ్
- సునీల్ గవాస్కర్ కీలక వ్యాఖ్యలు

ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న భారత జట్టుకు బీసీసీఐ రూ.58 కోట్ల నగదు బహుమతిని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో ఆటగాళ్లు, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు చెరో రూ.3 కోట్లు లభిస్తాయి. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రకారం.. అసిస్టెంట్ కోచ్‌లు, సహాయక సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.50 లక్షలు, బీసీసీఐ అధికారులకు రూ.25 లక్షలు అందుతాయి. అయితే టీ20 ప్రపంచకప్ 2024 గెలిచినప్పుడు అప్పటి ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తన ప్రైజ్ మనీని వెనక్కి ఇచ్చి సహచరులకు సమంగా పంచాలని కోరారు. ఈ అంశంపై స్పందించిన సునీల్ గవాస్కర్.. మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ లాగా గౌతమ్ గంభీర్ తన సపోర్టు స్టాఫ్‌కు పంచమని డబ్బులు తిరిగి వెనక్కి ఇచ్చేస్తాడా? అని ప్రశ్నించారు. 2024లో టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం ద్రవిడ్ తన మిగిలిన సహాయక సిబ్బందితో సమానమైన నగదు బహుమతిని తీసుకున్నాడు. అయితే గంభీర్ ఇంకా అలాంటి ప్రకటన చేయలేదు. "టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం టీమిండియాకు, ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు బీసీసీఐ నగదు బహుమతిని ప్రకటిం చింది. కానీ ద్రవిడ్ ఆ మెత్తాన్ని వెనక్కి ఇచ్చేసి సహచరులకు సమానంగా పంచమన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజేతగా టీమిండియా నిలిచిన తర్వాత కూడా బీసీసీఐ రివార్డును ప్రకటించింది. నగదు బహుమతులను ప్రకటించి పక్షం రోజులు అయింది. ప్రస్తుత కోచ్ గౌతమ్ గంభీర్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. ఈ విషయంలో ద్రవిడ్ మంచి రోల్ మోడల్ కాదా?" అంటు సునీల్ గవాస్కర్ స్పోర్ట్ స్టార్ కోసం కాలంలో ఇలా రాసుకొచ్చారు. ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్నందుకు క్రికెటర్లకు బహుమతులు ఇచ్చినందుకు గవాస్కర్ బీసీసీఐని ప్రశంసించారు. గతేడాది జులైలో ఐసీసీ టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత జట్టు, సహాయ క సిబ్బంది, సెలెక్టర్లకు రూ.125 కోట్లు ప్రకటించింది. ఇలా చేయడం వల్ల ప్రతి ఒక్కరికీ భారీ మొత్తం లభిస్తోంది."అని సునీల్ గవాస్కర్ పేర్కొన్నారు.

జట్టులో చోటు దక్కలేదని తెలిసి ఎంతో బాధపడ్డా

స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్

2025 ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో చోటు దక్కకపోవడంపై స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ తొలిసారి స్పందించాడు. జట్టులో చోటు దక్క లేదని తెలిసి ఎంతో బాధ పడినట్లు పేర్కొన్నాడు. అది జీర్ణించుకోవడం చాలా కష్టం అయ్యిందని తెలిపాడు. కెప్టెన్ రోహిత్ శర్మ, మేనేజ్ మెంట్ జట్టుకు ఏది మంచిదో అదే ఆలోచిస్తారని అన్నాడు. మంగళవారం గుజరాత్- పంజాబ్ మ్యాచ్‌కు ముందు సిరాజ్ ఈ కామెంట్స్ చేశాడు. 'ఇంటర్నేషనల్ ప్లేయర్లు అన్ని ఐసీసీ టోర్నమెంట్‌ల్లో ఆడాలని అనుకుంటారు. నేను కూడా అలానే అనుకుంటా. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక కాలేదని తెలిశాక చాలా బాధపడ్డా. అది జీర్ణించుకోలేకపోయాను. కానీ, రోహిత్ భాయ్ జట్టుకు ఏది ఉత్తమమో అదే చేస్తాడు. అతడికి చాలా అనుభవం ఉంది. దుబాయ్ పిచ్‌లపై పేసర్ల ప్రభావం తక్కువగా ఉంటుందని అతడికి తెలుసు. అందుకే కెప్టెన్ గా స్పిన్నర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. ఏదైతే నేం ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచాం. అది సంతోషం' అని సిరాజ్ అన్నాడు.ఛాంపియన్స్ ట్రోఫీ- ఐపీఎల్ మధ్యలో బ్రేక్ తనకు ప్రాక్టీస్ చేసుకునేందుకు ఉపయోగపడిందని అన్నాడు. 'కొంతకాలంగా నేను బ్రేక్ లేకుండా క్రికెట్ ఆడుతున్నా. అయితే మ్యాచ్‌ల్లో ఆడుతున్నప్పుడు మన తప్పులను తెలుసుకోలేము. అందుకే ఈ బ్రేక్‌ను వాడుకున్నా. ఫిట్‌నెస్, ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టాను' అని పేర్కొన్నాడు. అయితే భారత్ తమ మ్యాచ్‌లు ఆడే దుబాయ్ పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలం అని మేనేజ్‌మెంట్ భావించింది. అందుకే ఈ టోర్నీకి జట్టులో ఐదుగురు స్పిన్నర్లకు చోటు కల్పించింది. దీంతో సిరాజ్‌ను పక్కనపెట్టాల్సి వచ్చిందని రోహిత్ అప్పుడే క్లారిటీ ఇచ్చాడు. కాగా, 2023 వన్డే, 2024 టీ20 వరల్డ్‌కప్ టోర్నీల్లో మాత్రం సిరాజ్‌కు చోటు దక్కింది.

కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్న కార్పొరేట్ సంస్థలు

- బహుళ అంతస్తుల నిర్మాణ సంస్థలు, బడా కంపెనీల వలస కార్మికులకు సరిపడా జీతభత్యాలు లేవు
- కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటమగదు
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి పర్వతాలు

శంషాబాద్, మార్చి 26 (జనంసాక్షి): తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 21, 22తేదీలలో శంషాబాద్‌లో నిర్వహి స్తున్నామని రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు పానుగంటి పర్వతాలు తెలిపారు. రాష్ట్ర మహాసభలలో భవన నిర్మాణ మేస్త్రీలు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఏఐటియుసి నాయకులు బుధవారం హోటల్లో కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ.. వలస కార్మికులను ఇతర రాష్ట్రాల నుండి తీసుకొచ్చి పనికి తగ్గ వేతనాలు ఇవ్వకుండా వారి శ్రమను దోచుకుంటున్న గుత్తేదారులు బహుళ అంతస్తుల నిర్మాణ కంపెనీల యాజమాన్యాల పైన కఠిన మైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇతర రాష్ట్రాల నుండి వలస కార్మికులను తీసుకొచ్చి ఎక్కువ పని గంటలు చేపిస్తూ, సరైన వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న యాజమా న్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏమాత్రం సేఫ్టీ లేకుండా వారితో పని చేయించి ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయిన అంగవైకల్యం కలిగిన, నష్టపరిహారం ఇవ్వకుండానే యాజమాన్యాలు గుత్తేదారులు కలిసి వారి సొంత రాష్ట్రాలకు తరలిస్తున్నారని మండి పడ్డారు.

వలస కార్మికుల బ్రతుకులు దయనీయంగా ఉన్నాయి వారి సమస్యల మీద రాబోయే కాలంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మహిళా కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారు. తక్షణమే జిల్లాలోని లేబర్ గడ్డల దగ్గర బాత్రూంలు నిర్మించాలి. లేనియెడల షెడ్డుల నిర్మాణాలు చేపట్టాలి. అన్నపూర్ణ పథకం ద్వారా ఐదు రూపాయల భోజన సదుపాయం కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి. కల్పించకపోతే రాబోయే కాలంలో ప్రసంగటితరంగా కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను నిర్వహిస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.

రాష్ట్ర మహాసభల మొదటి రోజు ఏప్రిల్ 21న మధ్యాహ్నం 12 గంటలకు శంషాబాద్‌లో భారీర్యాలీ నిర్వహించి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ బహిరంగ సభలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ యాదగిరి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహా రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్రాగిరి, జిల్లా నాయకుడు అన్నపు ప్రభు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధే తన అంతిమ ధ్యేయం

పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి, మార్చి 26 (జనంసాక్షి) : నియోజకవర్గ సమగ్ర, సంతులిత అభివృద్ధే తన ముఖ్య ఉద్దేశ్యమని, తన రాజకీయ జీవితం కొనసాగినంత కాలం వారి శ్రేయస్సు కోసం పరితపిస్తానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజి కాలనీలో 98.5 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలలో డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డితో కలిసి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజి కాలనీలో 98 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన సిసి రోడ్ల నిర్మాణపు పనులను, వరద నీటి కాల్వ నిర్మాణం పనులను ప్రారంభించుకోవడం శుభ పరిణామం అన్నారు. మొదటి నుండి శేరిలింగంపల్లి ప్రజలు తనను ఎంతో ఆదరాభిమానాలతో ఆశీర్వదిస్తూ వస్తున్నారని, శేరిలింగంపల్లి ప్రజలంటే తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని, అందుకే ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎన్ని ఇబ్బందులనైనా ఓర్చుకొని ముందుకు సాగుతానని పిఎసి చైర్మన్ అరికెపూడి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని, తెలంగా ణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని, ఇందుకోసం పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోకజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిచేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్లుసహా ఇతర అభివృద్ధి పనులను అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాల తో చేపట్టాలని, ఎక్కడా రాజీ పడకూడదని సూచించారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత సుఖవంతమైన మెరుగైన రవాణా సౌకర్యంకొరకు శాయశక్తులా కృషి చేస్తానని పునరుద్ఘాటిం చారు. ఈ క్రమంలో ఎమ్ఐజి కాలనీలో 49.5 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వరద నీటి కాలువ నిర్మాణం పనులకు ఈ సందర్భంగా శంకుస్థాపన గావించారు. ఈ క్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సహజ కాన్పుల కంటే సిజేరియన్ డెలివరీలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా డబ్బుకు కక్కుర్తి పడి జోగులాంబ గద్వాల జిల్లాలోని చాలా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు గర్భిణులను సిజేరియన్లకు వెళ్లేలా చేస్తున్నాయి. ఉమ్మ నీరు తక్కువుందని, శిశువు ఎక్కువ రోజులు గర్భంలో ఉంటే నీరు మింగుతుందని, బిడ్డ అడ్డం తిరిగిందని గర్భిణి గుండె వేగంగా కొట్టుకుంటోందని, ఇలా రకరకాల భయాలు చెప్పి గర్భిణి కడుపు కోసి బిడ్డను తీస్తున్నారు. కొందరు ముహూర్తాలు, ఇతర సొంత కారణాలతో అనుకున్న తేదీ, సమయానికి బిడ్డ పుట్టాలని సిజేరియన్లు చేయించుకుంటు న్నారు. జిల్లాల్లో డెలివరీ ఆపరేషన్లు నిత్యకృత్యమయ్యాయి. సిజేరియన్లతో దీర్ఘకాలంలో తల్లికి ఎదురయ్యే ఇబ్బందులపై చెప్పాల్సిన వైద్యులే అవసరం లేకున్నా ఆపరేషన్లు చేయడం శోచనీయం.

బిడ్డ పుట్టాలంటే కోత తప్పదా?

డబ్బుల కోసం ఎడాపెడా ఆపరేషన్లు

గద్వాల జిల్లాలో పెరుగుతున్న ప్రైవేట్ దోపిడీ

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన సాధారణ ప్రసవాలు
- గత 11 నెలల్లో ప్రైవేట్ ఆస్పత్రిలో 1,911 సీజరియన్లు
- ప్రైవేట్‌లో తగ్గిన నార్మల్ డెలివరీలు పెరిగిన సిజేరియన్లు

సాధారణ ప్రసవానికి ముందుకు రావాలి

గతం కంటే ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతుంది. సాధ్యమైనంత మేరకు సిజేరియన్లు అరికట్టి, సహజ కాన్పులు పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. చాలా మంది గర్భిణులు సిజేరియన్ చేయించుకుంటు ండం ఆందోళన కలిగిస్తోంది. ఇది మహిళల ఆరోగ్యానికి శాపంగా మారుతుంది. ఈ సీజరియన్ ఆపరేషన్లో బాలింతలకు కుట్లు మానకపోవడం, ఇన్ఫెక్షన్ సమస్యలు వస్తుంటాయి. కొందరికి గర్భాశయ సమస్యలు వస్తుంటాయి. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు అందించడం సిజేరియన్లో వీలు పడదు. ఇది బిడ్డ ఇమ్యూనిటీకి కూడా ఇబ్బంది కరమే. గర్భిణులు సాధారణ ప్రసవానికి ముందుకు రావాలి. కొందరు మంచి ముహూర్తాలు పెట్టుకొని ఆస్పత్రుల్లో డెలివరీలు చేయించుకున్నట్టు ఫిర్యాదు అందితే పోలీసులతో కలిసి మా శాఖ కూడా చర్యలు తీసుకుంటుంది.

-గర్భిణీ, శిశు వైద్యులు, ప్రసన్న రాణి

రాజోలి, మార్చి 26 (జనంసాక్షి) :

గర్భిణులను కడుపు'కోత'లు కలవర పెడుతున్నాయి. సహజ ప్రసవానికి అవకాశం ఉన్నా సంపాదనే లక్ష్యంగా పలు ప్రైవేట్ గైనకాలజిస్టులు ఆడ్డగోలుగా సిజేరియన్లు చేస్తూ మహిళల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. జిల్లాలో చాలా ప్రైవేట్ ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీల ఊసే లేకుం డా పోతోంది. సిజేరియన్లకు అవి కేరాఫ్ అడ్రస్‌గా మారా యి. అవసరం లేకున్నా సిజేరియన్లు చేస్తున్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మహిళలకు ప్రసవాల సమయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నా అధికారులు, ప్రైవే ట్ వైద్యులు పట్టించుకోవడం లేదు. ప్రైవేట్‌లో ప్యాకేజీల పేరున భారీగా ఫీజుల రూపంలో డబ్బులు వసూలు చేస్తూ సిజేరియన్ ప్రసవాలను చేస్తున్నారు. ఆపరేషన్ చేస్తే భవిష్యత్తులో గర్భ సంచులకు ఇబ్బందులు ఎదురవుతాయని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించినా జిల్లాలో మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు.

జోగులాంబ గద్వాల జిల్లాలోనూ అదే తీరు

జిల్లాల్లో 18 కార్పొరేట్, ప్రైవేట్ నర్సింగ్ హోంలు అడ్డూ అదుపు లేకుండా వ్యవహరిస్తున్నాయి. సంపాదనే లక్ష్యంగా బాలింతల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. గర్భిణులకు సహజ ప్రసవానికి అవకాశం ఉన్నా ఉమ్మ నీరు తక్కువ ఉందని బిడ్డ అడ్డం తిరిగిందని..గుండె వేగంగా కొట్టుకుంటోదని..గర్భిణి బలహీనంగా ఉందని.. రక్తం తక్కువ ఉందని..పురిటి నొప్పులు భరించలేదని.. నార్మల్‌కు వెళ్తే తల్లీ బిడ్డ ప్రాణాలకు తాము గ్యారంటీ ఇవ్వలేమని..ఇలా రకరకాల కారణాలు చెబుతూ గర్భిణుల కుటుంబీకులను భయభ్రాంతులకు గురి చేస్తూ సిజేరియన్లకు ఒప్పుకునేలా చేస్తున్నారు. సహజ ప్రసవాలకు గర్భిణులను దూరం చేస్తున్నారు. తద్వారా భవిష్యత్తులో తల్లుల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నారు. సహజ కాన్పుతో పోలిస్తే సిజేరియన్ డెలివరీకి పట్టే సమయం చాలా తక్కువ. సర్జరీ చేస్తే ఆస్పత్రికి ఆదాయమూ భారీగానే సమకూరుతుంది. ఈ రెండు అంశాలూ గైనకాలజిస్టులకు కలిసి వచ్చే అంశాలు. కానీ సిజేరియన్లతో తల్లులకు భవిష్యత్తులో కలుగుతున్న ఇబ్బందులను ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్న వైద్యులు పట్టించుకోవడం లేదు. ప్రసవాలు తర్వాత తరచూ కడుపు నొప్పి, ఇన్ఫెక్షన్, స్థూలకాయం, నెల సరి సక్రమంగా కాకపోవడం తదితర సమస్యలకు కారణమవుతున్నట్లు వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పురిటి నొప్పులు తట్టుకోలేక

ఒక్కప్పుడు గర్భం దాల్చింది మొదలు..ఇంట్లో ఉన్న పెద్ద వాళ్లు మహిళల్ని సహజ ప్రసవానికే మానసికంగా సిద్ధం చేసేవారు. ఇప్పుడలాంటి పరిస్థితి లేదు. మా బిడ్డ సున్నితంగా పెరిగింది. నొప్పులు తట్టుకోలేదంటూ తల్లిదండ్రులు.. మా ఆవిడ కష్టపడటం చూడలేనంటూ భర్తలు..వామ్మో ఐదారు గంటలు నొప్పులు పడటం నా వల్ల కాదు.. సిజేరియన్ చేయండి అంటూ గర్భిణులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి వారంతా ప్రైవేట్ ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే సిజేరియన్లు ఎక్కువ

గద్వాల జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్భిణికి కడుపు కోత తప్పడం లేదు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 25 వరకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో 3,001 మంది గర్భిణులు డెలీవరీలు కాగా వాటిల్లో 1,090 మందికి సహజ కాన్పులు 1,911 మంది గర్భిణులకు సిజేరియన్ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మొత్తం 5,774 గర్భిణీ మహిళలు డెలివరీ కాగా, 4,310 సహజ కాన్పులు కాగా, 1,464 సిజేరియన్లు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులకు విరుద్ధంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లే ఎక్కువయ్యాయి.

పెరుగుతున్న ముహూర్తాల కల్చర్

పట్టుబోయే బిడ్డకు మంచి రోజు, తిథి, నక్షత్రం, వారం చూసుకొని మరీ సిజేరియన్ చేయిస్తున్న

భద్రాచలంలో భవనం కూలిన ఘటనపై సమగ్ర విచారణ చేయాలి

హైదరాబాద్, మార్చి 26 (జనంసాక్షి) : భద్రాచలంలో భవనం కూలిన ఘటనపై సమగ్ర విచారణ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి **జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.** భద్రాచలం పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్తుల భవనం కూలిపోయిన సందర్భంగా సుమారు 7గురు మరణించినట్లు తెలుస్తోందని, మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చనే వార్త ఆందోళన కలిగిస్తోందని, ఒక పాత బిల్డింగ్‌ను దేవాలయంగా మార్చి, బలహీనమైన పునాదులు, పిల్లర్ల మీద ఈ భారీ నిర్మాణం చేపట్టడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని తెలుస్తోందని పేర్కొన్నారు. ఈ భవనం నిర్మాణం మీద స్థానిక అధికారులకు ఇప్పటికే అనేక ఫిర్యాదులందాయని, అధికారులు కఠినంగా వ్యహరించినట్లయితే ప్రమాదం జరిగేది కాదని, నిర్మాణం నిలుపుదల చేయించడంలో అధికారుల అలసత్వం వెల్లడవుతున్నది. ఇప్పటికైనా పట్టణంలోని అక్రమ కట్టడాలను నిలుపుదల చేయించాలని, ఈ ఘటనపై సంబంధిత భవన నిర్మాణదారుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రు.50లక్షల ఎక్స్గ్రేషియో ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొడాలి నానికి అస్వస్థత..ఆస్పత్రిలో చేరిక

హైదరాబాద్, మార్చి26 (జనంసాక్షి) : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కొడాలి నాని తీవ్ర అస్వస్థతకు గురయ్యారట.. హైదరాబాద్‌లో ఉన్న కొడాలి నాని అస్వస్థతకు గురయ్యారు.. ఛాతిలో నొప్పిరావడంతో.. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఏఐజీ ఆస్పత్రికి తరలించారు.. ప్రస్తుతం ఏఐజీ ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. కొడాలి నాని గ్యాస్ట్రిక్ సమస్యతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారని చెబుతున్నారు ఏఐజీ వైద్యులు.. కాగా, గతంలో గుండె సంబంధిత సమస్యలతో కొడాలి నాని ఇబ్బంది పడ్డారు.. దీంతో, ఇప్పుడు గ్యాస్ట్రిక్ సమస్యేనా..? లేక మళ్లీ గుండెకు సంబంధించిన ఏదైనా ఇబ్బంది జరిగిందా? అనేది తేల్చేందుకు సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న కొడాలి నాని.. గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుస విజయాలు సాధించారు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో.. వైఎస్ జగన్ తొలి కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.. జగన్ కేబినెట్ 2.0లో ఆయనకు మంత్రి పదవి దక్కలేదు.. ఇక, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కొడాలి నాని మరోసారి గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగినా ఓటమి పాలైన విషయం విదితమే..

దిలావర్‌పూర్ మాదిరిగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

పెద్దధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయండి

- రైతుల కడుపు కొట్టే ఫ్యాక్టరీ వద్దే వద్దు
- అవసరమైతే సీఎం రేవంత్ రెడ్డి ఇలాక కొడంగల్‌లో పెట్టుకోండి
- దయచేసి రైతుల జీవితాలతో, ప్రజల ప్రాణాలతో ఆటలొద్దు
- శాసన మండలిలో గళమెత్తిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

హైదరాబాద్, మార్చి 26 (జనంసాక్షి) : దిలావర్‌పూర్ మాదిరిగా పెద్దధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీపై రాష్ట్రం ప్రభుత్వం పునరాలోచించాలని, ఫ్యాక్టరీని రద్దు చేయాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కోరారు. శాసన మండలిలో వెంకట్రామిరెడ్డి ప్రజా సమస్యలపై మాట్లాడారు. అలంపూర్ నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా ఉన్నారని వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్నారని ఆయన శాసన మండలి దృష్టికి తీసుకువచ్చారు. రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని, 12 గ్రామాలు పైగా ప్రజలు దీన్ని వ్యతిరేకిస్తున్న కూడా అనుమతులను రద్దు చేయడం లేదని వెంటనే ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని సభాపతికి విన్నవించారు. సంబంధిత మంత్రి దీనిపై చొరవ తీసుకోవాలని కోరారు. మంత్రి సీతక్కని ఉద్దేశిస్తూ 'మా దగ్గర అందరూ రైతులే ఉన్నారమ్మ వారి కడుపు కొట్టకండమ్మ' అని రైతుల తరపున ఫ్యాక్టరీ రద్దు నినాదాన్ని వినిపించారు. జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుకు కూడా ఈ సమస్య తెలుసని ఎట్టి పరిస్థితుల్లో ఫ్యాక్టరీ నిర్మాణం జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అవసరమైతే ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి సొంత ఇలాఖా కొడంగల్ లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫ్యాక్టరీ వల్ల భూగర్భ జలాలు కలుషితమై, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, ఇలాంటి ఫ్యాక్టరీ వల్ల ఇప్పటికే నియోజకవర్గంలో సమస్యలు ఎదుర్కొంటున్న గ్రామాలు ఉన్నాయని శాసన మండలి దృష్టి కి తీసుకువచ్చారు. మున్సిపాలిటీ లు ఏర్పాటు చేసే క్రమంలో మున్సిపాలిటీ కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామ పంచాయతీలను తీసుకువచ్చి అందులో కలిపేశారని, దానివల్ల ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆ గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచులు లేక పంచాయతీ సెక్రటరీలతో పాలన నడుస్తుండగా ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయని వాటిని పట్టించుకునేందుకు సర్పంచులు లేకపోవడం వల్ల, నిర్వహణ లేక గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేకపోతున్నాయని, కాబట్టి సర్పంచ్ ఎన్నికలు జరపాలని దానివల్ల కేంద్రం నుంచి నిధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- ఆనాడు మాకు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు
- రేవంత్ మంచోడు కాబట్టే..మీరు మాట్లాడుతున్నారు
- అసెంబ్లీలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఘాటు విమర్శలు

హైదరాబాద్, మార్చి26 (జనంసాక్షి) : అధికారంలో ఉన్న పదేళ్లు బీఆర్ఎస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ఆనాడు విపక్ష సభ్యులను కనీసం మాట్లాడడానికి కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. అంతేగాకుండా విపక్షమే లేకుండా చేయాలని కుట్ర చేశారని మండిపడ్డారు. తెలంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టే బీఆర్ఎస్ నేతలు ఇంకా ప్రశాంతంగా ఫామ్ హౌజ్‌లో ఉన్నారని లేదంటే.. నిన్నటి దాకా ఒక లెక్క ఇప్పటి నుంచి ఒక లెక్క అనేలా పరిస్థితి ఉండేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో 8 వేల హత్యలు.. లక్ష దొంగతనాలు జరిగాయని.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన అహంకారంతో సాగిందని.. తప్పుడు నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన అధికార దుర్వినియోగానికి ఉదాహరణ అని అన్నారు.పోలీస్ అధికారులు కూడా బీఆర్ఎస్ అధికార దాహానికి బలయ్యారని.. బీఆర్ఎస్ పెద్దలు చెప్పిన అందరి ఫోన్లు ట్యాప్ చేసి ఇప్పుడు ఇబ్బందుల్లో చిక్కుకున్నారని అన్నారు. బీఆర్ఎస్ చేయించిన పాపాలతో పోలీసులు విదేశాలకు పారిపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పోలీసు వ్యవస్థను దారుణంగా వాడుకుందని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్ పీసీసీ పదవిని రూ. 50 కోట్లకు కొన్నడని కోమటి రెడ్డి అన్నాడని కెటిఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపై కోమటి రెడ్డ రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం లేకుండా చేసిన బీఆర్ఎస్.. ఇప్పుడు మాకు నీతులు చెప్తున్నారని ఎద్దేవ చేశారు. ఎన్నో తప్పుడు నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. మీకు నాయకుడే లేడు.. సభకు రావడమే మానేశారని తెలిపారు. ప్రజల సమస్యలు చెప్పడానికి సభకే రావడం లేదు. రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టి మీరు ఇంకా ఫామ్ హౌస్ లో ప్రశాంతంగా ఉన్నారు. లేకుంటే నిన్నటి నుంచి ఒకలెక్కా.. ఇవాళ్టి నుంచి ఇంకో లెక్క అన్నట్టు ఉండేది.సైరన్ సప్పుడు లేకుండా తిరుగుతున్నారు కాబట్టి వాళ్ళు అంత పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ లీడర్లు అందరి ఫోన్లు ట్యాప్ చేసి అధికార దాహానికి బలై పోయారు. అహంకారంతో సాగింది బీఆర్ఎస్ పాలన.. మేము ఆరుగురం ఉన్నప్పుడు మా గొంతు నొక్కారు. సభ మీ సొంతమా అని అడిగారు. ఇప్పుడు నేను అడుగుతున్న.. సభ మీ సొంతమా మరి.. వచ్చినప్పటి నుండి ఒకటే గొడవ.. మీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది.. ఆ టైమ్ ప్రజల కోసం కేటాయిస్తే చాలు అని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు.

కమీషన్ల కాంగ్రెస్ పాలన

- అసెంబ్లీ ప్రవేశద్వారం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

హైదరాబాద్, మార్చి26 (జనంసాక్షి) : కమీషన్లతోనే కాంగ్రెస్ పాలన సాగుతుందని బీఆర్ఎస్ సభ్యులు అన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బుధవారం కేటీఆర్ మాట్లాడిన తరువాత భట్టి కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటుగా స్పందించారు. దీనిపై బీఆర్ఎస్ శ్రేణులు వద్దురా నాయనా 20 పర్సంట్ పాలన అంటూ.. అసెంబ్లీ ఎమ్మెల్యేల ప్రవేశ ద్వారం వద్ద నిరసన తెలిపారు. ఇది పర్సంటేజ్‌ల పాలన అంటూ బీఆర్ఎస్ నినాదాలు నినాదాలు చేశారు. ఇదేమి ప్రభుత్వం.. 20 శాతం, 30 శాతం పర్సంటేజీల ప్రభుత్వం అని కాంగ్రెస్ సర్కారుపై ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఉదయం శాసనసభలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా సచివాలయంలో కమీషన్లపై, కాంట్రాక్టర్ల ధర్నా గురించి కేటీఆర్ ప్రస్తావించారు. కేటీఆర్ వ్యాఖ్యలపై భట్టి విక్రమార్క స్పందిస్తూ.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని అన్నారు. భట్టి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనుచిత వ్యాఖ్యలపై భట్టి విక్రమార్క క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు.

ఉపాధి కూలీలకు అండ

- పని క్షేత్రాల్లో రక్షణ చర్యలు

నిజామాబాద్, మార్చి26 (జనంసాక్షి) : జిల్లాలో వేసవి నిబంధనలతో ఉపాధిహామీ పనులను చేపడుతున్నారు. పూర్తి రక్షణ చర్యలతో పనులకు హాజరయ్యేలా డీఆర్‌డీవో అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. మరోవైపు ఎండల ప్రభావం అధికంగా ఉండడంతో కూలీలు పనిచేసే ప్రాంతాల్లో వసతులు కల్పిస్తున్నారు. నీడతో పాటు మంచినీటి సదుపాయం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామసభల్లో గుర్తించిన పనులను చేపడుతూ స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉపాధిహామీ పథకంలో భాగంగా నీటిగుంటలు, ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకం, కందకాలు, చెక్‌డ్యాం కాలువల్లో పూడికతీత పనులు ఊటకుంటలు, టేకు నర్సరీలు, కిచెన్ షెడ్‌లు, గడ్డి పెంపకం, పశువుల నీటి తొట్టెలు, పండ్లతోటల పెంపకం, డంపింగ్‌యార్డులు, మరుగుదొడ్ల నిర్మాణం, నీటి నిల్వలకు సంబంధించిన పనులు, ప్రభుత్వ పాఠశాలలో వంటశాలల నిర్మాణాలను చేపడుతారు.కూలీల సంఖ్యను మరింత పెంచేందుకు ఎంపీడీవోలు, ఉపాధిహామీ ఏపీవోలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కూలీలకు పనిరోజులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం అధికారులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గ్రామాల్లో పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తాయి. జూన్‌నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంలో కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. వేసవిలో గ్రామాల్లోని పేదలు వ్యవసాయ కూలీలు పనులు లేకపోవడంతో ఎక్కువ మంది ఉపాధిహామీ పనులపై ఆధారపడుతున్నారు.

భూ భారతి చట్టంతో రెవెన్యూ శాఖ బలోపేతం

- గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనేది ప్రభుత్వ సంకల్పం
- భూభారతి చట్టంలో తహశీల్దార్లు, ఆర్డీఓలు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

ములుగు, మార్చి 26 (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంతో రెవెన్యూ శాఖ బలోపేతం అవుతుందని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. నూతన చట్టంతో త్వరలోనే భూ సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం దొరుకుతుందన్నారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణగా మార్చేందుకు రెవెన్యూ ఉద్యోగులు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ములుగు జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టంతో రెవెన్యూ శాఖతో పాటు రెవెన్యూ సేవలలో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం బ్10,954 మంది గ్రామ పాలన అధికారులను ఆప్షన్ల ద్వారా నియామకం చేస్తుందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల ఆకాంక్ష, ఉద్యోగుల పోరాటానికి ప్రభుత్వ సహకారం తోడవడంతో రెవెన్యూ శాఖలోకి గ్రామ స్థాయిలో రెవెన్యూ సేవలు అందించేందుకు మార్గం సుగమం అయ్యిందన్నారు. అయితే రాష్ట్రంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించేందుకు రెవెన్యూ శాఖ ఉద్యోగులు సైనికులుగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ సహకారంతో తక్కువ సమయంలోనే ఎక్కువ విజయాలు సాధించామని, రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాదించామన్నారు. అలాగే గతంలో ధరణిలో తహశీల్దార్లకు, ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్ల అధికారాలు లేని కారణంగా రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించే పరిస్థితి లేదన్నారు. కానీ త్వరలోనే అమల్లోకి రాబోతున్న భూ భారతి చట్టంలో తహశీల్దార్లకు ఆర్డీఓలకు, జేసీలకు అధికారాలు ఉంటాయన్నారు. భూ భారతి చట్టం ద్వారా రాష్ట్ర రాజధానిలోని సీసీఎల్ఏ నుండి గ్రామ పరిపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరిగిందన్నారు. జీపీవోల వలన రైతులకు గ్రామ స్థాయిలో సేవలు అందడంతో పాటు సత్వర సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. జీఓ నం.317 రాష్ట్రంలో ఉద్యోగులను చిన్నాభిన్నం చేసిందన్నారు. ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలకు సైతం చెట్టుకొక్కరికి పుట్టకొక్కరికి పోస్టింగ్ లు ఇచ్చారన్నారు. జేఏసీ ఉద్యమ ఫలితంగా ఉద్యోగుల ఆంక్షలను, 317 జీవోలోని నిబంధనలను ప్రభుత్వం సడలించిందన్నారు. పూర్వ వీఆర్ఏలు వేరువేరు జిల్లాలకు బదిలీ అయిన వారిని తిరిగి వారి సొంత జిల్లాకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, జనగామ ఆర్డీవో గోపిరామ్, స్టేషన్ గన్పూర్ ఆర్డీవో వెంకన్న, హన్మకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, టీజీటీఏ సెక్రటరీ జనరల్ పూల్ సింగ్, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షులు పి.రాధ, టీజీటీఏ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ చిల్ల శ్రీనివాస్, టీజీఆర్ఎస్ఏ మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత చౌహాన్, టీజీఆర్ఎస్ఏ సీసీఎల్ఏ విభాగం అధ్యక్షులు కృష్ణ చైతన్య, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని తహశీల్దార్ లు, ఉమ్మడి వరంగల్ జిల్లా టీజీటీఏ, ఉమ్మడి వరంగల్ జిల్లా టీజీఆర్ఎస్ఏ కార్యవర్గ నేతలు ఇక్బాల్, అల్లం రాజు కుమార్, నాగేశ్వరరావు, విక్రమ్ కుమార్, విశ్వప్రసాద్, రంజిత్ కుమార్, రేణుక గిరిబాబు, సురేష్ బాబు, సమ్మయ్య, మేఘన, మమత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీపై ఉన్న కోపాన్ని రైతులపై చూపొద్దు

- నీరుఅందక అష్టకష్టాల్లో రైతులు : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- ఎండిపోయిన పంటల పరిశీలన

జోగులాంబ గద్వాల, మార్చి26(జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై ఉన్న కోపాన్ని రైతులపై చూపిస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో ఎండిన పంట పొలాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. యాసంగిలో రాష్ట్రంతోపాటు జోగులాంబ గద్వాల జిల్లాలోని నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో పంటలు ఎండుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం సమావేశం నిర్వహించకుండా యాసంగి పంటల ప్రణాళిక రూపొందించిందని చెప్పారు. వరంగల్ డిక్లేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసాను మూడు ఎకరాలతోనే బందు చేసిందని అన్నారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి ఒట్లు వేసి అటు దేవుళ్లను, ఇటు రైతులను నిండా మోసం చేశాడని ఆరోపించారు. ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల నుంచి వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రేలంపాడు రిజర్వాయర్‌లో నాలుగు టీఎంసీల నీటిని నిలువ చేసుకోలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ యాసంగిలో రైతులు ప్రభుత్వం, అధికారుల మాటలు విని పంటలు సాగు చేస్తే.. ఆ పంటలకు ప్రస్తుతం నీరులేక ఎండిపోయి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే వారికి నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ పరిధిలో గత 50 ఏళ్ల కాలంలో ఏనాడు కూడా ఇలాంటి పరిస్థితి కనిపించ లేదని మాజీ మంత్రి అన్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ కింద 47,000 ఎకరాలలో రైతులు వివిధ పంటలు సాగుచేశారని, ప్రస్తుతం పది రోజులుగా నీరు నిలిచిపోవడంతో పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఇక్కడి రైతుల పొలాలకు నీరు ఇచ్చి పంటలను కాపాడలేక పోయారని వాపోయారు. ముఖ్యమంత్రి తన సీటును కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంటే నీటిపారుదల మంత్రి రైతుల బాగోగులు పట్టించుకోకుండా ఆ సీటుపై కన్నేశాడని అన్నారు. పాలమూరు జిల్లా మంత్రికి కక్షలు కార్పణ్యాలపై ఉన్న శ్రద్ధ రైతుల పంటలను కాపాడడంలో లేదని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీయే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉందని, అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఓవైపు పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే వారిని పరామర్శించడానికి కూడా ఈ నాయకులకు తీరిక లేదని విమర్శించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370